పుస్తక ప్రియులకు ఇదే మా ఆహ్వానం
38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం), హైదరాబాద్
డిసెంబర్ 19 నుండి 29 వరకు - మ॥ 1 నుండి రా॥ 9 వరకు
నవచేతన బుక్ హౌస్ స్టాల్ నం. 292 - 295
నవచేతన పబ్లిషింగ్ హౌస్ స్టాల్ నం. 339 - 344

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడిగా దగ్గుబాటి సురేశ్‌బాబు ఎన్నిక
● ఉపాధ్యక్షులుగా సూర్యదేవర నాగవంశీ, భరత్



12

సంపుటి 28, సంచిక: 188 | సోమవారం | 29-12-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

## దేశంలో పేదరికం రెట్టింపు

● సంపద కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు మోదీ సర్కార్ తహతహ ● మతోన్మాదాన్ని పెంచుతూ యుద్ధోన్మాదానికి తెరలేపింది
● ఈ రెండూ దేశానికి ప్రమాదకరమే
● ప్రజాస్వామ్యం పేరుతో రాజ్యమేలుతున్న ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం
● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆగ్రహం





### భూపాలపల్లిలో సిపిఐ వందేళ్ళ పైలాన్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/భూపాలపల్లి

దేశ ఖనిజ సంపదను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే అందుకే తహతహలాడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యిందని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగిపోయారని విమర్శించారు. ప్రధాని మోదీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తుల పైనే ఉండడంతో పేదల సంక్షేమం కుంటుపడిందని మండిపడ్డారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ 100 సంవత్సరాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జిల్లా కేంద్రం లోని రావి నారాయణరెడ్డి భవనం నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా బస్టాండ్ వరకు సిపిఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణంలో సిపిఐ 100 సంవత్సరాల జ్ఞాపకార్థం శతాబ్ది ఉత్సవాల్లో తరువాయి 12లో

## నేడు అసెంబ్లీ



### జనవరి మొదటివారం వరకు జరిగే అవకాశం

● కృష్ణా, గోదావరి జలాల కేటాయింపు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై చర్చ?
● ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత, జిహెచ్‌ఎంసిలో వార్డుల పెంపు బిల్లులు పెట్టే అవకాశం
● సమావేశాలు సజావుగా జరిగేలా అధికారులు పనిచేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్త సుఖేందర్‌రెడ్డి సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభ, శాసనమండలి సమావేశాలు సోమవారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభంకానున్నాయి. ప్రధానంగా కృష్ణా, గోదావరి జలాల కేటాయింపులు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ అంశంపైన సభలో చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. జనవరి మొదటి వారం వరకు సమావేశాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అలాగే పంచాయతీ ఎన్నికల్లో ఇద్దరు పిల్ల నిబంధన ఎత్తివేస్తూ గతంలో జారీ చేసిన ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించే బిల్లును, హైదరాబాద్‌లో వార్డుల సంఖ్యను పెంచుతూ జిహెచ్‌ఎంసి, పురపాలక బిల్లుతో పాటు రెండు కొత్త ప్రైవేటు యూనివర్సిటీలను ఏర్పాటుకు సంబంధించిన బిల్లులను ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. పురపాలిక, జిహెచ్ఎంసికి సంబంధించిన బిల్లులు ప్రవేశపెట్టే సమయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఒక ప్రకటన చేసే అవకాశాలు ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. భారత్ గ్లోబల్ సమ్మిట్ తదితర అంశాలు కూడా సమావేశంలో చర్చకు రానున్నాయి. సమావేశంలో నీటి కేటాయింపులు, ప్రాజెక్టుల అంశంలో గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలని పాలక వర్గం, ప్రభుత్వ ఆరోపణలకు సమాధానం చెప్పాలని ప్రధాన ప్రతిపక్ష బిఆర్‌ఎస్ సిద్ధమైంది. ప్రధానప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావు కూడా సమావేశాలకు హాజరుకానున్నారు. కానీ తరువాయి 2లో

### సమావేశాలు 15 రోజులు నిర్వహించాలి

● కృష్ణా జలాలపై కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానాలు చెబుతాం
● మాజీమంత్రి హరీశ్‌రావు



శాసనసభ సమావేశాలను 15 రోజుల పాటు నిర్వహించాలని, సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్చపెట్టినా మాట్లాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ చేస్తున్న ఆరోపణలకు తాము సభలో సమాధానం చెబుతామన్నారు. సమావేశాలను నిర్వహించేంది ప్రజా సమస్యలపై చర్చించేందుకు కాదని, ప్రతిపక్షంపైన బురద జల్లడానికేనని, అసెంబ్లీ సమావేశాలను నిర్వహించేందుకు ప్రభుత్వం భయపడుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో తరువాయి 2లో



## జలాంతర్గామిలో రాష్ట్రపతి

● ఐఎన్ఎస్ వాఘ్షీర్‌లో ముర్ము ప్రయాణం
● సబ్‌మెరిన్ ప్రయాణాన్ని చేపట్టిన రెండవ రాష్ట్రపతి

**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం పశ్చిమ సముద్ర తీరంలో భారత నావికాదళానికి చెందిన ఫ్రంట్‌లైన్ జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్షీర్‌లో ప్రయాణించారు. ద్రౌపదిముర్ము జలాంతర్గామి ప్రయాణాన్ని చేపట్టిన రెండవ రాష్ట్రపతి అయ్యారు. 2006 ఫిబ్రవరిలో అప్పటి రాష్ట్రపతి ఎ.పి.జె.అబ్దుల్ కలామ్ జలాంతర్గామి ప్రయాణాన్ని చేపట్టిన మొదటి రాష్ట్రపతి. కర్ణాటకలోని కార్వార్ నావికా స్థావరం నుండి కల్వరి తరగతి జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్షీర్‌లో రాష్ట్రపతి ముర్ముతోపాటు నౌకా దళాధిపతి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి కూడా ఉన్నారని అధికారులు తెలిపారు. రాష్ట్రపతి సైన్యానికి సుప్రీం కమాండర్‌గా కూడా వ్యవహరిస్తారు. 'భారత నావికాదళం స్వదేశీ కల్వరి తరగతి జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్షీర్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కార్వార్ నావికా స్థావరంలో ఎక్కారు' అని రాష్ట్రపతి సచివాలయం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. జలాంతర్గామిలోకి ప్రవేశించే ముందు నావికాదళం యూనిఫామ్ ధరించిన రాష్ట్రపతి నావికాదళం సిబ్బంది వైపు చేయి ఊపి అభివాదం చేస్తూ బయల్దేరారు. పి75 స్కార్పీన్ ప్రాజెక్ట్‌లోని ఆరవ, చివరి తరువాయి 2లో

## సిగాచీ పరిశ్రమ సిఇఓ అరెస్ట్

రిమాండ్‌కు తరలింపు





ప్రజాపక్షం /సంగారెడ్డి

రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ఘోరమైన పారిశ్రామిక ప్రమాదాలలో ఒకడిగా నిలిచిన సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమ పేలుడు ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. పరిశ్రమ సిఇఒ అమిత్‌రాజ్ సిన్హాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూన్ 30న పాశమైలారం ప్లాంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 54 మంది కార్మికులు దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే. కార్మికుల మృతితో సిగాచీ పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు అయింది. దాదాపు ఆరు నెలలుగా దర్యాప్తు జరుగుతున్న కేసులో ఎట్టకేలకు యాజమాన్యంపై చర్యలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే శనివారం రాత్రి గుట్టు చప్పుడు కాకుండా సిగాచి సిఇఒను అరెస్టు చేసినట్లు సమాచారం. కాగా తరువాయి 2లో

## జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడుతున్నాం

● డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు
● బస్ పాస్‌లతో సహా అన్ని సంక్షేమ పథకాలను వారికి వర్తింపచేయిస్తాం
● మీడియా అకాడమీ చైర్మన్‌పై విమర్శలు తగదు
● తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ



03

## మావోయిస్టు నేత హనుమంతుకు అరుణాంజలి

నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలో ముగిసిన అంత్యక్రియలు
పాల్గొన్న పౌర హక్కుల సంఘం, విరసం, అమరుల బంధు మిత్రుల సంఘం నేతలు



## భారత్‌లోనే ప్రజాస్వామ్యం సజీవం

● కాంగ్రెస్ గొప్ప నాయకుల వల్లే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా అవతరణ
● కాంగ్రెస్ ఒక సిద్ధాంతం.. అవి ఎప్పటికీ నశించవు
● 140వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ :** 'ప్రజాస్వామ్యం సజీవంగా ఉన్న ఏకైక దేశం భారతదేశం మాత్రమే. కాంగ్రెస్ గొప్ప నాయకుల వల్లే భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా అవతరించింది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. కాంగ్రెస్ ఒక సిద్ధాంతమని, సిద్ధాంతాలు ఎప్పటికీ నశించవని ఆయన ఉద్ఘాటించారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఘనంగా పార్ట ఆవిర్భావ వేడుకలు జరిగాయి. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి ఖర్గే మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్ ఎల్లప్పుడూ భారతదేశ ప్రజల సంక్షేమం, సాధికారత, సమ్మిళిత అభివృద్ధి కోసం పనిచేసిందన్నారు. భారత రాజ్యాంగం హామీ ఇచ్చినట్లుగా, రాజకీయ, ఆర్థిక, సామాజిక హక్కులలో సమాన అవకాశాలను తాము గట్టిగా విశ్వసిస్తామని చెప్పారు. కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 'కాంగ్రెస్ అంతమైపోయింది' అని చెప్పేవారికి కొ విషయం స్పష్టంగా తరువాయి 2లో



## స్మృతి మంధాన @ 10,000 పరుగులు

అంతర్జాతీయ క్రికెట్‌లో మంధాన మరో రికార్డు..
రెండో భారతీయురాలిగా ఘనత..!

భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన మరో ఘనత సాధించింది. అన్ని ఫార్మాట్లలోనూ అదరగొడుతున్న భారత వైస్ కెప్టెన్ 10 వేల పరుగుల క్లబ్‌లో చేరింది. అంతర్జాతీయంగా ఈ మైలురాయిని అధిగమించిన నాలుగో క్రికెటర్‌గా, రెండో భారతీయురాలిగా రికార్డు నెలకొల్పింది. త్రివేండ్రంలో జరుగుతున్న నాలుగో టి20లో 27 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఆమె ఈ క్లబ్‌లో చేరింది. ఈ ఏడాది భీకర ఫామ్‌లో ఉన్న స్మృతి మంధాన రికార్డుల మోత మోగిస్తోంది. వన్డే ప్రపంచకప్ ముందు శతకాలతో హోరెత్తించిన ఈ లెఫ్ట్ హ్యాండర్ ఒకే ఏడాది అత్యధిక పరుగులతో రికార్డు నెలకొల్పింది. మూడు ఫార్మాట్లలో దూకుడైన ఆటతో చెలరేగే మంధాన 10 వేల పరుగులు పూర్తి చేసుకుంది. ఈ ఘనతను సొంతం చేసుకున్న నాలుగో మహిళా క్రికెటర్‌గా, రెండో ఇండియన్‌గా తరువాయి 12లో

## వెల్‌నెస్ సెంటర్లలో ఏదీ వైద్యం?



● సిబ్బంది అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యం
అందుబాటులో లేని మందులు ● ఇబ్బందులు పడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్లలో వైద్య సేవలు అందని పరిస్థితి. సిబ్బంది అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో అవి కాస్తా కునారిల్లుతున్నాయి. ఇన్‌చార్జిలుగా ఉన్న డాక్టర్లే స్వయంగా విధులకు హాజరు కాని పరిస్థితులు ఉండడంతో సిబ్బంది ఆడిందే ఆటగా పాడిందే పాటగా అన్నట్లు సాగుతోంది.. మరోవైపు మందులు సైతం అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది.. చివరికి సర్వ సాధారణమైన బిపి, షుగర్ మందులు కూడ ఉండడం లేదు.. బిపి, షుగర్ మందులకు సంబంధించి ఒకటి ఉంటే మరొకటి ఉండడం లేదు..దీంతో వైద్యం కోసం కోసం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న ఉద్యోగులు, మరీ ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులు ఉసూరుమంటూ తిరిగి వెళుతున్నారు.. ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప మందులు అవసరమున్న వారే రావాల్సిన పరిస్థితి ఉండడంతో వయోభారంతో వారు పలుమార్లు తిరగలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా వైద్యం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నా సిబ్బంది తీరు... అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వ లక్ష్యం అసలు నెరవేరడం లేదు.

**సమయ పాలన పాటించని సిబ్బంది**

పలు వెల్‌నెస్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అసలు సమయ పాలన తరువాయి 2లో

## అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదం

ప్రజాపక్షం /హైదరాబాద్





హైదరాబాద్‌లోని ఓ అపార్టుమెంట్‌లో సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం సంభవించింది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధి సోమాజీగూడలో ఆదివారం రాత్రి ఆల్ పైన్ హైట్స్ అపార్టుమెంట్ ఐదవ అంతస్తులో సిలిండర్ పేలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన అపార్టుమెంట్ వాసులు భయంతో బయటకు పరుగులు తీసి, ప్రాణాలు రక్షించుకున్నారు. సమాచారం మేరకు ఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు బాగా ఎగిసిపడుతుండటంతో అగ్నిమాపక సిబ్బంది చుట్టుపక్కల వారిని ఖాళీ చేయించారు.

## 1 నుంచి నుమాయిష్

● రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 వరకు నిర్వహణ
● నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఫిబ్రవరి 15 వరకు..
● ఏర్పాట్లు పూర్తయినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు వెల్లడి







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగర ప్రతిష్ఠాత్మక వార్షిక కార్యక్రమంగా పేరుగాంచిన 85వ ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ (నుమాయిష్)-2026 జనవరి 1న ప్రారంభం కానుంది. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ ప్రదర్శన జరగనుంది. ఈ మేరకు సోమవారం ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఈ నుమాయిష్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ప్రారంభిస్తారని, రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గౌరవ అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఎగ్జిబిషన్ సమయం సాధారణ రోజుల్లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు, శని, ఆదివారాలు, సెలవు దినాల్లో రాత్రి 11 గంటల వరకు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## లోయలో పడిన బస్సు : 15 మంది మృతి

**గ్వాటిమాల సిటీ :** సెంట్రల్ అమెరికా గ్వాటిమాలలో ఒక బస్సు బాగా లోతైన లోయలో పడిపోవడంతో 15 మంది మరణించారు. మరో 15 మంది గాయపడ్డారు. దీంతో ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను రద్దుచేశారు. దేశంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ''ఈ పెను విషాదంపట్ల నేను తీవ్రంగా చింతిస్తున్నాను, ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను'' అని దేశాధ్యక్షుడు బెర్నార్డో అరెవాలో సోషల్‌మీడియా వేదికగా పోస్టింగ్ చేశారు. రెండు మున్సిపల్ నగరాలమధ్య రాకపోకలు సాగించే టోటోని కాపన్ పట్టణం వెలుపల ఇంటర్ అమెరికన్ రోడ్ అని పిలిచే ప్రయాణ మార్గం పక్కనే ఆనుకుని ఉన్న లోతైన లోయలోకి ఈ బస్సు శుక్రవారం రాత్రి పొద్దు పోయిన తర్వాత అదుపు తప్పి పడిపోయింది. సహాయ బృందాలు ఆ ప్రాంతానికి చేరుకుని దాదాపు రెండు గంటలపాటు కష్టపడి మృతదేహాలను వెలికితీశాయని అధికారులు చెప్పారు. గ్వాటిమాలలో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇక్కడ అన్నీ కొండ ప్రాంతాలే. రహదారులన్నీ చాలా ఇరుకుగా ఉంటాయి. పైగా రహదారుల నిర్వహణ కూడా సరిగ్గా ఉండదు.

## మయన్మార్‌లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభం

### ఎన్నికల్లో న్యాయబద్ధత లేదు : ఐక్యరాజ్య సమితి

**యాంగాన్ :** మయన్మార్‌లో మూడు దశలుగా జరిగే ఎన్నికల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. ఆ దేశంలో జుంటా సైనిక పాలకులు అధికారం స్వాధీనం చేసుకున్న ఐదు సంవత్సరాల తర్వాత 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ' పేరుతో దేశంలో ఎన్నికల తంతు ప్రారంభమైంది. మొదటి విడత 330 టౌన్ షిప్‌లలో 102 స్థానాలకు పోలింగ్ జరిగింది. రెండో విడత ఎన్నికలు జనవరి 11వ తేదీన జరుగుతాయి. మూడో విడత ఎన్నికలు జనవరి 25వ తేదీన జరుగుతాయి. ఎన్నికల తుది ఫలితాలు ఫిబ్రవరిలో ప్రకటిస్తారని భావిస్తున్నారు. ఎన్నికల్లో 57 రాజకీయపార్టీలకు చెందిన 4,800 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. జాతీయ పార్లమెంటులో, స్థానిక చట్టసభలకు వారు పోటీ చేస్తున్నారు. ఐతే దేశవ్యాప్తంగా ఆరు పార్టీలు మాత్రమే పోటీలో ఉన్నాయి. ఐతే ఈ ఎన్నికల ప్రక్రియలో న్యాయబద్ధత లేదని ఐక్యరాజ్యసమితి విమర్శించింది. ఎన్నికలు నిజాయితీగా, న్యాయబద్ధంగా ఉండాలని కోరింది. సైనిక పాలకులు తమ అధికారాన్ని స్థిరీకరించుకోవడంకోసమే ఈ ఎన్నికల తంతు ప్రారంభించారని ప్రజాస్వామ్య, హక్కుల సంఘాలు విమర్శిస్తున్నాయి. మయన్మార్ పార్లమెంటుకు 2020లో జరిగిన ఎన్నికలను సైనిక పాలకులు రద్దు చేశారు. ప్రమాణ స్వీకారానికి సిద్ధపడుతున్న ఆంగ్‌సాన్ సూకీ పాలక బృంద సభ్యులను, ఆ పార్టీ నాయకులను, కార్యకర్తలను జైళ్లలో కుక్కి దేశాధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

2021లో ఆంగ్‌సాన్‌సూకీ మోసపూరితంగా ఎన్నికల్లో గెలిచారని జుంటా సైనికపార్టీ విమర్శించింది. ఆనాటి ఎన్నికల్లో సైన్యం మద్దతుగలపార్టీ పోటీ చేసి చిత్తుగా పోటీచేసి ఓడిపోయింది. దీంతో సైన్యం అధికారం చేజిక్కించుకుని ఎన్నికల తీర్పును రద్దుచేసింది. ఇక అప్పటి నుండీ మయన్మార్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైంది. లక్షల మంది ఈ యుద్ధం వల్ల నిరాశ్రయుల య్యారు. వేలాదిమంది మరణించారు.

# థాయిలాండ్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ

### ప్రధానమంత్రుల నామినేషన్లు ప్రారంభం







**బ్యాంకాక్ :** ఆగ్నేయ ఆసియా దేశం థాయిలాండ్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన జరిగే ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. వివిధ పార్టీల తమ తమ పార్టీల తరఫున పోటీ చేసే ప్రధానమంత్రి అభ్యర్థుల పేర్లు ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ చేయడం ప్రారంభించాయి. పరోక్ష ఎన్నికల ప్రచారం కూడా ఇప్పటికే ప్రారంభమైంది. ఈసారి థాయిలాండ్ ఎన్నికల్లో ప్రధాన మంత్రి పదవికి త్రిముఖ పోటీ జరిగే అవకాశం ఉంది. పురాతన ఫూ థాయ్ పార్టీకి అంత్యంత సంపన్నవంతుడు, మాజీ ప్రధానమంత్రి థక్‌సిన్ షినవత్ర మద్దతు ఉంది. ఆ పార్టీ తరఫున ఈసారి యోచనన్ వాంగ్నాసత్ (46) పోటీలో ఉన్నారు. పీపుల్స్ పవర్ పార్టీ (పిపిపి)తరఫున నత్తఫాంగ్ రుయేంగ్‌ప్యాన్యావుట్(38), ఇక భూమి జాతా పార్టీ తరఫున ప్రస్తుత ప్రధానమంత్రి అనుతిన్ ఛర్న్ విరాకుల్ పోటీలో ఉన్నారు. ఆయన కేవలం మూడునెలలుగా మాత్రమే ప్రధానమంత్రిగా కొనసాగుతున్నారు. ఆయనకు ముందు పెటోంగ్ టర్న్ షినవత్ర పొరుగు శత్రుదేశం కాంబోడియా నేతతో ఫోన్‌లో మాట్లాడి, ఆయనను అంకుల్ అని సంబోధించి వివాదంలో చిక్కుకుని పదవీ చ్యుతురాలయ్యారు. అనుతిన్ కూడా ఇటీవల వరదలు, ప్రకృతి విలయాల సమయంలో ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విమర్శలు ఎదుర్కొన్నారు. దేశ రాజ్యాంగంలోని 151 నిబంధన ప్రకారం ఉభయ చట్ట సభలు ప్రధానమంత్రిని ఎన్నుకుంటాయి. ప్రజాప్రతినిధుల సభలో ఉన్న 500 స్థానాల్లో 350 మందిని నాలుగేళ్ల కాలానికిగాను ప్రజలు నేరుగా ఎన్నుకుంటారు. మరో 150 మందిని పార్టీల జాబితా ప్రకారం ప్రాతనిధ్య ప్రాతిపదికపై ఎనున్నకుంటారు. వివిధ జీవనరంగాలకు చెందిన ప్రముఖులను మరో 250 మంది సెనేట్ సభ్యులుగా ఐదేళ్ళ కాలానికిగాను ఎన్నుకుంటారు. పొరుగున కాంబోడియాతో గడచిన జులై నెల నుండి సరిహద్దు ఘర్షణలు చెలరేగిన తర్వాత రాజు ఆదేశంతో ప్రధానమంత్రి అనుతిన్ ఛర్న్‌విరాకుల్ పార్లమెంటును రద్దుచేయాల్సి వచ్చింది. థాయిలాండ్ దేశ ఐక్యత, గుర్తింపులకు రాజు దేశాధినేతగా కొనసాగుతారు. భూమిజాతా పార్టీ తరఫున ఆయన ప్రస్తుతం తాత్కాలిక ప్రధా నమంత్రిగా బాధ్యతల్లో ఉన్నారు. ప్రధాన రాజకీయపార్టీ చట్టసభలో రాజ్యాంగ మార్పులపై ప్రశ్నిస్తూ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో పేర్కొన్న పరిణామాలు సంభవించాయి. హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో తన సంఖ్యాబలం పెంచు కోవడానికి ఈ ఎన్నికలు చాలా బాగా ఉపయోగపడతాయని ప్రధానమంత్రి అనుతిన్ విశ్వసిస్తున్నారు. ఈసారి మరింత ప్రజాబలంతో అధికారం చేజిక్కించుకోవచ్చునని ఆయన ఆశపడుతున్నారు. ఐతే ప్రజలుమాత్రం ప్రభుత్వం కోరిన రిఫరెండం ప్రకారం ఈసారి తమకు కొత్త రాజ్యాంగం వద్దా? కావాలా? అనే విషయంపై తీర్పు చెప్పనున్నారు.

## సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో పోలింగ్

**బాంగీ :** సెంట్రల్ ఆఫ్రికాలో భూబంధిత దేశం ''సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్' లో అధ్యక్షుణ్ణి ఎన్నిక సహా సార్వత్రి ఎన్నికలకు ఆదివారం పోలింగ్ జరిగింది. భారత కాలమానం ప్రకారం తెల్లారుజామున ఐదు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. స్థానిక ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు, దేశాధ్యక్ష పదవికి ఎన్నికలు ఒకేసారి జరిగాయి. దేశంలో మొత్తం 55 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. అధ్యక్ష ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికలతోపాటు చాలా దశాబ్దాల తర్వాత గ్రామీణ ప్రాంతాలలో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ కూడా జరిగింది. దేశంలో 2016 నుండి అధ్యక్ష పదవిలో కొనసాగుతున్న ఫాస్టిన్ ఆర్చేంజ్ టౌడెరా (67) ఈసారి కూడా మొదటి రౌండు ఎన్నికల్లో విజయం సాధిస్తారని అంతా భావిస్తున్నారు. ఏ అభ్యర్థికీ 50 శాతం పైగా ఓట్లు రాకపోతే రెండోసారి రన్ ఆఫ్ పోలింగ్ నిర్వహిస్తారు. ఆయన గతంలో 2008–2013 వరకూ దేశ ప్రధానమంత్రిగా కూడా పనిచేశారు. ఆయన రాజకీయవేత్త, గణితశాస్త్రజ్ఞుడు. మళ్ళీ మళ్ళీ పోటీ చేసి గెలిచేందుకు వీలుగా 2023లో వివాదాస్పద ప్రజాభిప్రాయ సేకరణ చేయడంతో ఆయన తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. 2020 ఎన్నికల్లో విజయం సాధించిన టౌడెరా మోసంతో గెలిచారని ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీంతో ఆరు తిరుగుబాటు గ్రూపులు ఆయన ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నం చేశాయి. 2013 నుండి దేశంలో అంతర్యుద్ధం కొనసాగుతోంది. ఈ దశలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. రష్యా, రువాండా దేశ సైన్యాలు సహా అంతర్జాతీయ శాంతి దళాలు దేశంలో పరిస్థితిని అదుపులో ఉంచేందుకు సహకరిస్తున్నాయి. ప్రతిపక్ష నాయకులు రాజకీయ ప్రచారం చేయకుండా ఆటంకాలు ఎదురయ్యాయి. దేశంలో పలుచోట్ల బహిరంగ సభలు నిర్వహించకుండా ప్రతిపక్ష నాయకులకు ఆటంకాలు సృష్టించారు. దేశంలో వీధి వీధినా సైన్యం, పోలీసులను భారీగా మోహరించారు.

# సంక్షోభ పరిస్థితులమధ్య కొసావోలో రెండోసారి ఎన్నికలు



**ప్రిస్టినా :** సెర్బియా నుండి స్వాతంత్ర్యం ప్రకటించుకున్న ఆగ్నేయ ఐరోపాదేశం కొసావోలో ఈ ఏడాది మరోసారి సార్వత్రిక ఎన్నికల ప్రయత్నంలో భాగంగా ఆదివారం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. దాదాపు ఏడాదికాలంగా దేశంలో ఏర్పడిన రాజకీయ ప్రతిష్ఠంభన తొలగించేందుకు ప్రజలు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. 2025 ఫిబ్రవరి 9వ తేదీన జరిగిన ఎన్నికల్లో ప్రధానమంత్రి ఆల్బిన్ కుర్తి నాయకత్వాన గల వెంటె వెండోస్జే పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో విఫలమైంది. 2021లో అధికారంలోకి వచ్చినప్పటినుండీ కుర్తి ప్రభుత్వం నిరంకుశ విధానాల ద్వారా మిత్రదేశాలైన అమెరికా, యూరోపియన్ యూనియన్‌లను దూరం చేసే పరిస్థితులు సృష్టిస్తోందని కొసావోలో కీలక ప్రతిపక్షాలు డెమోక్రటిక్ లీగ్ ఆఫ్ కొసావో, డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ కొసావో నాయకులు విమర్శిస్తున్నారు. బెల్గ్రేడ్‌తో సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకువచ్చేందుకు యూరోపియన్ యూనియన్ మధ్యవర్తిత్వం చేసినప్పుడు కుర్తి ప్రభుత్వం చాలా కఠినమైన వైఖరి అనుసరించింది. దీంతో ఇ.యు, అమెరికా దేశాలు కొసావోపట్ల శిక్షాత్మక చర్యలు తీసుకున్నాయి. దీంతో ఈ ఏడాది మొదట్లో జరిగిన ఎన్నికల్లో ఆధిక్యం వచ్చినప్పటికీ ఏ పార్టీ కూడా ఆయనకు మద్దతు ఇచ్చేందుకు ముందుకు రాలేదు. దీంతో రెండోసారి మళ్ళీ దేశంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఐరోపా–ఆండ్రియాటిక్–నల్ల సముద్రాల మధ్య కీలకమైన భూబంధిత ప్రాంతం కొసావో. ప్రధాన స్రవంతి పార్టీలతో కలిసి ఆల్బిన్‌కుర్తి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయారు. ఆయన పార్టీతో పొత్తు పెట్టుకునేందుకు ప్రధాన స్రవంతి పార్టీలన్నీ తిరస్కరించాయి. ఈసారి కూడా 120 మంది సభ్యులుండే పార్లమెంటులో అదే పరిస్థితి ఎదురవుతుందని అంచనావేస్తున్నారు. కొసావో రాజ్యాంగం ప్రకారం 20 శాతం పార్లమెంటు స్థానాలను సెర్బులు, ఇతర మైనారిటీలకు కేటాయించారు. రెండు మిలియన్ల మంది జనాభా ఉన్న కొసావోలో ఆర్థిక పరిస్థితులు బాగోలేదు. అనిశ్చితి ఆ దేశాన్ని వెంటాడుతోంది.

# ఉక్రేన్‌లో శాంతికి ''వార్ పార్టీ''యే అతిపెద్ద ఆటంకం

### రష్యా విదేశాంగమంత్రి లోవరోవ్

### యూరప్‌పై దాడి ఉద్దేశం లేదని వెల్లడి



**మాస్కో:** ఉక్రేన్‌లో శాంతికి ''వార్ పార్టీ'' (యుద్ధ పక్షం) అతిపెద్ద ఆటంకంగా ఉందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లోవరోవ్ విమర్శించారు. యూరోపియన్ యూనియన్‌ను ఆయన ''ఒక యుద్ధ పక్షం'' (వార్ పార్టీ)గా అభివర్ణించారు. యుద్ధాన్ని రెచ్చగొట్టేందుకు దాదాపు అన్ని యూరప్ దేశాలూ ఉక్రేన్‌కు ధనాన్ని, ఆయుధాలను వరదలా ప్రవహింపజేస్తున్నాయన్నారు. తమ ఆంక్షల వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుందని యూరప్ కూటమి కలలు కంటోందని అన్నారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో ఫ్లోరిడాలో ఆదివారం పొద్దుపోయాక జెలెన్‌స్కీ చర్చలకు సన్నద్ధమవుతున్న తరుణంలో లోవరోవ్ ఇంటర్వ్యూను 'టాస్ వార్తా సంస్థ'' ప్రచురించింది. యూరప్‌పై దాడి చేసే ఉద్దేశం రష్యాకు లేదని, ఒకవేళ దాడిచేస్తే అది మహా వినాశకరంగా ఉంటుందని హెచ్చరించారు. ఆ ఇంటర్వ్యూలో లోవరోవ్ మాట్లాడుతూ, ఉక్రేన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న కృషిపై ప్రశంసల వర్షం కురిపించారు. అమెరికా నవీకరించిన జాతీయ భద్రతా వ్యూహం రష్యాతో జరుగుతున్న చర్చలకు ఏ మాత్రం భిన్నంగా లేదని, కానీ అమెరికా తీసుకునే చర్చలను ఫలితాల ఆధారంగా తమ దేశం అంచనావేస్తుందని చెప్పారు. కానీ ట్రంప్ చేస్తున్న కృషికి యూరప్ దేశాలు అడ్డుపడుతున్నాయని మండిపడ్డారు. అమెరికాతో కలిసి తాము పనిచేస్తామని అన్నారు. అదేవిధంగా ఇజ్రాయెల్ దురాక్రమణ చర్యలను కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. పశ్చిమ ఆసియాలో యూరప్‌దేశాలు ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తున్నాయని విమర్శించారు. ''ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారానికి అమెరికా అనేక ప్రయత్నాలు చేస్తోంది, కానీ ఇప్పటివరకూ శాంతికి చేరువయ్యే మార్గం రాలేదు, ఆ అడ్డంకులకు కారణం ఎవరు? అనేక అవినీతి కుంభకోణాల్లో చిక్కుకున్న జెలెన్‌స్కీ తన ధనాన్ని ఎలా ఉపయోగిస్తున్నారో చివరకు పశ్చిమ దేశాలు అర్థం చేసుకుంటాయా?'' అని ఆయన ప్రశ్నించారు.



## విద్యతో పాటు శారీరక వికాసానికి సమ ప్రాధాన్యత

### శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శ్రీచైతన్య విద్యా సంస్థ విద్యతో పాటు శారీరక వికాసానికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన అన్నారు. ఆదివారం మియాపూర్ శ్రీచైతన్య క్యాంపస్, కళ్యాణ్ గార్డెన్స్‌లో శ్రీచైతన్య ఉద్యోగుల స్పోర్ట్స్ ఉత్సవ్ – 2025 ముగింపు వేడుకలుఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సుష్మ బొప్పన, డైరెక్టర్లు శ్రీధర్, టి.నాగేంద్ర కుమార్ హాజరై విజేతలను అభినందిస్తూ బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా సుష్మ బొప్పన మాట్లాడుతూ క్రీడల ద్వారా క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, ఓర్పు జీవితంలో అత్యవసరమైన విలువలను విద్యార్థులు నేర్చుకుంటారన్నారు, ఇందుకు స్ఫూర్తిగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఈ క్రీడా పోటీలను నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల మానసిక, శారీరకాభివృద్ధికి అత్యుత్తమ వాతావరణాన్ని అందించేందుకు శ్రీచైతన్య ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆమె వివరించారు. విద్యార్థులు విద్యలోనూ, క్రీడల్లోనూ, జీవితంలోనూ విజేతలుగా ఎదగాలనే ప్రేరణతో ముందుకు సాగాలని ఆమె కోరారు.

## అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా తట్టెడు మట్టి తీయలేదు

### టిఆర్‌ఎస్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో తట్టెడు మట్టికూడా తీయలేదని, అనవసర శపథాలు మాని ఆరుగ్యారంటీల అమలుపై శ్రద్ధ పెట్టాలని టిఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని జిల్లా టిఆర్‌ఎస్‌భవన్‌లో మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అధ్యక్షతన నాగర్‌కర్నూల్ అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గాలనుంచి గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులకు నిర్వహించిన సన్మాన సభకు కెటిఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతబిడ్డ అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయిన గత ప్రభుత్వంలో 90శాతం పనులు పూర్తి చేసిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయలేదని, కనీసం రెండేళ్లలో తట్టెడు మట్టి కూడా తీయలేదని ఆరోపించారు. రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి మున్సిపాలిటి ఎన్నికలలో ఇలాగే పని చేసి అధికస్థానాలు సాధించాలన్నారు. 2028లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో కెసిఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు.

**పార్టీని కించపరిస్తే అడ్రస్‌లేని బ్రతుకులే :**

పదవులు అనుభవించి పార్టీనుంచి బయటకు వెళ్లి పార్టీ అధినేతను పార్టీని కించపరిస్తే అడ్రస్‌లేని బతుకులే అవుతాయని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యేగువ్వలబాల్‌రాజును ఉద్దేశించి కెటిఆర్ ఆరోపణ చేశారు. గత సర్పంచ్ ఎన్నికల్లో నియోజకవర్గంలో ఆయన గెలిపించుకున్న సర్పంచులు ఎంతమంది అంటే ఇద్దరే అని స్థానికులు తెలిపారన్నారు. మొదటగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి ఆయా నియోజకవర్గాల నుండి గులాబీశ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చారు.

## 15 రోజులు నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఆయన జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తాము అన్ని అంశాలపై చర్చించేందుకు సమాయత్తమయ్యామని, కానీ తాము ప్రస్తావించే ప్రజా సమస్యలపైన కూడా సభలో చర్చకు అవకాశాన్ని కల్పించాలన్నారు. రెండేళ్లవుతున్నప్పటికీ అసెంబ్లీ హౌస్ కమిటీలను ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదని, ఇందుకు స్పీకర్ వద్ద లోపం ఉందా ? లేదా శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు వద్ద లోపం ఉందా అని ప్రశ్నించారు. ఎస్టిమేట్ కమిటీ చైర్మన్‌గా ఉత్తమ్ పద్మావతి రెడ్డిని నియమిస్తే ఆమె వెంటనే రాజీనామా చేశారన్నారు. అన్ని వ్యవస్థలతో పాటు శాసనసభను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, రూ.5లక్షల కోట్ల హిల్ట్ పాలసీ కుంభకోణం, జాబ్ క్యాలెండర్, గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఫుడ్ పాయిజన్ తదితర అంశాలపైన కూడా సభలో చర్చించాలని సూచించారు. నీటి పారుదల ప్రాజెక్ట్ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు అవకాశం కల్పిస్తే, ప్రధాన ప్రతిపక్ష బిఆర్‌ఎస్‌కు కూడా అవకాశాన్ని కల్పించాలని హరీశ్ రావు కోరారు. తమ పదేళ్ల పాలనలో ఏడాదికి సగటున 45 రోజుల చొప్పున శాసనసభ సమావేశాలను నిర్వహిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఏడాదికి 20 రోజులకు కుదించిందని ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్ష బిఆర్‌ఎస్ ఇచ్చిన ఒక్క అంశంపైన కూడా చర్చ పెట్టకపోతే ఇక అసెంబ్లీ సమావేశాలను నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు టిఎంసిలను 90 నుంచి 45 టిఎంసిలకు కుదించారని, కేంద్రం నుంచి డిపిఆర్ వెనక్కి వచ్చి ఏడాది పూర్తవుతున్నప్పటికీ, ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదని, దీనిపైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఏదీ వైద్యం?

(మొదటి పేజీ తరువాయి)

పాటించడం లేదని ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.... మరీ ముఖ్యంగా వనస్థలిపురం వెల్‌నెస్ సెంటర్‌లో పరిస్థితి దారుణంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సేవల నిమిత్తం ఈ సెంటర్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు నగర శివారు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వస్తుంటారు. పరీక్షలు నిమిత్తం ఉదయం 7 గంటల లోపే వెల్‌నెస్ సెంటర్లకు పరుగు పరుగున వస్తున్నారు. పరీక్షలు నిర్వహించే సిబ్బంది అటు ఇటుగా సకాలంలోనే అందుబాటులో ఉంటున్నప్పటికీ మందులు ఇతర సేవలకు సంబంధించి 9 గంటల వరకే విధుల్లో ఉండాల్సిన సిబ్బంది మాత్రం సకాలంలో రావడం లేదు. 9 గంటలకు వైద్యులు మందులు రాసినా ఒక్కోకసారి 10.30 గంటలు దాటినా మందులు కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన సిబ్బంది సైతం రోగులను పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఈ పరిస్థితిని సెంటర్ ఇన్‌చార్జ్‌కైనా విన్నవించుకుందామని ఫోన్ చేసినా స్పందించని పరిస్థితి ఉందని బాధను వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు దృష్టి సారించాలి :**

వెల్‌నెస్ సెంటర్ల పనితీరుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా మందులన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులు వచ్చే ఈ సెంటర్ల పనితీరు ఈ విధంగా ఉంటే, మిగిలిన ఆసుపత్రుల్లో పరిస్థితి ఏమిటాని ప్రశ్నిస్తున్నారు. వెంటనే వైద్యాధికారులు కాని ఆరోగ్య శాఖ మంత్రి గాని దృష్టి సారించకపోతే ప్రభుత్వం చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

## ప్రజాస్వామ్యం సజీవం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాలనుకుంటున్నానన్నారు. మా బలం తక్కువగా ఉండవచ్చు, కానీ వెన్నెముక ఇంకా నిటారుగానే ఉందని, తాము రాజ్యాంగంతో, లౌకికవాదంతో, పేదల హక్కులతో ఎప్పుడూ రాజీపడలేదని స్పష్టం చేశారు. తాము అధికారంలో లేకపోవచ్చు, కానీ ఎప్పుడూ బేరసారాలు చేయమన్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ మతం పేరుతో ఓట్లు అడగలేదని, ఆలయాలు, మసీదుల పేరుతో పార్టీ ఎప్పుడూ విద్వేషాన్ని వ్యాపింపజేయలేదని ఖర్గే ఉద్ఘాటించారు. 'కాంగ్రెస్ ఏకం చేస్తుంది. బిజెపి విభజిస్తుంది. కాంగ్రెస్ మతాన్ని కేవలం విశ్వాసంగా మాత్రమే ఉంచింది. కానీ కొందరు మతాన్ని రాజకీయంగా మార్చారు. ఈ రోజు బిజెపికి అధికారం ఉంది, కానీ వారి వద్ద సత్యం లేదు. అందుకే, కొన్నిసార్లు డేటాను దాచిపెడతారు, కొన్నిసార్లు జనాభా లెక్కలను ఆపేస్తారు, కొన్నిసార్లు రాజ్యాంగాన్ని మార్చాలనే చర్చలు జరుగుతాయి' అని ఖర్గే మండిపడ్డారు. ఈ రోజు చరిత్ర గురించి ప్రసంగాలు చేస్తున్న వారి పూర్వీకులు చరిత్ర నుండి పారిపోయారని ఆరోపించారు. మహాత్మా గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడైన శతాబ్ది సంవత్సరం, రాజ్యాంగాన్ని ఆమోదించిన 75వ సంవత్సరం, వందేమాతరం 150వ వార్షికోత్సవం 2025వ సంవత్సరమని ఖర్గే అన్నారు. 2026వ సంవత్సరం దాదాభాయ్ నౌరోజీ 200వ వార్షికోత్సవం, సరోజినీ నాయుడు కాంగ్రెస్ అధ్యక్షురాలైన శతాబ్ది సంవత్సరం, డిసెంబర్ 1925లో కాన్పూర్ కాంగ్రెస్ సమావేశంలో మొదటిసారిగా పాడిన 'ఝండా ఊంచా రహే హమారా' గీతం శతాబ్ది సంవత్సరం అని ఆయన అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యం సమయంలో అనేక దేశాలు స్వాతంత్ర్యం పొందాయని పేర్కొంటూ, కొన్ని దేశాలు విఫలమయ్యాయని, మరికొన్నింటిలో నియంతృత్వం ప్రబలిందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎత్తి చూపారు. 'భారత జాతీయ కాంగ్రెస్‌ది 140 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర సత్యం, అహింస, త్యాగం, పోరాటం, దేశభక్తి గొప్ప గాథను వివరిస్తుంది' అని కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతి భారతీయుడికి శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్, అజయ్ మాకెన్‌తో సహా పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు శశి థరూర్, దిగ్విజయ్ సింగ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు, అయితే ప్రియాంక గాంధీ వాద్రా ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు.

**కాంగ్రెస్ రాజకీయ పార్టీయే కాదు...**

**భారత ఆత్మస్వరం : రాహుల్**

రాహుల్ గాంధీ మాట్లాడుతూ, కాంగ్రెస్ కేవలం ఒక రాజకీయ పార్టీ కాదని, ప్రతి బలహీనమైన, అణగారిన, కష్టపడి పనిచేసే వ్యక్తికి అండగా నిలిచిన భారతదేశ ఆత్మ స్వరమని అన్నారు. 'సత్యం, ధైర్యం కోసం పోరాటంలో మరింత బలంగా పోరాడటం, ద్వేషం, అన్యాయం, నియంతృత్వానికి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని రక్షించడం అనేది సంకల్పం' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. 'భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతి కాంగ్రెస్ సభ్యునికి హృదయపూర్వక శుభాకాంక్షలు. ఆ చారిత్రక వారసత్వానికి, భారతదేశానికి స్వేచ్ఛను గెలుచుకున్న, రాజ్యాంగానికి పునాది వేసిన, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వ విలువలను బలోపేతం చేసిన ఆ గొప్ప త్యాగాలకు నివాళులర్పిస్తున్నాము' అని ఆయన అన్నారు.

## నేడు అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ అంశంపై జరిగే చర్చలో మాత్రం బిఆర్‌ఎస్ తరపున మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మాత్రమే పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. కెసిఆర్ కేవలం సమావేశాలకు హాజరవుతారనే ప్రచారం జరుగుతోంది.

**అడిగిన సమాచారాన్ని అందించండి**

శాసన మండలి,శాసనసభ సమావేశాలు సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. సభ్యులు(ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సిలు) అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని, శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్న సమయంలో సంబంధిత శాఖ అధికారులు అందుబాటులో ఉండి, సభ్యులకు తగిన సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. శాసనసభ, శాసనమండలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభ కానున్న నేపథ్యంలో సభ నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో గుత్తా సుఖేందర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్ ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి,శాసనమండలి కార్యదర్శి వి. నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్. తిరుపతి.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఢిల్లీ పర్యటన నేపథ్యంలో ఆయన తరపున ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి, అదనపు డిజిపి విజయకుమార్, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు విసి సజ్జనార్, అవినాష్ మహంతి, సుధీర్ బాబు, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, శాసనసభ ఛీఫ్ మార్షల్ కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ శాసన మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలని, అవసరమైన నోడల్ అధికారులను , లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలన్నారు. పెండింగ్ లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలని ఆదేశించారు. సమావేశాలు జరుగుతున్న సమయంలో చలో అసెంబ్లీ కార్యక్రమాలు నిర్వహించకుండా చూడాలని, సమావేశాలకు హాజరయ్యే మంత్రులు, ఎంఎల్‌ఏలు,ఎంఎల్‌సిలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ శాసనసభ, శాసనమండలి సమావేశాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు లేకుండా ముందస్తుగానే అడ్డుకుంటే, సమావేశాలు సజావుగా జరుగుతాయని సూచించారు.

## జలాంతర్గామిలో రాష్ట్రపతి

(మొదటి పేజీ తరువాయి)

జలాంతర్గామి అయిన ఐఎన్‌ఎస్ వాఘ్షీర్ జనవరిలో నేవీలోకి ప్రవేశించింది. నేవీ అధికారుల ప్రకారం.. ఇది ప్రపంచంలోనే అత్యంత నిశ్శబ్ద, బహుముఖ డీజిల్ ఎలక్ట్రిక్ జలాంతర్గాములలో ఒకటి. ఇది ఉపరితల వ్యతిరేక యుద్ధం, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధం, నిఘా సేకరణ, నిఘా, ప్రత్యేక కార్యకలాపాలు సహా విస్తృత శ్రేణి మిషన్లను చేపట్టడానికి రూపొందించబడింది. వైర్ గైడెడ్ టార్పెడోలు, యాంటీషిప్ మిస్సైల్స్, అధునాతన సోనార్ వ్యవస్థలతో కూడిన ఈ జలాంతర్గామి, ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపల్షన్ (ఎఐపి) టెక్నాలజీని ఏకీకృతం చేయడం వంటి భవిష్యత్ అప్‌గ్రేడ్‌లకు అనుమతించే మాడ్యులరర్ నిర్మాణాన్ని కూడా కలిగి ఉంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో దీర్ఘకాలిక భద్రతా ప్రయోజనాలను పరిగణనలోనికి తీసుకుని భారత నావికాదళం కార్వార్ స్థావరాన్ని అభివృద్ధి చేస్తోంది.

## సిఇఒ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం సంభవించిందని నియమించిన సాంకేతిక నిపుణుల కమిటీ ఇటీవల నివేదికలో పేర్కొన్నది. ఈ కేసులో బాధ్యులను గుర్తించికపోవడం పట్ల గత నెలలో హైకోర్టు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.




# జనరల్
STATE & REGIONAL NEWS

## బస్సు డ్రైవర్‌పై అక్రమ కేసు ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆసిఫాబాద్ డిపో లహరి బస్సు డ్రైవర్ రామరావుపై నాన్ బెయిలబుల్ సెక్షన్లతో అక్రమ కేసు పెట్టి రిమాండ్‌కు పంపిన రెబ్బన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి జెఎసి డిమాండ్ చేసింది. డ్రైవర్‌ది తప్పు లేకపోయినా అన్యాయంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడం దుర్మార్గమని పేర్కొంది. లహరి బస్సు హైదరాబాద్ నుండి అసిఫాబాద్ వెళ్లుతున్న క్రమంలో రెబ్బన పోలీస్‌స్టేషన్ సమీపంలో డ్రైవర్ బస్సును ఎడమ వైపు రోడ్డు ప్రక్కన పూర్తి సైడ్‌లో ఇండికేటర్ లైట్స్ వేసి నిలిపి ఉంచారన్నారు. అయితే వేగంగా వచ్చిన ఓ బొలెరో వాహనం బస్సు వెనుక ఎడమ భాగంలో ఢీ కొట్టడం, డ్రైవర్ తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించాడన్నారు. అయితే ఈ ఘటనలో డ్రైవర్‌ది ఎలాంటి తప్పు లేదని ఫోటోలో స్పష్టంగా కనిపిస్తున్నప్పటికి, పోలీసులు అక్రమంగా నాన్ బెయిల్‌బుల్ కేసు పెట్టి రిమాండ్ చేయడం దుర్మార్గమన్నారు.


## ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం గాంధీ భవన్‌లో ఘనంగా జరిగాయి. టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పార్టీ పతాకాన్ని ఎగురవేసి భారత ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లబాయ్ పటేల్, ఇందిరాగాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ అనేక మంది మహనీయుల సంకల్పంతో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ నిర్మాణంలో ఎనలేని పాత్రను పోషించిందని తెలిపారు. నెహ్రూ ప్రధాని కాకుండా ఉంది ఉంటే ఈ దేశం ఏమయ్యేదో ఊహించలేమన్నారు. గుండు సూది తయారు చెయ్యలేని స్థితి నుంచి రాకెట్ ప్రయోగాల వరకు ఎదిగింది అంటే నాడు నెహ్రూ వేసిన పునాదులు కారణమని తెలిపారు. ఇందిరాగాంధీ దేశం సామాన్యుల చేతికి రావాలని బ్యాంకుల జాతీయీకరణ చేయగా, రాజీవ్ గాంధీ సాంకేతికను దేశానికి పరిచయం చేశారని, పివి నరసింహారావు తన ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని మరోస్థాయికి తీసుకెళ్లారని కొనియడారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సరైన ఫలాలు అందాలన్న ఉద్దేశ్యంతోనే కుల సర్వే చేపట్టామని, తద్వారా బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చెయ్యాలని చూస్తే బిజెపి అడ్డం పడగా బిఆర్‌ఎస్ వంత పడుతోందని అన్నారు. మాజీ మంత్రి పి.జనార్ధన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు.

## ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప ప్రజానేత పిజెఆర్

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి.జనార్ధన్ రెడ్డి (పిజెఆర్) 18వ వర్ధంతి సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ చౌరస్తాలోని పిజెఆర్ విగ్రహానికి టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేశ్‌కుమార్ గౌడ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, మహ్మద్ అజారుద్దీన్, కార్పొరేటర్ విజయరెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పిజెఆర్ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప ప్రజానేత అని, ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన పిజెఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చుతూ కృష్ణ, గోదావరి జలాలు తరలించడంలో పిజెఆర్ కృషి ఎనలేనిదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కార్మిక నాయకుడిగా పిజెఆర్ ఎనలేని సేవ చేశారని కొనియడారు. మహమ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ తాను అనేక నియోజకవర్గాల్లో పని చేసినప్పటికీ, జూబ్లీహిల్స్‌లో పిజెఆర్‌కు లభించిన గౌరవం, అభిమానం, ప్రజల ఆదరణ విశేషమైనదని అన్నారు. ప్రజాసేవ పట్ల ఆయనకు ఉన్న అంకితభావం, విలువల ద్వారా పిజెఆర్ ప్రజల హృదయాల్లో ఎప్పటికీ జీవిస్తూనే ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాస్వామికవాది యోధుడు కామ్రేడ్ వి.ఎల్.నర్సింహారెడ్డి

సంస్మరణ సభలో కొనియాడిన పశ్య పద్మ




**కామారెడ్డి :** సిపిఐ నాయకులు, ప్రజాస్వామికవాది, కార్మిక, కర్షక, పీడిత ప్రజల హక్కుల యోధుడు కామ్రేడ్ వి.ఎల్.నర్సింహారెడ్డి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ అన్నారు. నర్సింహారెడ్డి సంస్మరణ సభ ఆదివారం మధ్యాహ్నం కామారెడ్డిలోని గవర్నమెంట్ హైస్కూల్ రోడ్‌లో పాత జివిఎస్‌ఆర్ కాలేజీ జరిగింది. కార్యక్రమంలో అన్ని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై అతనితో వారికి ఉన్న అనుబంధం, ప్రజల, కార్మికుల పట్ల ఉన్న అంకితభావాన్ని మననం చేసుకొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంస్మరణ సభకు పశ్య పద్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వి.ఎల్. నర్సింహారెడ్డి కామారెడ్డి లో మున్సిపల్, ఆర్‌టిసి, హమాలీ, హాస్పిటల్ తదితర కార్మిక పోరాటాలు నడిపి ఎన్నో హక్కులు సాధించడానికి నిరంతరం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఉద్యమకాలంలో అనేక మందికి బెయిల్ ఇప్పించి పేదల వకీల్‌గా పేరు ప్రఖ్యాతులు పొందిన వ్యక్తి అని అన్నారు. ఈ సభకు న్యాయవాదులు వేణుగోపాల్, సిద్దిరాములు, వెంకట్రాంరెడ్డి, నవీన్, మున్సిపల్ సంఘ నాయకులు లక్ష్మణ్, నర్సింగరావు, సిపిఐ జిల్లా నాయకులు దశరథ్, బాలరాజ్, బిఎల్‌ఎఫ్ నాయకులు సిద్దిరాములు, లెక్చరర్ శంకర్, ఆర్టీసీ నాయకులు వెంకటి గౌడ్, వి. డి దాస్ తదితరులు పాల్గొన్నారు.

## గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు న్యాయం జరగాలి

టిజిపిడబ్ల్యుయు స్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డెలివరీ కార్మికులు ఈ నెల 25న దేశవ్యాప్తంగా చేసిన ఫ్లాష్ స్ట్రైక్‌తో గణనీయంగా డెలివరీలు నిలిచిపోయాయని, డిసెంబరు 31న చేపట్టే స్ట్రైక్ మరింత భారీ ప్రభావం చూపనుందని తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) స్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోని ప్లాట్‌ఫాం కంపెనీలను నియంత్రించడంతో పాటు న్యాయమైన వేతనాలు, భద్రత, సామాజిక రక్షణను అమలు చేసేలా చూడాలని కోరారు. స్ట్రైక్ తరువాత స్విగ్గి షేర్ ధర 2 శాతం వరకు పడిపోయిందని తెలిపారు.

## పథకాలు బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం

మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు, పథకాలు తీసుకువస్తే వాటిని బిజెపి ప్రభుత్వం నీరు గార్చుతూ పేదలకు అన్యాయం చేస్తోందని మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి, అజారుద్దీన్‌లు విమర్శించారు. ఆదివారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ తీర్మానం చేయాలి కొత్త సర్పంచ్‌లు మొదటి గ్రామ సభలో తీర్మానం చేయాలని కోరారు. 2004లో సోనియా గాంధీ నేతృత్వంలో యుపిఎ ప్రభుత్వం ఆనాడు అనేక మంది మేధావులతో సంప్రదించి గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థ పెంచడానికి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిరన్నారు. తద్వారా పనిలేని రోజుల నుండి పని కల్పించి ప్రజల ఆర్థిక వ్యవస్థ రూపు మారిందని చెప్పారు. 2014 ఎన్నికల ఎజెండాలో బిజెపి గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే కాకుండా పట్టణ ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పిన పార్టీ ఈ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపాధి హామీ పథకం బిల్లు మార్పులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి ఉన్న మహాత్మా గాంధీ పేరు తొలగించడం కుట్ర పూరితమైన నిర్ణయమని అన్నారు. రాష్ట్రాన్ని చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి కేంద్రం మన రాష్ట్రానికి నిధులు ఇవ్వడం లేదని ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితిని పెంచడం లేదని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి 90 శాతం నిధులు కేంద్రమే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ ప్రపంచం అంత గాంధీ సేవలను కొనియాడుతుంటే బిజెపికి మాత్రం ఆయన పేరే నచ్చడం లేదన్నారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు రోహిన్ రెడ్డి, సంగిశెట్టి జగదీష్, చరణ్ కౌశిక్, నిజముద్దీన్ పాల్గొన్నారు.

## హనుమంతుకు అరుణాంజలి



పుల్లెంల గ్రామంలో ముగిసిన మావోయిస్టు నేత అంత్యక్రియలు
పాల్గొన్న పౌర హక్కుల సంఘం, విరసం, అమరుల బంధు మిత్రుల సంఘం నేతలు



**ప్రజాపక్షం/చండూరు :** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శి పాక హనుమంతు ఆలియాస్ ఉయికే గణేష్ అంత్యక్రియలు నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలో ఆదివారం ముగిశాయి. ఆదివారం ఉదయం 11 గంటలకు పుల్లెంల గ్రామానికి చేరుకున్న పాక హనుమంతు పార్థివదేహాన్ని గ్రామ ప్రజలు, అభిమానులు, మావోయిస్టు మాజీ నేతలు వామపక్ష పార్టీల నేతలతో భారీ ర్యాలీతో హనుమంతు తల్లిదండ్రులు నివాసం ఉన్న ఇంటికి తీసుకెళ్లారు. విప్లవ యోధుడికి నివాళులర్పించిన అనంతరం అక్కడి నుండి ఖననం చేసే వరకు భారీగా తరలివచ్చిన జనసంద్రోహం మధ్య పాక హనుమంతు అంత్యక్రియలు జరిగాయి. పాక హనుమంతు అంత్యక్రియలకు పుల్లెంల గ్రామం మొత్తం జనాలతో కిక్కిరిసిపోయింది. పాక హనుమంతు అంత్యక్రియల్లో పాల్గొనుటకు పౌర హక్కుల సంఘం నేతలు, విరసం నేతలు, అమరవీరుల బంధు మిత్రులు సంఘం నేతలు, మాజీ మావోయిస్టు నేతలు, వామపక్షనేతలు భారీగా తరలివచ్చి హనుమంతు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ చేపడుతున్న బూటకపు ఎన్‌కౌంటర్‌లపై న్యాయ విచారణ చేయాలని, కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు మఫ్టిలో ఉంటూ అడుగడుగునా నిఘా ఉంచారు. అంత్యక్రియలు ముగిసే వరకు జననాట్యమండలి, ప్రజా సంఘాల ఆటలు ఆటలు, డప్పుచప్పులతో మారుమోగింది. పార్థివదేహానికి నిప్పు అంటించే వరకు ప్రజలు అక్కడే ఉండి అరుణాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, టిజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె రవికుమార్, శాంతి సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లా యాదయ్య, హైదరాబాద్ సిపిఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తిర్పారి వెంకటేశ్వర్లు, నల్పరాజు రామలింగయ్య, భారత న్యాయవ్యాదుల సంఘం నాయకులు గుర్రం వెంకట్ రెడ్డి, చెరుకు సుధాకర్ గౌడ్, అనురాధ, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ రావు, కార్యదర్శి నారాయణ, అమరుల బంధు మిత్రుల సంఘం నాయకులు పద్మ కుమారి, భవాని, అంజమ్మ, విరసం నేతలు పాణి, రివేరా, జననాట్య మండలి సంధ్య, వేముల పుష్మా, పుల్లెంల సర్పంచ్ ముక్కాముల వెంకన్న, పాక హనుమంతు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పుస్తక ప్రియుల కోసం సొసైటీ కృషి అభినందనీయం






బుక్ ఫెయిర్‌లో పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్‌టిఆర్ స్టేడియం(కళాభారతి)లో ఏర్పాటు చేసిన 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను నవ చేతన విజ్ఞాన సమితి ఛైర్మన్, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకటరెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ఆదివారం సందర్శించారు. బుక్ ఫెయిర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను వారు సందర్శించి, పలువురు యువ రచయితలతో కాసేపు సంభాషించారు. అనంతరం బుక్ ఫెయిర్ లోని నవచేతన పబ్లిషింగ్ హౌస్(విశాలాంధ్ర) స్టాల్‌ను పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం సందర్శించారు. ఈ సందర్భంగా పుస్తకాల ప్రదర్శన, ప్రజల ఆసక్తి, యువ తరం స్పందన తదితర వివరాలను హైదరాబాద్ బుక్ ఫెయిర్ కోశాధికారి, నవచేతన పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ నారాయణరెడ్డి, భరత్‌కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. పుస్తక ప్రియులకు కోసం హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమని పల్లా వెంకటరెడ్డి ప్రశంసించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట రెడ్డి, నెల్లికంటి సత్యంను సొసైటీ అధ్యక్షులు కవి యాకూబ్, కార్యదర్శి వాసు, ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి సత్కరించారు.

## టెట్ పరీక్ష కేంద్రాల కేటాయింపు లోపభూయిష్టం :ఎ.వి.సుధాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో నిర్వహించనున్న టెట్ పరీక్ష కేంద్రాల కేటాయింపు లోపభూయిష్టంగా ఉందని ఎస్‌టియుటియస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎ.వి.సుధాకర్ అన్నారు. పరీక్ష కేంద్రాలను సుదూర ప్రాంతాల్లో కేటాయించడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదరుకానున్నాయని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మెజారిటీ ఉపాధ్యాయులకు ఖమ్మం, హైదరాబాద్ తదితర సుదూర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించడం వల్ల వారు వ్యయప్రయాసలకు గురవుతారని అన్నారు. జనవరి 3 నుంచి 20 వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో రోజుకు రెండు సెషన్లలో జరగనున్న టెట్ పరీక్షలకు ఈసారి 70వేలకు పైగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు హాజరవుతున్నారని అన్నారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని తక్షణమే సమీప జిల్లాల్లోనే పరీక్ష కేంద్రాలు కేటాయించేలా పాఠశాల విద్యాశాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా పరీక్షలు రాసే ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని సుధాకర్ డిమాండ్ చేశారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడుతున్నాం

- డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు
- బస్ పాస్‌లతో సహా అన్ని సంక్షేమ పథకాలను వారికీ వర్తింపచేయిస్తాం
- మీడియా అకాడమీ ఛైర్మన్‌పై విమర్శలు తగదు
- తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియూడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జర్నలిస్టుల సంక్షేమం కోసం గత 70 ఏళ్లగా పాటుపడుతున్న తమ సంఘం డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, బస్ పాస్‌లతో సహా అన్ని సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేసేందుకు తాము ప్రభుత్వంతో చర్చించి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియూడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ భరోసా ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టులను ఇతర జర్నలిస్టులను తాము వేరుగా చూడడం లేదని, వారికి కూడా బస్ పాస్‌లతో సహా ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని తప్పకుండా వర్తింప చేయిస్తామని అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని యూనియన్ కార్యాలయంలో టియుడబ్ల్యుజె రాష్ట్ర ముఖ్యుల సమావేశం జరిగింది. అనంతరం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, రాష్ట్ర నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విరాహత్ అలీ మాట్లాడారు.

**డెస్క్ జర్నలిస్టులందరికీ మీడియా కార్డులు..**

గత 10 ఏళ్ల కాలంలో డెస్క్ జర్నలిస్టులకు కొంతమందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చారని, కానీ ఇప్పుడు తాము డెస్క్‌లో పనిచేసే జర్నలిస్టులందరికీ మీడియా కార్డులు అందించేందుకు కృషి చేస్తున్నామని విరాహత్ అలీ అన్నారు. ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డుతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా కృషి చేస్తామన్నారు. నానాటికీ జర్నలిజంలో అడుగంటుతున్న విలువలను పెంపొందించేందుకే కొన్ని కట్టుదిట్టమైన నిబంధనలతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 252 జి.ఓను తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. ఉనికి చాటుకోవడానికి కొన్ని సంఘాలు, డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందంటూ గగ్గోలు పెట్టడంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. అబద్దాలు, కల్పితాలతో వాళ్ళు చేస్తున్న అపోహలు నమ్మవద్దని ఆయన జర్నలిస్టులను కోరారు.

**ఎవరు చెప్పారు? కార్డులు తగ్గుతున్నాయని..**

252 జి.ఓతో 13వేల అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతున్నట్లు ఆందోళన చేస్తున్న సంఘానికి ఎవరు చెప్పారని ఆయన ప్రశ్నించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు అందేలా చేయడమే టియుడబ్ల్యుజే ప్రధాన ధ్యేయం అన్నారు. 1996 సంవత్సరానికి ముందు ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 3 వేల అక్రిడిటేషన్ కార్డులు మాత్రమే ఉండేవని, అప్పటి తమ సంఘం ప్రభుత్వంతో కొట్లాడి గ్రామీణ విలేకరులందరికీ మండలాల వారీగా అక్రిడిటేషన్లు ఇప్పించిన ఘనమైన చరిత్ర తమదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 3వేల అక్రిడిటేషన్‌లను 12 వేలకు పెంచిన ఘనత తమ సంఘానిదేనన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా 23 వేల అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చామని గొప్పలు చెబుకుంటున్న మిత్రులు, పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా అదే సంఖ్యలో అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చారన్న విషయాన్ని మర్చిపోతున్నారని గుర్తు చేశారు.

**మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని విమర్శించడం సరైంది కాదు..**

252 జి.ఓ తెచ్చి జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డిని విమర్శించడం సరైంది కాదన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ ఆధ్వర్యంలో ఏడుగురు ప్రముఖులైన పాత్రికేయులతో కమిటీ ఏర్పాటై, ఐదారుసార్లు సమావేశమై మార్గదర్శకాలు రూపొందించిన విషయం గగ్గోలు చేస్తున్న మిత్రులకు తెలియదా? అని విరాహత్ ప్రశ్నించారు. సమాచార శాఖ కమిషనర్‌తో పాటు ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు కె.శ్రీనివాస్, ది హిందూ పత్రిక పొలిటికల్ ఎడిటర్ రవికాంత్ రెడ్డి, వి6 వెలుగు పత్రిక సిఈఓ అంకం రవి, సియాసత్ ఎడిటర్ ఆమెర్ అలీ ఖాన్, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ నాయకుడు కె.ఎన్.హరి తదితరులతో వేసిన కమిటీ రూపొందించిన నిబంధనల మేరకే 252 జి.ఓ వచ్చిందన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ సూచనల మేరకు జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నియమ నిబంధనలు రూపొందించేందుకు సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ సూచించిన సిఫార్సులను అప్పటి మీడియా అకాడమీ చైర్మన్ ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రామచంద్ర మూర్తి కమిటీ సిఫార్సులకు భిన్నంగా తీసుకువచ్చిన 239 జి.ఓతో జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుంటే అప్పటి మీడియా అకాడమీ చైర్మన్, ఆయన సంఘం ఎందుకు నోరెత్తలేదన్నారు. ఆ జి.ఓతో చిన్న మధ్య తరహా పత్రికలకు, ఉర్దూ పత్రికలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దాదాపు 4500 అక్రిడిటేషన్ కార్డులు తొగించబడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో, తెలంగాణకు చెందిన యాజమాన్యాలు స్థాపించిన రెండు ప్రధాన పత్రికలకు అక్రిడిటేషన్‌లను అడ్డుకున్నది ప్రస్తుతం ఆందోళన చేస్తున్న సంఘమేనని విరాహత్ ఆరోపించారు. ఆ విషయంలో ప్రెస్ కౌన్సిల్‌ను ఆశ్రయించి, ఆ పత్రికలకు న్యాయం చేసిన ఘనత తమ సంఘానిదే అని ఆయన గుర్తు చేశారు.

**జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారి చేతుల్లో 3 వేల కార్డులు !**

గతంలో రాష్ట్రంలో జారీచేసిన దాదాపు 3 వేల అక్రిడిటేషన్ కార్డులు జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారి చేతుల్లో ఉన్నట్లు తమ సంఘానికి అందిన ఫిర్యాదుల్లో తేలిందన్నారు. అడ్డదారుల్లో అక్రిడిటేషన్‌లు పొందిన వారే జర్నలిస్టులుగా చలామణి అవుతూ, ఇసుక వ్యాపారులను, రైస్ మిల్లర్లను, బిల్డర్లను, ఇతర వ్యాపారులను బెదిరిస్తూ పోలీసులకు చిక్కారని, వారిపై కేసులు నమోదు కావడం జర్నలిజం విలువలను మంటగలిపిందన్నారు. జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందంటూ ఆందోళనకు దిగిన ఆ సంఘం రాష్ట్ర కీలక నాయకుని కుటుంబ సభ్యులు నలుగురు మీడియా ఏజెన్సీ పేరుతో అక్రిడిటేషన్ కార్డులు పొందారని, అదే సంఘానికి చెందిన మరో రాష్ట్ర నాయకుని కుమారుడు యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఓ గ్రామ సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ, అతనికి జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వడంపై తమ సంఘం ఆందోళన చేసి ఆ కార్డును రద్దు చేయించిన విషయాన్ని విరాహత్ అలీ గుర్తు చేశారు.

**ఆస్తిత్వం కోసం దుష్ప్రచారం : రాంనారాయణ**

యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ మాట్లాడుతూ ఇటీవల తమ సంఘం సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ముందు రెండు వేల మంది జర్నలిస్టులతో నిర్వహించిన మహా ధర్నాతో ప్రభుత్వం దిగివచ్చి యుద్ధప్రాతిపదికన జి.ఓ జారీ చేసిందన్నారు. అయితే ఆస్తిత్వం కోసం, ఉనికిని చాటుకోవడానికి ఒక సంఘం తమ సంఘ జాతీయ నాయకుడిపై దుష్ప్రచారం చేస్తూ అలజడి సృష్టించడం సహించరానిదన్నారు. ఈ సమావేశంలో టియుడబ్ల్యుజె రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్లూరి రాములు, ఉపాధ్యక్షుడు గాడిపల్లి మధు, కార్యదర్శులు కె.శ్రీకాంత్ రెడ్డి, వరకాల యాదగిరి, జి.మధు గౌడ్, కోశాధికారి ఎం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రాజేష్, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, హెచ్‌యుజె అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**జర్నలిస్టులందరికీ ప్రయోజనాలు చేకూర్చేందుకు కార్యాచరణ..**

అక్రిడిటేషన్ కార్డులతో రిపోర్టర్‌లకు, డెస్క్ జర్నలిస్టులకు ఇంతకాలం ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని, కనీసం ఇప్పుడైనా సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, అక్రిడిటేషన్, మీడియా కార్డులు పొందే వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రయోజనాలు చేకూర్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. 252 జిఓలో ఉన్న కొన్ని లోటుపాట్లను తాము గుర్తించామని, వాటిని సవరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఏది ఏమైనా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు, మీడియా కార్డులు అందించేందుకు తమ సంఘం తీవ్రంగా కృషి చేస్తుందన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు వ్యాగన్లు
### పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం

**పాట్నా/కోల్‌కతా :** బీహార్‌లోని జముయి జిల్లాలో ఒక గూడ్స్ రైలుకు చెందిన ఎనిమిది వ్యాగన్లు పట్టాలు తప్పాయని, దీనివల్ల హౌరా–పాట్నా–ఢిల్లీ మార్గంలో రైలు సేవలకు అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వారు చెప్పారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై విచారణకు ఆదేశించినట్లు తూర్పు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. తూర్పు రైల్వేలోని అసన్‌సోల్ డివిజన్ పరిధిలో లహబన్, సిములా్తాలా రైల్వే స్టేషన్ల మధ్య శనివారం రాత్రి 11.25 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. దీనివల్ల రాత్రికి రాత్రే సుమారు రెండు డజన్ల రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడి, ప్రయాణికులకు ఇబ్బంది కలిగింది. ప్రమాద స్థలానికి అసన్‌సోల్, మధుపూర్, ఝఝా స్టేషన్ల నుండి సహాయక రైళ్లను పంపినట్లు ఆయన తెలిపారు. పట్టాల తొలగింపు, పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని ఆయన చెప్పారు. గూడ్స్ రైలు పట్టాలు తప్పడం వల్ల రైలు మార్గాలు మూసుకుపోవడంతో అనేక ఎక్స్‌ప్రెస్, ఇతర ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారని, దారి మళ్లించారని ఇఆర్ అధికారి తెలిపారు.



## సాధన చేస్తే ఏదైనా సాధ్యమే
### దువ్వూరి శేషగిరిరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సాధన చేస్తే ఏదైనా సాధ్యమేమని రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ మాజీ సంచాలకులు దువ్వూరి శేషగిరిరావు అన్నారు. మలక్‌పేట కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్ఎస్‌సి 1969 బ్యాచ్ పూర్వ విద్యార్థుల 5 ఆత్మీయ సమ్మేళనం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆనాటి తమ మ్యాథ్స్ అధ్యాపకులు డి.శేషగిరిరావు దంపతులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డి.శేషగిరిరావు మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు విద్యారంగంలో ప్రభుత్వ విద్యా సంస్థలు కీలక పాత్ర అని అన్నారు. విద్యా సంస్థలు వ్యాపార కోణంలో కాకుండ సేవా దృక్పథంతో పనిచేయాలని తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా ఎప్పుడు ఎర్నింగ్ మాత్రమే కాకుండా లెర్నింగ్‌లో కూడా ఉండాలని సూచించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ చదువుల ద్వారా తమను ఉన్నత శిఖరాలకు చేర్చిన గురువులను ఎప్పటికి మర్చిపోలేమన్నారు. అందుకే ఆత్మీయ సమ్మేళనం వారిని సత్కరించుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా చిన్ననాటి మిత్రులను ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, ఆనాటి మరపురాని మధురమైన సంఘటనలు, చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా, సంతోషంగా గడిపారు. ఈ సమ్మేళనంలో వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన.. పి.సుబ్రహ్మణ్యేశ్వరరావ్, దుగ్గరాజు లక్ష్మి పద్మజ ఆకట్టుకున్నారు. మోహన్‌ప్రసాద్, ఎన్‌సి కృష్ణమోహన్ , మల్లాది వాసంతి.. సాంస్కృతిక కార్యక్రమాలతో .. రకరకాల ఆటలతో పాటలతో రంజింపచేశారు.

## న్యూ ఇయర్ వేడుకల వేళ ఎక్సైజ్ శాఖ దాడులకు సిద్ధం
### కమిషనర్ సి.హరికిరణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని డిసెంబర్ చివరి వారంలో తెలంగాణ వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ ముప్పేట దాడులు చేపట్టింది. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు, జిల్లా టాస్క్ ఫోర్స్ (డిటిఎఫ్) బృందాలు, ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది అవసరమైన చోట సంయుక్తంగా, లేక విడివిడిగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తారని తెలంగాణ ప్రొహిబిషన్ అండ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ తెలిపారు. ఈనెల 27 నుంచి జనవరి 1 వరకు ఆరు రోజుల పాటు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డిపిఎల్‌తో పాటు డ్రగ్స్ సరఫరా, విక్రయాలు, వినియోగంపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు, దాడులు నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. తెలంగాణకు నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం రైళ్లు, రోడ్డు మార్గాల్లో బస్సులు, పార్సిల్ వాహనాలు, కార్లు తదితర ప్రైవేట్ వాహనాలు, అలాగే వాయు మార్గాల ద్వారా అక్రమంగా వచ్చే అవకాశాలు ఉన్నందున అన్ని రవాణా మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. ఎన్‌డిపిఎల్ మద్యం తెలంగాణలోకి ప్రవేశించకుండా అడ్డుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హర్యానా, ఢిల్లీ నుంచి అసిఫాబాద్, మంచిర్యాల్, రామగుండం, ఖాజీపేట, భువనగిరి రైల్వే స్టేషన్ల మీదుగా తెలంగాణ ఎక్స్‌ప్రెస్ సహా ఇతర రైళ్ల ద్వారా, అలాగే గోవా నుంచి గద్వాల్, మహబూబ్‌నగర్, వికారాబాద్ మార్గాల ద్వారా వాస్కోడిగామా తదితర రైళ్లలో కోర్ అర్బన్ ప్రాంతాలకు అక్రమ మద్యం రవాణా జరుగుతున్నట్లు ఎక్సైజ్ శాఖ గుర్తించినట్టు తెలిపారు. విమానాల ద్వారా కూడా కొన్ని ప్రాంతాల నుంచి ఎన్‌డీపీఎల్ మద్యం తరలింపులు జరుగుతున్నట్టు సమాచారం ఉందన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖలో పని చేస్తున్న నాలుగు ఎస్టీఎఫ్ టీమ్‌లు, జిల్లాల ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు, మొత్తం 34 డిటిఎఫ్ బృందాలు, 151 మంది ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది పాల్గొంటారని కమిషనర్ వెల్లడించారు.

### మౌలిక సదుపాయాలు–రాబడి–భద్రతలో
# దక్షిణ మధ్య రైల్వే కొత్త మైలురాళ్లు

**సరుకు రవాణా ఆదాయం రూ.12,841 కోట్లు**
**ప్రయాణికులపై ఆదాయం రూ.5,525 కోట్లు**













**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణ మధ్య రైల్వే 2025 లో అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతిని నమోదు చేసింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, నూతన రైళ్లను ప్రవేశపెట్టడం, స్టేషన్ల పునరాభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాల విస్తరణ, సిబ్బంది సంక్షేమం, సరుకు రవాణా, రాబడి వృద్ధి, భద్రతా చర్యల బలోపేతం వంటి అంశాల్లో అనేక మైలురాళ్లను అధిగమించింది. హైదరాబాద్ నగర రైల్వే రద్దీని తగ్గించాలనే లక్ష్యంతో చర్లపల్లిలో నిర్మించిన నూతన శాటిలైట్ టెర్మినల్‌ను గౌరవ ప్రధానమంత్రి జనవరి 2025లో ప్రారంభించారు. ఈ టెర్మినల్ ప్రారంభంతో నగర ప్రయాణికులకు సౌకర్యవంతమైన, ఇబ్బంది లేని ప్రయాణానికి మార్గం సుగమమైంది.

వైద్య రంగంలోనూ దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక చొరవ చూపింది. ఫిబ్రవరి 2025లో జోన్ వైద్య విభాగం ఆధ్వర్యంలో రైల్వే అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్టుల తొలి వార్షిక సదస్సును విజయవంతంగా నిర్వహించింది. ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా మార్చి 2025లో సికింద్రాబాద్ లాలాగూడ సెంట్రల్ హాస్పిటల్‌లో అత్యాధునిక 64 స్లైసెస్ సీటీ స్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే జూన్ 2025లో అదే ఆసుపత్రిలో ఇంటర్నల్ కార్డియాక్ క్యాథ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. స్టేషన్ల ఆధునీకరణలో భాగంగా తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వే స్టేషన్లను అమృత్ స్టేషన్లుగా పునరాభివృద్ధి చేసి మే 2025లో గౌరవ ప్రధానమంత్రి రిమోట్ వీడియో లింక్ ద్వారా ప్రారంభించారు. పర్యాటకాభివృద్ధికి ఊతమిస్తూ కాచిగూడ హెరిటేజ్ స్టేషన్‌కు రూ.2.2కోట్ల వ్యయంతో లైటింగ్ సుందరీకరణ చేపట్టి, జూన్ 2025లో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి దేశానికి అంకితం చేశారు. రైలు సేవల విస్తరణలో భాగంగా జూలై 2025లో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కాచిగూడ–భగత్ కీ కోటి మధ్య నూతన రోజువారీ రైలును ప్రారంభించారు. అదే నెలలో పెద్దపల్లి జంక్షన్ వద్ద బైపాస్ లైన్ ప్రారంభం కావడంతో రైళ్ల ఆలస్యాలు తగ్గి ప్రయాణ సమయం ఆదా అవుతోంది. ఆగస్టు 2025లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సీఎస్టీఎం–జాల్నా వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నాందేడ్ వరకు పొడిగించి ప్రారంభించారు. డిసెంబర్ 2025లో తిరుపతి–సాయినగర్ షిర్డీ మధ్య నూతన వీక్లీ రైలును కేంద్ర సహాయ మంత్రి వి.సోమన్న, అలాగే చెన్నై సెంట్రల్–విజయవాడ వందే భారత్‌ను నరసాపురం వరకు పొడిగింపును కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రారంభించారు.

**ఈ ఏడాది ఆదాయం రూ.19,314 కోట్లు**

రాబడి పరంగా 2025 జనవరి–నవంబర్ మధ్య సరుకు రవాణా 136.2 మిలియన్ టన్నులకు చేరగా, సరుకు రవాణా ఆదాయం రూ.12,841 కోట్లుగా నమోదైంది. ప్రయాణికుల ఆదాయం రూ.5,525 కోట్లకు చేరగా, మొత్తం స్థూల ఆదాయం రూ.19,314 కోట్లుగా నమోదు అయింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 52 స్టేషన్లు/సేవా భవనాలు నెట్ జీరో/జీరో ప్లస్ ఎనర్జీ లేబులింగ్ సాధించి భారతీయ రైల్వేలలోనే అత్యధికంగా నిలిచాయి. 2025లో మూడు గతి శక్తి కార్గో టెర్మినల్స్ ప్రారంభమయ్యాయి. భద్రతా చర్యల్లో భాగంగా 68 మ్యాన్డ్ లెవల్ క్రాసింగ్ గేట్లు తొలగించగా, 22 రోడ్ ఓవర్ బ్రిడ్జీలు, 60 రోడ్ అండర్ బ్రిడ్జీలు నిర్మించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా 199 కి.మీ ట్రాక్ జోడింపు, 184 కి.మీ విద్యుదీకరణ, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ ద్వారా 529 కి.మీ లైన్ సామర్థ్య పెంపు, తొమ్మిది ఇంటర్మీడియట్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థల ప్రారంభం వంటి కీలక పనులు పూర్తయ్యాయి. విద్యుదీకరణతో సికింద్రాబాద్ డివిజన్ 100 శాతం ఎలక్ట్రిఫైడ్ డివిజన్‌గా నిలిచింది. ఇంధన పరిరక్షణలో ప్రతిభ చూపినందుకు దక్షిణ మధ్య రైల్వే 2025 సంవత్సరానికి నాలుగు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులను దక్కించుకుంది. ఈ విధంగా 2025లో దక్షిణ మధ్య రైల్వే సాధించిన విజయాలు దేశ రైల్వే అభివృద్ధిలో మరో కీలక అధ్యాయంగా నిలిచాయి.

## టూరిజంలో అక్రమార్కుల ఏరివేతలు షురూ

**కఠిన చర్యలు తప్పవు అంటున్న ఎండి వల్లూరి క్రాంతి**
**ఇద్దరు అధికారుల సస్పెన్షన్..మరొకరిపై బదిలీ వేటు**



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి)లో జరుగుతున్న అక్రమాలపై ఎండి వల్లూరి క్రాంతి దృష్టి సారించారు. టిజిటిడిసి అభివృద్ధి కోసం ఉన్నతాధికారులు అహర్నిశలు ప్రణాళికలు రచించి, ఆచరణలో తెస్తుండగా మరోపక్క కొందరు అక్రమార్కులు నిధులను గోల్‌మాల్ చేసే పనిలోపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రాజకీయ నేతల అండదండలు చూసుకుని అక్రమాలకు పాల్పడ్డ అధికారులు, ఉద్యోగులు ఇప్పటికీ అదే పంథాలో నడుస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవలే టిజిటిడిసిలో పలు అక్రమాలు వెలుగు చూశాయి. దీంతో టిజిటిడిసి ఎండి వల్లూరి క్రాంతి ఆగ్రహం వ్యక్త పర్చారు. టిజిటిడిసిలో నిధులను పక్కదారి పట్టించి అక్రమాలకు పాల్పడుతున్నా అధికారులపై దృష్టి సారించారు. ''డిస్కౌంట్ల పేరుతో టూరిజం నిధులు గోల్ మాల్'' అనే శీర్షికతో ఈ నెల 4న ప్రజాపక్షంలో ఒక కథనం ప్రచురితమైంది. టూరిజం ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ రాజలింగం నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో ఎండి క్రాంతి ఈ అంశంపై విచారణ జరిపారు. దశాబ్దకాలంగా ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్‌గా పాతుకుపోయిన రాజలింగంపై అభియోగాలురుజువు కావడంతో అతనిపై వేటు వేశారు. ట్రాన్స్‌పోర్ట్స్ మేనేజర్ స్థానం నుంచి అతన్ని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. రాజలింగంను దుర్గంచెరువుకు బదిలీ చేశారు.

అలాగే టిజిటిడిసి నిధులు రూ.1.20కోట్ల నిధులు కూడాదుర్వినియోగం అయ్యాయి. ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు.. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులను తమ సొంత ఖాతాలోకి మళ్లించారు.ఈ విషయంపై కూడా ఎండి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భాగోతంపై ఏకంగా హైదరాబాద్ సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఐదు గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులను సిసిఎస్‌పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు కూడా తరలించారు. ఈ ఘటనకు బాధ్యులుగా చేస్తూ హిమాయత్‌నగర్‌లోని ప్రధాన కార్యాయలంలో పనిచేస్తున్న మరో ఇద్దరు అధికారులపై ఎండి క్రాంతి ఏకంగా సస్పెన్షన్ వేటు వేశారు.

సస్పెన్స్‌కు గురైన వారిలో డిప్యూటీ మేనేజర్ రాజేష్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మహేష్ ఉన్నారు. తెలంగాణ టూరిజం అభివృద్ధికి ఒక్క పక్క కృషి చేస్తునే సంస్థలో ఉన్న పందికొక్కులను ఏరివేత పనిలో ఎండి క్రాంతి బిజిబిజిగా ఉన్నారు. సంస్థలో అక్రమార్కులకు కట్టడిచేస్తేనే నిధులుదుర్వినియోగం కాకుండా ఉంటాయి.

## మావోయిస్టుల నియంత్రణకు
### బిజాపూర్‌లో కీలక భద్రతాస్థావరం ఏర్పాటు

**బిజాపూర్ :** మావోయిస్టుల కార్యకలాపాలను నియంత్రించడానికి వ్యూహాత్మకంగా కీలక కేంద్రమైన బిజాపూర్‌లో కొత్త భద్రతా స్థావరం ఏర్పాటు చేశారు. దీనివల్ల బహుముఖ ప్రయోజనాలు కలుగుతాయి. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్ల కార్యకలాపాలు ఉద్ధృతంగా ఉండే బిజాపూర్ జిల్లాలో భద్రతా ప్రమాణాలకు సంబంధించిన శూన్యతను తొలగించడానికి, అభివృద్ధి కార్యకలాపాల వేగాన్ని పెంచడానికి, ఛత్తీస్‌గఢ్–మహారాష్ట్ర సరిహద్దులలో మావోయిస్టుల కదలికలు కనిపెట్టుకుని ఉండటానికి కొత్తగా ఒక పోలీసు శిబిరం ఏర్పాటు చేసినట్లు అధికారులు ఆదివారం చెప్పారు. దీనివల్ల ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వంతో పాటు ఒక భద్రతా వాతావరణంతోపాటు ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది. భోపాల్‌పట్నం (బిజాపూర్) నుండి వర్నేగర్ష్–సెంద్రా మీదుగా గడ్చిరోలి (మహారాష్ట్ర)కు ఒక రహదారి నిర్మించేందుకు, ఇన్నాళ్ళుగా నిర్లక్ష్యానికి గురైన మారుమూల గ్రామాలలో అభివృద్ధిని వేగవతం చేయడానికి వీలు కలుగుతుంది. 2024 నుండి ఇప్పటివరకూ 29 కొత్త భద్రతా స్థావరాలు బిజాపూర్ జిల్లాలో ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గ్రామస్థులకు రాష్ట్ర ప్రభుత్వ 'నియాద్ నెల్లా నార్'' (మీ మంచి గ్రామం) పథకం కింద మౌలికమైన సదుపాయాలు సమకూర్చి మౌలిక భద్రత ఇవ్వడంకోసం, మౌలికమైన వసతులు సమకూర్చడం కోసం మావోయిస్టు వ్యతిరేక స్థావరం ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారి చెప్పారు. ఈ స్థావరంవల్ల గ్రామస్థులకు మౌలికమైన వైద్య సదుపాయాలు, మౌలిక విద్యాసదుపాయాలు సమకూర్చడానికి భరోసా ఇచ్చినట్లవుతుంది. క్రమంగా ఈ ప్రాంతంలోని మారుమూల గ్రామాలకు విద్యుత్ సదుపాయం, త్రాగునీరు సరఫరా, ప్రజాపంపిణీ ద్వారా నిత్యావసరాల సరఫరా, రహదారులు, వంతెనల నిర్మాణాలకు కూడా వీలు కలుగుతుందని చెప్పారు.

## భగ్గుమన్న బొగ్గుగనుల 'నిరసనాగ్ని'

**రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరివల్లే ఈ విధ్వంసం : ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ చీఫ్ దీపక్ బైజు ధ్వజం**

**రాయ్‌గఢ్ :** ఛత్తీస్‌గఢ్ రాయ్‌గఢ్ జిల్లాలోని తమ్నార్ ప్రాంతంలో బొగ్గుగనుల ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా శాంతియుతంగా కొనసాగుతున్న ఆందోళన హఠాత్తుగా తీవ్రతరమైంది. పరిస్థితి అదుపుతప్పడంతో ఆ ప్రాంతం హింసాత్మకంగా మారింది. ఈ నిరసనలో అల్లరిమూక పేట్రేగిన ఫలితంగా అనేకమంది పోలీసులు గాయపడ్డారు. వాహనాలు దగ్ధమయ్యాయి. అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. శనివారం ఒక మూక జిందాల్ పవర్ లిమిటెడ్ బొగ్గు నిర్వహణ ప్లాంట్‌లోకి దూసుకెళ్లి కన్వేయర్ బెల్ట్, రెండు ట్రాక్టర్లు, ఇతర వాహనాలను తగులబెట్టడంతో పాటు కార్యాలయ ప్రాంగణాన్ని కూడా ధ్వంసం చేసిందని అధికారులు తెలిపారు. నిరసనకారులు రాళ్లు రువ్వడంతోపాటు ఒక పోలీస్ బస్సు, జీపు, అంబులెన్స్‌కు నిప్పంటించడంతో దగ్ధమయ్యాయి. అనేక ప్రభుత్వ వాహనాలు కూడా ధ్వంసం అయ్యాయని వారు చెప్పారు. డిసెంబరు 8న దౌరభతలో ప్రాజెక్ట్ కోసం జరిగిన ప్రజా విచారణకు వ్యతిరేకంగా తమ్నార్ ప్రాంతంలోని (గారే పెల్మా) సెక్టార్ సెక్టార్‌ఐ కోల్ బ్లాక్ పరిధిలోని 14 ప్రభావిత గ్రామాల ప్రజలు డిసెంబరు 12 నుండి లిబ్రా గ్రామంలోని సిహెచ్‌పి చౌక్ వద్ద బైఠాయించి నిరసనకు దిగారని జిల్లా పరిపాలనా యంత్రాంగం విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది. శనివారం ఉదయం, దాదాపు 300మంది నిరసనకారులు ఆ స్థలం వద్ద గుమిగూడారు. వారిలో కొంతమంది రహదారిని దిగ్బంధించి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారని ఆరోపించారు. సమాచారం అందుకున్న సీనియర్ రెవెన్యూ, పోలీస్ అధికారులు ఉదయం 10గంటలకు జోక్యం చేసుకుని వారికోసం నిర్దేశించిన నిరసన స్థలంలోని గుడారాలకు వెళ్లాలని వారిని ఒప్పించడం జరిగిందని ప్రకటన తెలిపింది. అయితే సమీపంలోని ప్రజలు అక్కడికి తరలిరావడంతో సంఖ్య దాదాపు 1000మందికి చేరుకుంది. శాంతియుతంగా వ్యవహరించాలని రెవెన్యూ, పోలీస్ అధికారులు పదేపదే లౌడ్‌స్పీకర్ల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆ గుంపు మధ్యాహ్నం 2 30గంటల సమయానికి హింసాత్మకంగా మారిందని, కట్టలు తెగిన ఆవేశంతో దూసుకెళ్లిన ఆ మూక పోలీస్ బారికేడ్లను విరగగొట్టారు. ఆగ్రహావేశాలతో ఊగిపోతూ పోలీసులపై కర్రలు, రాళ్లతో దాడికి దిగారని ప్రకటన తెలిపింది. వారి దాడిలో డిఎస్‌పి విశ్వకర్మ, తమ్నార్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి కమ్లా పుసమ్, ఒక కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. మహిళా పోలీసులు సహా మరి కొందరు ఇతర పోలీసులకు కూడా ఈ దాడిలో గాయాలయ్యాయి. అనంతరం ఆ గుంపు ఒక పోలీస్ బస్సు, జీపు, అంబులెన్స్‌కు నిప్పంటించింది. అనేక ప్రభుత్వ వాహనాలను ధ్వంసం చేసింది. జిందాల్ కంపెనీ బొగ్గు నిర్వహణ ప్లాంట్‌లోకి నిరసనకారులు దూసుకెళ్లి లోపల ఉన్న కన్వేయర్ బెల్ట్‌కు నిప్పంటించారు. కార్యాలయ ప్రాంగణంలో ఉన్నటువంటి రెండు ట్రాక్టర్లు, ఇతర వాహనాలను కూడా ధ్వంసం చేశారు. లైలుంగాకు చెందిన ఎమ్మెల్యే విద్యావతి సిదార్, రాయ్‌గఢ్ కలెక్టర్ మయాంక్ చతుర్వేది, ఎస్‌పి దివ్యాంగ్ పటేల్ సంఘటనా స్థలికి హుటాహుటిన చేరుకుని ఆ గుంపును శాంతింపజేసినప్పటికీ ఆ తర్వాత కూడా పరిస్థితి సద్దుమణగలేదు. ప్రభుత్వం రెచ్చగొట్టే వైఖరిని అనుసరించిందని కాంగ్రెస్ చీఫ్ ధ్వజమెత్తారు.

## నేటి నుంచి నగరంలో.. 'మెగా పారిశుద్ధ్య డ్రైవ్'

**300 వార్డుల్లో క్లీనింగ్ ఆపరేషన్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగరాన్ని విశ్వ నగరంగా, మరింత స్వచ్ఛంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) భారీ పారిశుద్ధ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశాల మేరకు నేటి నుంచి జనవరి 31 వరకు నగరంవ్యాప్తంగా ప్రత్యేక 'పారిశుద్ధ్య డ్రైవ్' నిర్వహించనున్నారు. వార్డుల పునర్విభజన తర్వాత 300 వార్డుల్లో ఏకకాలంలో జరుగుతున్న మొట్టమొదటి సమగ్ర పారిశుద్ధ్య కార్యక్రమం ఇదే కావడం విశేషం.

**నెలరోజుల కార్యాచరణ ప్రణాళిక ఇదే..**

నగరంలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడమే లక్ష్యంగా మైక్రో లెవల్ ప్లాన్‌ను అధికారులు సిద్ధం చేశారు. డిసెంబర్ 29న ఫుట్ ఓవర్ బ్రిడ్జిల శుభ్రతతో ఈ డ్రైవ్ మొదలవుతుంది. రాబోయే రోజుల్లో ఫ్లై ఓవర్లు, రోడ్డు డివైడర్లు, సెంట్రల్ మీడియన్లు, చెరువులు, నాలాలు, పార్కులు మరియు ఫుట్‌పాత్‌లను శుభ్రం చేయనున్నారు. నిర్మాణ రంగ వ్యర్థాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగిస్తారు. చెత్త నిల్వ ప్రాంతాలను (జివిపి) పూర్తిగా నిర్మూలించి, ఆ ప్రదేశాలను ముగ్గులు, గోడ చిత్రాలు, మొక్కలతో 'సెల్ఫీ పాయింట్లు'గా మార్చనున్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే 'స్పాట్ ఫైన్'**

నగర పరిశుభ్రతను దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు. బహిరంగ మూత్ర విసర్జన చేసినా, ఎక్కడపడితే అక్కడ చెత్త వేసినా అక్కడికక్కడే జరిమానాలు విధించనున్నారు. రోడ్లపై వదిలేసిన స్క్రాప్ వాహనాలు, పాడైపోయిన ప్రజా మరుగుదొడ్లను ఈ డ్రైవ్‌లో భాగంగా తొలగించనున్నారు.

**డిజిటల్ పర్యవేక్షణ :** ఈ డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు గూగుల్ షీట్లు, జియోకోఆర్డినేట్లు, ఫొటోల ద్వారా ఎప్పటికప్పుడు నివేదికలను పర్యవేక్షించనున్నారు. ఈ డ్రైవ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, వ్యర్థాల నిర్వహణ ఏజెన్సీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన జెసిబిలు, వాహనాలను సిద్ధం చేయాలని కమిషనర్ జోనల్ అధికారులను ఆదేశించారు.

**ప్రజా భాగస్వామ్యమే కీలకం :**

ఈ మెగా డ్రైవ్‌లో పౌరులను భాగస్వామ్యం చేసేందుకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. స్కూళ్లు, గేటెడ్ కమ్యూనిటీలలో తడిపొడి చెత్త ఏర్పాటుపై అవగాహన. యువత, వృద్ధులతో స్వచ్ఛత ప్రతిజ్ఞలు. ఈవేస్ట్ సేకరణ డ్రైవ్‌లు నిర్వహించనున్నారు. తక్షణ పారిశుద్ధ్య చర్యలతో పాటు దీర్ఘకాలికంగా స్థిరమైన పరిశుభ్రత అలవాట్లను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ మెగా డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌ను దేశానికే ఆదర్శ నగరంగా మార్చేందుకు ప్రతి పౌరుడు ఈ స్వచ్ఛత క్రతువులో సహకరించాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ విజ్ఞప్తి చేశారు.

## ఫ్రెంచ్ సినీ లెజండ్–జంతు హక్కుల
### కార్యకర్త బ్రిగిట్టే బార్డోట్ మృతి

**పారిస్:** ఫ్రెంచ్ సినిమా కీర్తి ప్రతిష్ఠలను పతాకస్థాయిలో నిలబెట్టిన ప్రముఖ నటి, జంతు హక్కులకోసం కడవరకూ పోరాడిన కార్యకర్త బ్రిగిట్టే బార్డోట్ కన్నుమూశారు. ఆయన వయసు 91 సంవత్సరాలు. బ్రిగిట్టే బార్డోట్ ఫౌండేషన్ ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. బార్డోట్ దాదాపు యాభైకి పైగా మణిపూసల వంటి చిత్రాలలో నటించారు.

సినీ కెరీర్‌లో ఆమె మొదట చిన్న సినిమాలు చేస్తూ, విమర్శకుల మెప్పు పొందకుండానే ప్రజాదరణ సంపాదించారు. ఆమె సినిమాలన్నీ తమాషాగా, ఆహ్లాదం కలిగించేవి. 1956లో విడుదలైన 'అండ్ గాడ్ క్రియేటెడ్ ఉమెన్' చిత్రం సంచలనం సృష్టించింది. ఆమెను ఆనాడు వెండితెర దేవత చూశారు. ఆ తర్వాత జంతుహక్కుల సంరక్షణ కార్యకలాపాల నిర్వహణపై పూర్తిగా తన దృష్టి కేంద్రీకరించారు. 1960లో తన 26వ పుట్టినరోజునాడు ఆమె ఆత్మహత్యా ప్రయత్నం చేశారు. పరిణామ క్రమంలో 1973 నుండీ నిర్లక్ష్యానికి గురైన జంతువుల సంరక్షణ బాధ్యతలు తీసుకున్నారు. జంతు హక్కుల రక్షణకోసమే ఆమె చివరివరకూ జీవితాన్ని అంకితం చేశారు.

## బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్న డ్రగ్స్ గుట్టును ఎస్‌టిఎఫ్ బి టిం ఎస్ఐ బాలరాజు రట్టు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి వచ్చినటువంటి ఒక క్యాబ్ ఆపి తనిఖీలు నిర్వహించగా అందులో డ్రగ్స్ లభించాయి. సాయి చరణ్ అనే వ్యక్తి వద్ద 5.39 ఎంబిఎఎం డ్రగ్స్ 6 నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిల్స్ మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. నిందితుడుని డ్రగ్స్‌ను శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.

ఇదే సమాచారంతో ఎస్ఓటి పోలీసులు కూడా శంషాబాద్ ఏరియాలో తనిఖీలు చేపట్టారు. కానీ ముందుగా నిందితుడు డ్రగ్స్ తో ఎస్‌టిఎఫ్ బృందానికి పట్టుబడడం జరిగింది.





**నానక్‌రామ్‌గూడలో గంజాయి పట్టివేత..**

నానక్‌రామ్‌గూడలో శంషాబాద్ డిటిఎఫ్ సిఐ పవన్ కుమార్, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో1.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అస్సాం కు చెందినటువంటి దిలీప్ కోచే అనే వ్యక్తిని అరెస్ట్ చేసి గంజాయితోపాటు నిందితున్ని శేర్లింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సిఐ పవన్ కుమార్ తెలిపారు.

**64 మద్యం బాటిల్ల సీజ్..**

వివిధ ప్రాంతాల నుంచి నాన్ డ్యూటీ లిక్కర్ని హైదరాబాద్కు తీసుకు వస్తున్నారని సమాచారం మేరకు ఎఎస్ రంగారెడ్డి జీవన్ కిరణ్ ఆధ్వర్యంలో కార్ల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 64 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎన్ఫోర్స్మెంట్ రంగారెడ్డితో పాటు ఎస్‌హెచ్ఓ మహేశ్వరం డిటిఎఫ్ సరూర్నగర్ ఎస్‌టిఎఫ్ సిబ్బంది ఎస్‌హెచ్ఓ మీర్‌పేట్‌లో మద్యం బాటిళ్ళను అప్పగించారు.

**ఒరిస్సా నుంచి వచ్చిన గంజాయి పట్టివేత..**

సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర భవన్ హుడా కాలనీ సమీపంలో ఒరిస్సా నుంచి గంజాయిని కొందరు వ్యక్తులు తీసుకువచ్చారనే సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ సి టీం సిఐ వెంకటేశ్వర్లు సిబ్బంది కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో 6.300 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒరిస్సాకు చెందినటువంటి బెహన్ దూరే జగన్నాథ్ డాల్ సరోజ్ జలారి అనే ముగ్గురిని అరెస్ట్ చేసి సరూర్నగర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సిఐ తెలిపారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS


## బిజెపి పాలన శాశ్వతం కాదు

మణిపూర్ కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత ఓక్రమ్ ఇబోబి సింగ్

**ఇంఫాల్:** దేశంలో, రాష్ట్రంలో బిజెపి పాలన శాశ్వతం కాదని మణిపూర్ కాంగ్రెస్ శాసనసభాపక్ష (సిఎల్‌పి) నాయకుడు ఓక్రమ్ ఇబోబి సింగ్ ఆదివారం అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతమైనప్పుడే శాంతి, సహజీవనం వర్ధిల్లుతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ 140వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, 'బిజెపి శాశ్వతం కాదు. వారు ఎంతకాలం పాలిస్తారు? వారు ఎంతకాలం పెత్తనం చేస్తారో చూద్దాం. ఎన్నికల కోసం వేచి చూద్దాం' అని సింగ్ అన్నారు. మూడుసార్లు మణిపూర్ ముఖ్యమంత్రిగా పనిచేసిన సింగ్.. గత మూడేళ్లలో అనేక విభాగాలు పనికిరాకుండా పోయాయని, రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దాదాపుగా కుప్పకూలిందని ఆరోపించారు. 'కేంద్రంలో, ఇక్కడ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు మాత్రమే ప్రజలు సామరస్యంగా జీవించే ప్రగతిశీల ప్రభుత్వం ఏర్పడుతుందని గట్టిగా నమ్ముతున్నాను. కాంగ్రెస్ పార్టీ బలోపేతమైనప్పుడే శాంతి, సహజీవనం సాధ్యమవుతాయి' అని ఆయన అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాన్ని, క్రమశిక్షణను పాటించడం అవసరమని కీషమ్ అన్నారు.

# శ్రీహరికోటలో మూడో లాంచ్‌ప్యాడ్

## నాలుగేళ్లలో సిద్ధం: ఇస్రో




**చెన్నై:** శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్ (ఉపగ్రహ ప్రయోగ వేదిక) రాబోయే నాలుగు సంవత్సరాలలో సిద్ధం అవుతుంది. ఇస్రోలోని ఉన్నత స్థాయి శాస్త్రవేత్త ఒకరు ఆదివారం ఈ విషయం చెప్పారు. ఈ విషయంలో సంబంధిత ఏర్పాట్లకు సరైన కంపెనీలు, విక్రేతలను గుర్తించే పనిలో ఉన్నట్లు చెప్పారు. 175 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో శ్రీహరికోట భవన సముదాయం ఉంది. చెన్నైకి 135 కి.మీ దూరంలో ఈ అంతరిక్ష కేంద్రం కొలువుతీరి ఉంది. వివిధ ప్రయోగ వేదికల ద్వారా అనేక ఉపగ్రహాలను ప్రయోగించడం ద్వారా బెంగళూరులోని ఇస్రో ప్రధాన కేంద్ర కార్యాలయం లక్ష్యాలను నెరవేరుస్తోంది.12,000 కేజీల నుండి 14,000 కేజీలు బరువుగల ఉపగ్రహాలను రోదసీలోని వివిధ కక్ష్యలలోకి ప్రవేశపెట్టేందుకు వీలుగా ఈ మూడో ప్రయోగ వేదికను రూపొందించనున్నారు. ఇస్రో భవిష్యత్ లక్ష్యాలు సాధించాలంటే అతిపెద్ద వాహక నౌకలు అవసరం అవుతాయని, అందుకు అనుగుణంగా ఇస్రోను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఉన్న ప్రముఖ శాస్త్రవేత్త, డైరెక్టర్ ఇ.ఎస్.పద్మకుమార్ చెప్పారు. ''మేం మరో శక్తిమంతమైన మూడో ప్రయోగ వేదికను నాలుగు సంవత్సరాలలో అభివృద్ధి చేసి ప్రారంభించాలనుకుంటున్నాం, అందుకు అనుగుణంగా క్రియాశీల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి' అని ఇటీవల పిటిఐ వార్తాసంస్థకు ఆయన చెప్పారు. ''మేం దీనికి సంబంధించిన సామాగ్రిని సమకూర్చుకునే దశలో ఉన్నాం, సరైన, సక్రమమైన విక్రేతలను గుర్తించే పనిలో ఉన్నాం, ఇస్రో ప్రయోజనాలు కాపాడేందుకు వీలుగా బాధ్యతగా వ్యవహరించేవారు ఈ మెగా ప్రాజెక్టుకోసం చాలా అవసరం'' అని చెప్పారు. ఒక ప్రశ్నకు సమాధానంగా పద్మకుమార్ స్పందిస్తూ, ఒకసారి ఈ మూడో ప్రయోగ వేదిక పనిచేయడం ప్రారంభించిన తర్వాత 14000 కేసులు బరువుగల ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఈ వేదికను ఉపయోగించుకుంటాం, కొత్త తరం ఎన్‌జిఎల్‌వి (కొత్త తరం వాహక నౌకలు)లకోసం ఈ వేదికను ఉపయోగిస్తాం'' అని చెప్పారు. డిసెంబరు 23న ఇస్రో ఎంతో విజయవంతంగా 6000 కిలోలు బరువైన బ్లూబర్డ్ బ్లాక్–2 ఉపగ్రహాన్ని ప్రతిష్ఠాత్మకమైన భారత బాహుబలి వాహకనౌక ద్వారా ప్రయోగించింది. ఎవిఎం3–ఎం6 వాహకనౌక తక్కువ ఎత్తులో స్థిరకక్ష్యలోకి ఈ ఉపగ్రహాన్ని చొప్పించింది. భారతదేశ గడ్డపై నుండి ఎంతో బరువైన అమెరికా ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడం ఇస్రో చరిత్రలో ఇదే మొదటిసారి. ఈ ప్రయోగం భారతదేశానికి క్రిస్మస్, నూతన సంవత్సర కానుకగా ఇస్రో అభివర్ణించింది. ఈ విధంగా ఇస్రో రోజు రోజుకూ రోదసీరంగంలో కొత్త కొత్త విజయాలను తన ఖాతాలో నమోదు చేసుకుంటున్నది. ప్రస్తుతం ఇస్రో మూడు ఉపగ్రహ వాహక నౌకలను ఉపయోగించుకుంటున్నది. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (పిఎస్‌ఎల్‌వి), జియో షింకర్నస్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (జిఎస్‌ఎల్‌వి), లాండ్ వెహికిల్ మార్క్ 3 (ఎల్‌విఎం3) లేదా అంతకుముందు పిలిచినట్లుగా జియోషింకర్నస్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ ఎంకె–3లను ఇస్రో ప్రస్తుతం ఉపయోగించుకుంటున్నది. 2002 సెప్టెంబరు ఐదో తేదీన ఇస్రో ఈ అంతరిక్ష కేంద్రానికి సతీశ్ థావన్ అంతరిక్ష కేంద్రం (ఎస్‌డిఎస్‌సి)గా పునర్నామకరణం చేసింది. ఇస్రో మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ సతీశ్ థావన్ స్మృత్యర్థం పేరు మార్పు చేశారు. 1971 అక్టోబరునెలలో ఈ అంతరిక్ష కేంద్రం పనిచేయడం ప్రారంభించింది. రోహిణి–125 ప్రయోగంతో మెల్లిగా ఈ కేంద్రం పనిచేయడం ప్రారంభించింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా క్రమంగా ఈ కేంద్రం తన పరిధిని విస్తరించుకుంటూ వెళుతున్నది.

## ఆరావళీ నిర్వచనం మారిస్తే...

# పర్వతశ్రేణి విచ్ఛిన్నం

❑ కేంద్ర మంత్రి భూపేందర్‌కు జైరామ్ రమేష్ నాలుగు ప్రశ్నలు



**న్యూఢిల్లీ :** ఆరావళీ పర్వతాల పునర్నిర్వచనంపై వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పర్వత శ్రేణిలో కొత్త మైనింగ్ లీజులను మంజూరు చేయడంపై పూర్తి నిషేధం విధించాలని కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్‌కు నాలుగు ప్రశ్నలు సంధించారు. ఈ చర్య మొత్తం పర్వత శ్రేణి భౌగోళిక, పర్యావరణ సమగ్రతను విచ్ఛిన్నం చేయడానికి, బలహీనపరచడానికి దారి తీస్తుందని పేర్కొన్నారు. ఆరావళీ కొండలను 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భూభాగాలకు పరిమితం చేసే పునర్నిర్వచనంపై విస్తృత ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని యాదవ్‌కు రాసిన లేఖలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ పేర్కొన్నారు. ఈ విషయంలో పరిశీలన కోసం నాలుగు నిర్దిష్ట ప్రశ్నలను లేవనెత్తడానికి తనను అనుమతించాలన్నారు. రాజస్థాన్‌లో ఆరావళీ కొండలు, పర్వత శ్రేణుల నిర్వచనం, 2012 నుండి, ఆగస్టు 28, 2010 నాటి ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) నివేదికపై ఆధారపడి ఉంది అన్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఆ నివేదికలో ఉన్న అంశాలను రమేష్ పేర్కొంటూ 'మూడు డిగ్రీలు లేదా అంతకంటే ఎక్కువ వాలు ఉన్న అన్ని ప్రాంతాలను కొండలుగా గుర్తించాలి. అలాగే 20 మీటర్ల కొండ ఎత్తుకు అనుగుణంగా సాధ్యమయ్యే విస్తరణను పరిగణనలోకి తీసుకోవడానికి, 20 మీటర్ల కాంటూర్ విరామానికి సమానంగా, కొండ కింది వైపున ఏకరీతిగా 100 మీటర్ల వెడల్పు గల బఫర్‌ను చేర్చాలి. 'ఈ గుర్తించబడిన ప్రాంతాల పరిధిలోకి వచ్చే సమతల ప్రాంతాలు, పీఠభూములు, లోయలు కూడా కొండలలో భాగంగా చేర్చబడతాయని అని రమేష్ అన్నారు. సెప్టెంబర్ 20, 2025న పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు పంపిన ఒక లేఖలో 'ఆరావళీలలోని చిన్న కొండల నిర్మాణాలు భారీ ఇసుక కణాలను ఆపడం ద్వారా ఎడారీకరణకు వ్యతిరేకంగా సహజ అడ్డంకులుగా పనిచేస్తాయి. తద్వారా ఢిల్లీ, పొరుగు మైదానాలను ఇసుక తుఫానుల నుండి రక్షిస్తాయని ఎఫ్ఎస్ఐ పేర్కొన్న విషయం వాస్తవం కాదా? అని కూడా ఆయన ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సిఇసి) తన నవంబర్ 7, 2025 నాటి నివేదికలో, రాజస్థాన్‌లోని 164 మైనింగ్ లీజులు అప్పటికి అమల్లో ఉన్న ఎఫ్ఎస్ఐ నిర్వచనం ప్రకారం ఆరావళీ కొండలు, శ్రేణుల లోపల ఉన్నాయని నిర్ధారించిన విషయం వాస్తవం కాదా? అని రమేష్ నిలదీశారు. ఈ పునర్నిర్వచనం వల్ల అనేక చిన్న గుట్టలు, ఇతర భూస్వరూపాలు కోల్పోవడమే కాకుండా, నాలుగు రాష్ట్రాలలో విస్తరించి ఉన్న మొత్తం ఆరావళీ కొండలు, శ్రేణుల భౌగోళిక, పర్యావరణ సమగ్రతకు విచ్ఛిన్నం, నష్టం వాటిల్లుతుంది అన్నది నిజం కాదా? అని కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించారు.కొండల పునర్నిర్వచనం కింద ఆరావళీలలో 90 శాతానికి పైగా రక్షణ పొందవని, వాటిని మైనింగ్, ఇతర కార్యకలాపాల కోసం తెరిచి ఉంచుతారని ప్రతిపక్ష కాంగ్రెస్ ఆరోపించింది.

## బెంగళూరులో ఇళ్ల కూల్చివేత

# యుపి ఘటనలతో పోల్చొద్దు

❑ ఐయుఎంఎల్ నాయకుడు పికె కున్హాలికుట్టి

**కోజికోడ్ :** బెంగళూరులో ప్రభుత్వ సంస్థ ఇళ్లను కూల్చివేయడం ఉత్తరప్రదేశ్‌లో జరిగిన దానికి ఏమాత్రం పోల్చదగినది కాదని ఐయుఎంఎల్ నాయకుడు పికె కున్హాలికుట్టి చెప్పారు. ఆదివారం ఆయన కేరళ కోజికోడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) జాతీయ కార్యదర్శి పికె కున్హాలికుట్టి, మంత్రులు, ముఖ్యమంత్రితో సహా కర్ణాటకలోని నాయకులతో తాను మాట్లాడినట్లు తెలిపారు. 'కర్ణాటకలో జరిగిన కూల్చివేత ఉత్తరప్రదేశ్‌లో జరిగిన దానికి పోల్చదగినది కాదని, బెంగళూరులో అన్ని వర్గాల ప్రజలు ప్రభావితమయ్యారని వారు చెప్పారు'ఆయన అన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పిస్తారని కున్హాలికుట్టి తెలిపారు. 'ప్రభుత్వం ఆకర్షణీయమైన పునరావాస ప్యాకేజీలను అందిస్తుంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని తెలిసి ఈ సమస్యను ఆసరాగా చేసుకోవడం చౌకబారు రాజకీయాలు' అని ఆయన అన్నారు. శుక్రవారం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక రాజధానిలో ముస్లింల ఇళ్లను కూల్చివేసినట్లు వచ్చిన వార్తలను తీవ్రంగా విమర్శించారు. ఈ చర్యను దిగ్భ్రాంతికరం, బాధాకరమైనదిగా అభివర్ణించారు. మీడియా నివేదికల ప్రకారం, గత వారం యలహంకలోని కోగిలు గ్రామంలో చేపట్టిన కూల్చివేత డ్రైవ్‌లో వసీం లేఅవుట్, ఫకీర్ కాలనీలలో 200కి పైగా ఇళ్లను కూల్చివేశారు. ఇదిలా ఉండగా, కేరళలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్)లో సీట్ల పంపకంపై ఎలాంటి చర్చలు ప్రారంభం కాలేదని కున్హాలికుట్టి అన్నారు. సీట్ల పంపకం చర్చల సమయంలో అనవసరమైన డిమాండ్లు ఏవీ లేవనెత్తబోమని ఆయన స్పష్టం చేశారు.'మేము అనవసరమైన రాజకీయ ప్రయోజనం పొందబోము. మాకు దక్కాల్సినవి మాకు దక్కుతాయి' అని ఆయన అన్నారు. యుడిఎఫ్ సీట్ల పంపకం చర్చలను పూర్తి చేసి, జనవరి నెలాఖరులోగా లేదా ఫిబ్రవరి ప్రారంభంలో అభ్యర్థులను ఖరారు చేయాలని నిర్ణయించింది. కేరళ అసెంబ్లీ ఎన్నికలు మార్చిఏప్రిల్ 2026లో జరిగే అవకాశం ఉంది.

## నాథూరామ్ గాడ్సే మద్దతుదారుల నుంచి

# నేర్చుకోవాల్సింది ఏమీ లేదు

• కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్



**న్యూఢిల్లీ :** ఆర్‌ఎస్‌ఎస్, జన సంఘ్, బిజెపిలను కొనియాడుతూ శనివారం తాను చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ప్రతీ సంస్థ క్రమశిక్షణాయుతంగా బలోపేతం కావాలనే కోణంలోనే తాను వ్యాఖ్యానించినట్లు ఆయన ఆదివారం స్పష్టం చేశారు. నాథూరామ్ గాడ్సే మద్దతుదారుల నుంచి నేర్చుకోవాల్సింది ఏమీ లేదని దిగ్విజయ్ తేల్చిచెప్పారు. గత 50 ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఉంటూ మతతత్వ శక్తులపై పోరాడుతున్న తాను, ఇకపైనా ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతిక భావజాలాన్ని వ్యతిరేకించి తీరుతానని వెల్లడించారు. ఆర్‌ఎస్‌ఎస్, జన సంఘ్‌ల బలమైన వ్యవస్థాగత నిర్మాణాన్ని మాత్రమే తాను ప్రశంసించానని ఆయన పేర్కొన్నారు. సైద్ధాంతికపరంగా సదా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు వ్యతిరేకంగానే నిలబడతానన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను దిగ్విజయ్ సింగ్ కొనియాడటంపై కాంగ్రెస్ నేతల్లో భిన్న, విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆదివారం ఆయన తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. 'ఆర్‌ఎస్‌ఎస్‌లో క్రమశిక్షణకు ఉండే ప్రాముఖ్యత గురించి ఏమంటారు?' అని విలేకరులు ప్రశ్నించగా, 'నాథూరాం గాడ్సే లాంటి హంతకుల నుంచి నేర్చుకోవాల్సిన అవసరం లేదు' అని దిగ్విజయ్ బదులిచ్చారు.

**గాంధీజీ కాంగ్రెస్‌కు, గాడ్సే ఆర్‌ఎస్‌ఎస్ ఏం నేర్పగలదు ? : పవన్ ఖేడా**

దిగ్విజయ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం ఛైర్మన్ పవన్ ఖేడా ఆదివారం ఘాటుగా స్పందించారు. ఆయన కూడా ఆర్‌ఎస్‌ఎస్‌కు, నాథూరాం గాడ్సేతో లింకు పెడుతూ మాట్లాడారు. గాంధీజీ స్థాపించిన కాంగ్రెస్‌కు, గాడ్సే భావజాలంతో ఏర్పడిన ఆర్‌ఎస్‌ఎస్ ఏం నేర్పగలదు అని పవన్ ఖేడా ప్రశ్నించారు. ఆర్‌ఎస్‌ఎస్ నుంచి నేర్చుకోదగిన అంశమేదీ లేదన్నారు.

**కాంగ్రెస్ వ్యవస్థాగత బలోపేతం అత్యవసరం :శశి థరూర్**

మరోవైపు దిగ్విజయ్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాగత బలోపేతాన్ని ఆశిస్తూ దిగ్విజయ్ చేసిన వ్యాఖ్యల్లో తప్పేమీ లేదన్నారు. వాస్తవానికి కాంగ్రెస్‌ను వ్యవస్థాగతంగా బలోపేతం చేయాల్సిన అత్యవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ 140వ వ్యవస్థాపక దినోత్సవానికి థరూర్ హాజరయ్యారు. ఈసందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. 'దిగ్విజయ్‌తో మాట్లాడారా' అని విలేకరులు ప్రశ్నించగా, 'దిగ్విజయ్, నేను మంచి స్నేహితులం. మేం మాట్లాడుకుంటూనే ఉంటాం. కాంగ్రెస్ వ్యవస్థాగతంగా బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. అందులో సందేహమేం లేదు' అని థరూర్ చెప్పారు. ఈ వ్యవస్థాపక దినోత్సవం కాంగ్రెస్‌కు చాలా ముఖ్యమైందని, గత 140 ఏళ్ల కాంగ్రెస్ చరిత్ర నుంచి పార్టీ చాలా నేర్చుకోవచ్చన్నారు. పార్టీలో అంతర్గత క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, సొంత అనుభవాల నుంచి నేర్చుకోవడంపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టాలని సూచించారు.

# ఇక నా జీవితం అభిమానులకే అంకితం

• రాబోయే 33 ఏళ్లు వాళ్ల కోసమే

• సినిమాలు వదిలేస్తున్నా : విజయ్ దళపతి



**చెన్నై:** ఇకపై తన జీవితమంతా అభిమానులకే అంకితమని ప్రముఖ హీరో, తమిళగ వెట్రి కజగం (టివికె) పార్టీ అధినేత విజయ్ ప్రకటించారు. గత 33 ఏళ్లుగా అభిమానులు తనతో ఉన్నారని, రాబోయే 33 ఏళ్లపాటు తాను వారి కోసమే జీవిస్తానని ఆయన భావోద్వేగంగా వెల్లడించారు. శనివారం రాత్రి మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లోని బుకిట్ జలీల్ మల్టీ పర్పస్ స్టేడియంలో జరిగిన 'జన నాయకుడు' ఆడియో విడుదల కార్యక్రమంలో ప్రసంగిస్తూ విజయ్ ఎమోషనల్ అయ్యారు. వేలాది మంది అభిమానులు గుమిగూడిన ఈ స్టేడియంలో, కేరింతల మధ్య ఆయన మాట్లాడారు. ఇదే తన చివరి సినిమా అని విజయ్ ప్రకటించారు. 'నా చివరి సినిమా ఆడియో లాంచ్, మ్యూజిక్ ఈవెంట్‌కు హాజరవడం నిజంగా నాకు ప్రత్యేకంగా అనిపిస్తోంది. విశాలమైన సముద్రంలో ఒక చిన్న ఇసుక కోటను నిర్మించాలనే కలతో నేను సినిమాల్లోకి ప్రవేశించాను. కానీ నా అభిమానులు దాన్ని ఒక అద్భుతమైన కోటగా మార్చారు. థియేటర్లలో, నా ప్రతీ అడుగులో నా వెంట నిలబడిన అభిమానులే నాకు ముఖ్యం. నా ఫ్యాన్స్ ఎప్పుడైనా ఏదైనా సమస్యను ఎదుర్కొంటే, వారి ఇళ్ల ఎదుటకు వెళ్లి నిలబడే మనిషిని నేను. నా కోసం ప్రతీదీ త్యాగం చేసిన అభిమానుల కోసం నేను సినిమాలను వదులుకోవడానికి సిద్ధపడ్డాను' అని విజయ్ వెల్లడించారు.

## సెంగార్ జీవిత ఖైదు నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ...

# సిబిఐ పిటిషన్‌పై 'నేడు సుప్రీం' విచారణ



**న్యూఢిల్లీ:** ఉన్నావ్ అత్యాచారం కేసులో బహిష్కృత బిజెపి ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్ జీవిత ఖైదును నిలిపివేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనున్నది. కాజ్ లిస్ట్ ప్రకారం భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జె.కె.మహేశ్వరి, ఆగస్టిన్ జార్జి మాసిహ్‌లతో కూడిన ముగ్గురు జడ్జిల వెకేషన్ బెంచ్ ఈ విషయాన్ని విచారించే అవకాశం ఉంది. కోర్టు ఉత్తర్వులను సవాల్‌చేస్తూ, దానిపై స్టే కోరుతూ న్యాయవాదులు అంజలే పటేల్, పూజా శిల్పకర్ దాఖలు చేసి ఒక ప్రత్యేక పిటిషన్‌ను కూడా అత్యున్నత న్యాయస్థానం విచారించనుంది. ప్రజా పదవులు నిర్వహిస్తున్న ఎవరైనా ఎంపీలు లేదా ఎమ్మెల్యేలు అయితే వారిని ప్రజాసేవకులుగా పరిగణిస్తారని, ఎల్.కె.అద్వానీ కేసులో ఇచ్చిన తీర్పును సిబిఐ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. నేరం జరిగినప్పుడు ఎమ్మెల్యే అయిన కుల్దీప్‌సింగ్ సెంగార్‌ను పోక్సో కింద విచారించాల్సి ఉండగా ప్రజాసేవకుడు కాదని హైకోర్టు తప్పు చేసిందని, బెయిల్ మంజూరు చేసిందని సిబిఐ వాదించింది. రాజ్యాంగబద్ధమైన పదవిని కలిగిఉండటం వల్ల సిట్టింగ్ ఎమ్మెల్యేకు ఓటర్లపై ప్రజా విశ్వాసం, అధికారం ఉందని, అలాంటి పదవి రాష్ట్రానికి, సమాజానికి బాధ్యత వహించాల్సిన విధుల నుండి ఉత్పన్నమయ్యే అధిక బాధ్యత కలిగి ఉంటుందని హైకోర్టు పరిగణించడంలో విఫలమైంది.పోక్సో చట్టం లక్ష్యం, ఉద్దేశాన్ని ముందుకు తీసుకెళ్లే ఉద్దేశపూర్వకమైన వివరణను స్వీకరించడంలో విఫలమవడంద్వారా అది చట్టవిరుద్ధంగా ప్రవర్తించింది' అని సిబిఐ పేర్కొంది. ఉన్నావ్ అత్యాచారం కేసులో జీవిత ఖైదును అనుభవిస్తున్న కుల్దీప్ సింగ్ సెంగార్ జైలు శిక్షను డిసెంబరు 23న హైకోర్టు సస్పెండ్ చేసింది. ఆయన ఇప్పటికే ఏడు సంవత్సరాల 5నెలల జైలు శిక్షను అనుభవించారని చెప్పారు.రేప్ కేసులో తనను దోషిగా నిర్ధారించి శిక్షను విధించడాన్ని సవాల్ చేస్తూ కుల్దీప్ సింగ్ సెంగార్ దాఖలు చేసిన అప్పీల్ పెండింగ్‌లో ఉన్నంతవరకూ హైకోర్టు అతని శిక్షను నిలుపుదల చేసింది.ఈ కేసులో డిసెంబరు 2019న ట్రయల్ కోర్టు తీర్పును కుల్దీప్ సింగ్ సెంగార్ సవాల్ చేశాడు. అయితే బాధితురాలి తండి కస్టోడియన్ డెత్ కేసులో అతను 10సంత్సరాల జైలుశిక్ష అనుభవిస్తున్నందున ఆ కేసులో బెయిల్ మంజూరు చేయకపోవడంతో అతను జైలులోనే ఉంటాడు. మైనర్‌గా ఉన్నప్పుడు బాధితురాలిని కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన కుల్దీప్ సింగ్ సెంగార్‌కు హైకోర్టు అనేక షరతులు విధిస్తూ రూ.15లక్షలు వ్యక్తిగత పూచీకత్తు, అంతే మొత్తానికి ముగ్గురు పూచీకత్తులు చెల్లించాలని ఆదేశించింది. ఢిల్లీలోని బాధితురాలి నివాసానికి 5 కి.మీ పరిధిలోకి సెంగార్ రాకూడదని, ఆమెను లేదా ఆమె తల్లిని బెదిరించవద్దని కూడా ఆదేశించింది. ఏదైనా షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దుకు కారణం అవుతుందని హైకోర్టు తెలియజేసింది. 2019ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అత్యాచారం కేసు, సంబంధిత ఇతర కేసులను ఉత్తర్‌ప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుండి ఢిల్లీకి బదిలీ చేశారు. బాధితురాలి తండ్రి కస్టడీలో మరణించిన కేసులో తనను దోషిగా నిర్ధారించారని కుల్దీప్‌సింగ్ సెంగార్ చేసుకున్న అప్పీల్ కూడా పెండింగ్‌లో ఉంది. అతను ఇప్పటికే చాలా కాలం జైలులో గడిపాడనే కారణంతో అతని శిక్షను సస్పెండ్ చేశారు.

# గౌతమ్ అదానీ కష్టపడే యువతకు స్ఫూర్తి

❑ ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్



**బారామతి:** పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ప్రస్థానం, పెద్ద కలలు కనే కష్టపడి పనిచేసే యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ అన్నారు. పుణె జిల్లాలోని బారామతిలో ఆదివారం జరిగిన శరద్‌చంద్ర పవార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అదానీ గ్రూప్ ఛైర్మన్ నిధులతో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను, పవార్ కుటుంబం నిర్వహించే విద్యా సంస్థ అయిన విద్యా ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో స్థాపించారు. అదానీ గుజరాత్‌లోని కరువు పీడిత బనస్కాంత జిల్లా నుండి వచ్చారని, ముంబయికి వచ్చి సున్నా నుండి తన వ్యాపారాన్ని ప్రారంభించారని, నేడు ఆయన వ్యాపారం 23 రాష్ట్రాలకు విస్తరించిందని శరద్ పవార్ పేర్కొన్నారు. శరద్ పవార్‌ను అదానీ తన గురువుగా అభివర్ణిస్తూ, ఈ సీనియర్ రాజకీయ నాయకుడు క్షేత్రస్థాయి వాస్తవాలను జాతీయ ఎజెండాతో మిళితం చేశారని కొనియాడారు. 'మూడు దశాబ్దాలకు పైగా పవార్ సాహెబ్‌ను తెలుసుకునే అదృష్టం నాకు లభించింది. ఆయన నుండి నేను నేర్చుకున్న దానికి సాటి లేదు. కానీ జ్ఞానానికి మించి, ఆయన వివేకం, గాఢమైన సానుభూతి నాపై బలమైన ముద్ర వేస్తాయి' అని అదానీ అన్నారు. 'ఆయన దార్శనిక నాయకత్వం వల్ల సాధ్యమైన పరివర్తనకు, అపరిమితమైన సామర్థ్యానికి బారామతి ఒక చిహ్నం. ఇక్కడికి డజన్ల కొద్దీ సార్లు వచ్చిన తర్వాత, ఆయన ఇక్కడ సాధించినది స్థానిక అభివృద్ధికి అతీతమైనది' అని ఆ పారిశ్రామికవేత్త అన్నారు. పవార్ దృష్టిలో, భారతదేశం ఏ దిశలో పయనించాలో దానికి బారామతి ఒక ప్రతిబింబం అని ఆయన అన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా లేదా పార్టీలకు అతీతంగా అయినా, పవార్ దేశ వ్యవసాయ విధానం, సహకార సంస్థలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దారని అదానీ అన్నారు. 'ఆయన వంటి నాయకులు మంచి రాజకీయాలు కేవలం నినాదాల గురించి కాదని మనకు గుర్తు చేస్తారు. మన దేశం ఏకాంత విజయాల ద్వారా కాకుండా, ప్రజలు,దాని సంస్థల స్థిరమైన సమన్వయం ద్వారా అభివృద్ధి చెందుతుందని అర్థం చేసుకోవడమే మంచి రాజకీయాలు,' అని ఆయన అన్నారు. ఏఐ గురించి మాట్లాడుతూ, అది 'మనం పనిచేసే విధానాన్ని, మన వినియోగదారులకు సేవ చేసే విధానాన్ని' మారుస్తుందని అదానీ అన్నారు. ఈ కార్యక్రమంలో బారామతి ఎంపి సుప్రియా సూలే, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, రాజ్యసభ ఎంపి సునేత్ర పవార్, పవార్ కుటుంబంలోని ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో ఎన్‌సిపి (ఎస్‌పి) ఎమ్మెల్యే రోహిత్ పవార్, విద్యా ప్రతిష్ఠాన్ కోశాధికారి యుగేంద్ర పవార్ ఉన్నారు. సభను ఉద్దేశించి బారామతి ఎంపి సుప్రియా సూలే మాట్లాడుతూ, 'అదానీ కుటుంబంతో మాకు 30 ఏళ్ల అనుబంధం ఉంది. నేను మంచి లేదా చెడు వార్తను తెలియజేయాల్సి వస్తే, సోదరిగా గౌతమ్ భాయ్‌కి నిర్మొహమాటంగా చెబుతాను. ఆయన నా అన్నయ్య. సంబంధాలలోని ఆప్యాయత జిడిపి గణాంకాలలో కనిపించదన్నారు.

# బంగ్లా పోలీసుల ఆరోపణలు నిరాధారం


• విద్యార్థి నేత హాదీ హత్య కేసులో ప్రధాన నిందితులు భారత్‌కు వచ్చినట్లు ఆధారాల్లేవ్ బిఎస్ఎఫ్ ప్రకటన

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ విద్యార్థి నేత హాదీ హత్య కేసులో ప్రధాన అనుమానితులుగా ఉన్న ఫైసల్ క రీం మసూద్, అలంగీర్ షేక్ భారత్‌కు పారిపోయినట్లు ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు ప్రకటించడాన్ని బిఎస్ఎఫ్ అధికారులు, మేఘాలయ పోలీసులు ఖండించారు. సరిహద్దు భద్రతా దళం (మేఘాలయ) స్పందిస్తూ.. అంతర్జాతీయ సరిహద్దును దాటి ఎవరూ భారత్‌లోకి వచ్చినట్లు ఆధారాలు లే వని వెల్లడించింది. సరిహద్దుల్లో తమ బలగాలు ని రంతరం అప్రమత్తంగా ఉన్నాయని తెలిపింది. ప్ర జలను తప్పుదారి పట్టించేందుకు పొరుగుదేశం ఇ టువంటి నిరాధార ఆరోపణలు చేస్తోందని మండిపడింది. బంగ్లాదేశ్ పోలీసులు, అక్కడి మీడియా చేసిన ప్రకటనల్లో నిజం లేదని మేఘాలయ పోలీసులు స్పష్టం చేశారు. ఎవరూ రాష్ట్రంలోకి రాలేద ని.. తాము ఎవరినీ అరెస్టు చేయలేదని వెల్లడించా రు. ఇవన్నీ భారత్‌పై చేస్తున్న తప్పుడు ఆరోపణల ని కొట్టిపడేశారు. భారత ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించేందుకు బంగ్లాదేశ్ మీడియా కల్పిత కథనాలను సృష్టిస్తోందన్నారు. కాగా, బంగ్లాదేశ్‌ను కుదిపేసిన విద్యార్థి ఉద్యమ నేత ఉస్మాన్ బిన్ హాదీ కే సులో ప్రధాన నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు భారత్‌కు పారిపోయినట్లు బంగ్లాదేశ్ పోలీసులు ఆరోపించా రు. ఈ మేరకు అధికారికంగా ఒక ప్రకట న చేశారు. ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు (డిఎంపి) ఆదివారం వివరాల ను వెల్లడించారు.ప్రధాన నిందితులు ఫైసల్ కరీం మ సూద్, అలంగీర్ షేక్‌లు మేఘాలయలోని తురా నగరంలో తలదాచుకున్నట్లు గుర్తించామని అదనపు పోలీస్ కమిషనర్ తెలిపారు.

# మేఘాలయకు హాదీ నిందితులు పరార్

❑ ఇద్దరు అనుమానితులను అరెస్టు చేసిన భారత్

**ఢాకా:** జులై ఉద్యమ నాయకుడు, ఇంక్విలాబ్ మంఛో పార్టీ వ్యవస్థాపకుడు ఒస్మాన్ హదీ (32) హత్యకేసు పురోగతి సాధించింది. నేరస్థులకు సహకరించిన ఇద్దరు నిందితులను భార త్‌లోని అధికారులు పట్టుకున్నారు. ఒస్మాన్ హదీని హత్య చేసినట్లుగా భావిస్తున్న ఇద్దరు నేరస్థులు ఫైసల్ కరీమ్ మసూద్, అలమ్‌గిర్ షేక్ భారతదేశ రాష్ట్రం మేఘాలయకు పారిపోయారని, బంగ్లాదేశ్ పోలీసులు ఆదివారం ప్రకటించా రు. ఐతే దీనిపై భారత ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందనా లేదు. మైమన్‌సింగ్‌లోని హలుయాఘాట్ సరిహద్దుల నుండి ఇద్దరు నిందితులు భారత్‌లోకి పారిపోయారని ఢాకా మెట్రోపాలిటన్ పోలీసు అదనపు కమీషనర్ (సెంట్రల్ క్రైమ్ ఆపరేషన్స్) ఎస్.ఎన్.మహ్మద్ నజ్రుల్ ఇస్లామ్ డిఎంపి మీడియా సెంటర్‌లో ఆదివారం పాత్రికేయులకు చెప్పారు. మొదట భారత సరిహద్దుల్లోకి వెళ్ళిపోయిన తర్వాత ఈ ఇద్దరు వ్యక్తులను పుర్తి అనే వ్యక్తి తన అధీనంలోకి తెచ్చుకున్నాడని, ఆ తర్వాత సమీ అనే టాక్సీ డ్రైవర్ వారిని మేఘాలయ లోని తురాసిటీలోకి తీసుకుపోయాడని చెప్పారు. హది హంతకులను దేశం వదిలి పారిపోయిన నేరస్థులుగా పోలీసులు ప్రకటించినట్లు ఇస్లామ్ చెప్పారు. పుర్తి, సమీ ఇద్దరని భారత అధికారులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ఈ నిందితులు ఇద్దరినీ బంగ్లాదేశ్‌కు రప్పించేందుకు స్థానిక పోలీసులు ముమ్మరంగా కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. భారతదేశంలోని పోలీసు అధికారులతో తాము సంభాషణలు చేస్తున్నామని, వారిని దేశానికి రప్పిస్తామని అన్నారు. ఐతే హత్య కేసులో ప్రధాన నేరస్థులు ఇద్దరూ ఎప్పుడు భారత్‌కు పారిపోయారన్న విషయం ఆయన చెప్పలేదు. ఐతే హదీ కేసులో దర్యాప్తు దాదాపు ముగింపు దశకు వచ్చిందని ఆయన ప్రకటించారు. హదీ హత్య కేసులో ఇప్పటివరకూ బంగ్లాదేశ్‌లో 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సిఆర్‌పిసి సెక్షన్ 164 కింద వారి నుండి కోర్టులో అంగీకార ప్రకటనలు నమోదు చేశారు. రెండు పిస్టోళ్ళను స్వాధీన చేసుకున్నారు. దాడికోసం ఉపయోగించిన మోటారు బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు సందర్భంగా 218 కోట్ల టాకాల ఒక చెక్కును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఒస్మాన్ హదీ డిసెంబరు 12వ తేదీన ఢాకాలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ఒక మసీదుకు వెళ్ళి బయటకు వస్తుండగా ఆయనపై కాల్పులు జరిగాయి. తలపై బలమైన గాయంతో హదీ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్సకోసం సింగపూర్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ డిసెంబరు 18న మరణించారు.



# సాహితీ విహారి

# సాహిత్యం.. మారుతున్న దృక్పథం

సాహిత్య దృక్పథం నిరంతరం మారుతునే ఉంటుందని 2025 సంవత్సరం మరోసారి రుజువు చేసింది. అంతేకాదు, గతంలో ఎన్నడూ లేనంతగా ప్రపంచ సాహిత్యం ఒక కీలక దశకు చేరుకుంది. ఇది కేవలం కొత్త పుస్తకాల సంవత్సరం మాత్రమే కాదు... సాహిత్యాన్ని చూసే విధానం, చదివే పద్ధతి, రాసే భావజాలం అన్నీ మారుతున్న దశ. ఈ ఏడాది ఎక్కువగా వచ్చింది సంక్షోభాల సాహిత్యం. వాతావరణ మార్పులు, యుద్ధాలు, శరణార్థుల సమస్య, ఆర్థిక అసమానతలు, డిజిటల్ ఒంటరితనం వంటివి సాహిత్యంలో ప్రధాన ఇతివృత్తాలుగా కనిపిస్తున్నాయి. రచయితలు వ్యక్తిగత బాధను సామాజిక నిర్మాణాల లోపాలతో కలిపి చూపిస్తున్నారు. ఈ ఏడాది, సాహిత్యం తటస్థంగా ఉండటం తగ్గింది. రాజకీయ, సామాజిక చైతన్యం పెరిగింది. అధికార వర్గాలు, ప్రజల సంబంధాలు, నిఘా, డేటా నియంత్రణ, ప్రజాస్వామ్యంపై ఒత్తిళ్లు వంటి పలు అంశాలను, కీలక సమస్యలను రచయితలు వివిధ సాహిత్య రూపాల్లో ప్రస్తావించడం ఆహ్వానించతగిన పరిణామం. ఇలాంటి సమస్యలను నవలలు, కవితలు, వ్యాసాలు సూటిగా ప్రశ్నిస్తున్నాయి. ఫలితంగా, సాహిత్యం మళ్లీ ఒక ప్రతిఘటన సాధనంగా మారుతోంది. నేటి డిజిటల్ యుగంలో సాహిత్యం కూడా కృత్రిమ మేధ, అత్యాధునిక సాంకేతికతను వాడుకోవడం ఆరంభమైంది. ఇది డిజిటల్ సాహిత్యంగా రూపాంతరం చెందుతున్నది. ఈ తరుణంలోనే, సృజనాత్మకతకు భవిష్యత్తు ఏమిటనే ప్రశ్న ఉదయిస్తుంది. రచయితలు రాసే తీరు మారుతున్న చందంగానే పాఠకులు చదువుతున్న తీరు కూడా మారుతున్నది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, ఇ–బుక్స్, ఆడియో బుక్స్, మినీ కథలు, మైక్రో ఫిక్షన్ రచనకు ఆదరణ పెరుగుతున్నది. దీంతో భాష మరింత సూటిగా, పదునుగా మారుతోంది. లోతైన ఆలోచనలకు కూడా కొత్త రూపాలు దొరుకుతున్నాయి. ఈ ఏడాది సాహిత్యంలో వచ్చిన ముఖ్యమైన మార్పుల్లో దళిత, ఆదివాసీ రచనలు, మహిళా, క్వీర్ వాదాలు, వలసదారుల కథలు పెరగడం ఒకటి. ఇవి ప్రత్యామ్నాయ సాహిత్య ప్రక్రియలు అనుకోవడానికి వీల్లేదు. కాకపోతే, ఇలాంటి రచనలు కూడా ప్రధాన సాహిత్య ప్రవాహంలోకి వచ్చాయి. ఈ ఏడాది ఎక్కువగా గమనించదగిన పరిణామాల్లో సాహిత్యం మార్క్సిజం ఆలోచనల చుట్టూ తిరగడం. ఇది కూడా కొత్తేమీ కాదు. కానీ, ఈ దృక్పథంలో సమాజాన్ని చూసి, స్పందిస్తున్న వారి సంఖ్య పెరిగింది. మార్క్సిజంతోపాటు, పోస్ట్‌కలొనియల్ ఆలోచనలు, పర్యావరణ తత్వం వంటి కొత్త కోణాలను కూడా స్పృశిస్తున్నారు. దీనితో, సాహిత్యం కేవలం ఒక విషయాన్ని లేదా సమస్యను ఏకరువు పెట్టే కేంద్రంగా కాకుండా, ఆలోచనలను నిర్మించే స్థలంగా మారుతోంది. ఈ ఏడాది ప్రపంచ సాహిత్య చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపుగా నిలిచింది. 2025లో వెలువడిన పుస్తకాలు కేవలం కథనాలుగా మాత్రమే కాకుండా, మానవ అనుభవాల లోతైన విశ్లేషణగా, సమకాలీన ప్రపంచ సంక్షోభాల ప్రతిబింబంగా, వ్యక్తిగత జీవితం–సామూహిక చైతన్యం మధ్య ఉన్న ఉద్రేకాలను వ్యక్తం చేసే సృజనాత్మక ప్రయత్నాలుగా కనిపించాయి. సాంకేతిక యుగంలో మానవత్వం, వలసల అనుభవం, యుద్ధాల ప్రభావం, గుర్తింపు సంక్షోభం, ప్రేమ–ఒంటరితనం వంటి అంశాలు సాహిత్యానికి కేంద్ర బిందువులుగా మారాయి.

ఈ ఏడాది అత్యంత ప్రాధాన్యత పొందిన రచనలలో ఫిలిప్ పుల్‌మన్ రచించిన 'ది రోజ్ ఫీల్డ్'ను ప్రత్యేకంగా పేర్కోవాలి. ఆయన ప్రసిద్ధ 'ది బుక్ ఆఫ్ డస్ట్' శ్రేణికి ఇది ముగింపు భాగం. ఫాంటసీ కథనాన్ని ఆధారంగా చేసుకొని మానవ స్వేచ్ఛ, అధికార వ్యవస్థలు, నైతిక బాధ్యత వంటి తాత్విక ప్రశ్నలను ఈ నవల లేవనెత్తుతుంది. ఇది కేవలం కల్పిత ప్రపంచం కాదు.. మన వాస్తవ ప్రపంచానికే ప్రతిరూపంగా నిలిచింది. నోబెల్ బహుమతి గ్రహీత అబ్దుల్‌రాజక్ గూర్నా రాసిన 'థెఫ్ట్' 2025లో వచ్చిన అత్యంత లోతైన సామాజిక నవలలలో ఒకటి. వలస జీవితం, వలస పాలన తర్వాతి సమాజాల్లో వ్యక్తి ఎదుర్కొనే ఆత్మవేదన, గుర్తింపు కోసం చేసే పోరాటం ఈ నవలలో ప్రధానంగా వ్యక్తమవుతాయి. నిశ్శబ్దమైన భాషలో తీవ్రమైన బాధను చెప్పగల గూర్నా రచనా శైలి ఈ పుస్తకాన్ని విశిష్టంగా నిలబెట్టింది. అదే విధంగా కవి–రచయిత ఓషన్ వుఒంగ్ రచించిన 'ది ఎంపెరర్ ఆఫ్ గ్లాడ్‌నెస్' ఈ ఏడు సాహిత్యంలో భావోద్వేగాల పరాకాష్టగా నిలిచింది. ప్రేమ, జ్ఞాపకాలు, వలస జీవితం, లైంగిక గుర్తింపు వంటి అంశాలను కవితాత్మక గద్యంతో మేళవిస్తూ ఈ నవల వ్యక్తిగత అనుభవాన్ని విశ్వానుభూతిగా మార్చుతుంది. ఆధునిక సాహిత్యం ఎంత సున్నితంగా, ఎంత లోతుగా మాట్లాడగలదో ఈ రచన స్పష్టంగా చూపిస్తుంది. కేటీ కిటామురా రచించిన 'ఆడిషన్' కూడా విశేష చర్చకు దారితీసిన నవల. న్యూయార్క్ నగర నేపథ్యంగా సాగిన ఈ కథలో సంబంధాలు, నటన, నిజం–అబద్ధం మధ్య ఉన్న సరిహద్దులు మసకబారుతాయి. మానవ జీవితం కూడా ఒక వేదికపై జరుగుతున్న ప్రదర్శనలా మారుతున్న సమకాలీన పరిస్థితిని ఈ నవల ప్రతిబింబిస్తుంది. ఈ ఏడాది అవార్డుల పరంగా కూడా ప్రపంచ సాహిత్యం గొప్ప కదలికను చూసింది. అంతర్జాతీయ బుకర్ బహుమతి అనువాద సాహిత్యానికి మరింత గౌరవాన్ని తీసుకొచ్చింది. ముఖ్యంగా దక్షిణాసియా సాహిత్యానికి వచ్చిన గుర్తింపు ప్రపంచ సాహిత్యంలో కొత్త స్వరాలు ఎంత కీలకమో నిరూపించింది. అదే సమయంలో గుడ్‌రీడ్స్ వంటి పాఠకుల ఆధారిత అవార్డులు ప్రజాదరణ పొందిన నవలలను ముందుకు తెచ్చాయి. ప్రేమకథలు, చారిత్రక కథనాలు, నాన్‌ఫిక్షన్ రచనలు ఈ ఏడాది విస్తృతంగా పాఠకులను ఆకర్షించాయి. ఈ ఏడు ప్రపంచ సాహిత్యం ఒక స్పష్టమైన లక్షణాన్ని చూపిస్తుంది. అది ఏకైక సిద్ధాంతానికి లేదా ఒకే శైలికి పరిమితం కాలేదు. భిన్న దేశాలు,



భిన్న భాషలు, భిన్న అనుభవాలు ఒకే సాహిత్య ప్రవాహంలో కలిసాయి. అనువాదాలు కీలక పాత్ర పోషించాయి. స్థానిక కథలు గ్లోబల్ అనుభూతులుగా మారాయి. రచయితలు వినోదం కంటే బాధ్యతను, ఉపరితల కథల కంటే లోతైన ప్రశ్నలను ముందుకు తెచ్చారు. ఇటీవలి ప్రపంచ సాహిత్యం మన కాలాన్ని అర్థం చేసుకునే ఒక మేధో పత్రికలా నిలుస్తుంది. ఈ పుస్తకాలు మనలను ఆలోచింపజేస్తాయి, మన అనుభవాలను ప్రశ్నిస్తాయి, మన భవిష్యత్తుపై కొత్త దృష్టిని కలిగిస్తాయి. చదువుతున్న ప్రతి ఒక్కరికీ 2025 సాహిత్యం ఒక మేధస్సు ప్రయాణంగా నిలిచిందని చెప్పవచ్చు.

ఈ ఏడాది ప్రపంచ సాహిత్యాన్ని మార్క్సిస్టు దృక్పథంలో పరిశీలించినప్పుడు, అది కేవలం సృజనాత్మక రచనల సమాహారం మాత్రమే కాకుండా, నేటి గ్లోబల్ మూలధన వ్యవస్థకు అద్దం పట్టిన సాంస్కృతిక పత్రంగా కళ్ల ముందు నిలుస్తుంది. ఉత్పత్తి విధానాల్లో జరిగిన మార్పులు, కార్మిక జీవితం మీద పెరిగిన ఒత్తిడి, వలసలు, అసమానతలు, గుర్తింపు రాజకీయాలు వంటి ఎన్నో అంశాలు సాహిత్యంలో స్పష్టమైన వర్గ చైతన్య సంకేతాలుగా వ్యక్తమయ్యాయి. మార్క్స్ చెప్పినట్లు, సామాజిక స్థితి మానవ చైతన్యాన్ని నిర్ణయిస్తుంది అన్న భావన ఈ ఏడాది రచనల్లో కొత్త రూపంలో ప్రతిఫలించింది. ఈ ఏడాది వచ్చిన అనేక నవలలు వ్యక్తిగత జీవిత కథలుగా కనిపించినా, వాటి లోతుల్లో వర్గ సంబంధాలు, శ్రమ–మూలధనం మధ్య పెరుగుతున్న ఉద్రేకం బలంగా దర్శనమిస్తుంది. ఉదాహరణకు, అబ్దుల్‌రాజక్ గూర్నా రచించిన 'థెఫ్ట్' నవల వలస పాలన అనంతర సమాజంలో పేద ప్రజలు ఎదుర్కొనే దోపిడీని, ఆర్థిక అస్థిరతను చిత్రిస్తుంది. వ్యక్తిగత నష్టాలుగా కనిపించే సంఘటనలు వాస్తవానికి సామాజిక నిర్మాణాల ఫలితాలని ఈ రచన బలంగా సూచిస్తుంది. ఇది మార్క్సిస్టు సాహిత్య విమర్శలో ముఖ్యమైన భావన అయిన 'వ్యక్తిగతం కూడా రాజకీయమే' అన్న సిద్ధాంతాన్ని బలపరుస్తుంది. అదేవిధంగా ఓషన్ వుఒంగ్ రచించిన 'ది ఎంపెరర్ ఆఫ్ గ్లాడ్‌నెస్' వ్యక్తిగత జ్ఞాపకాలు, ప్రేమ, శోకాన్ని కేంద్రీకరించినప్పటికీ, దాని నేపథ్యం వలస కార్మిక వర్గ జీవితమే. అమెరికన్ మూలధన వ్యవస్థలో ఆసియా వలసదారులు అనుభవించే అస్థిర ఉపాధి, సాంస్కృతిక వేరుపాటు, భౌతిక భద్రత లేకపోవడం ఈ నవలలో అంతర్లీనంగా నడుస్తాయి. ఇది ఆధునిక సాహిత్యంలో ప్రబలమైన 'నియోలిబరల్ ఒంటరితనం' అనే అంశానికి ప్రతిబింబంగా నిలుస్తుంది. ఫిలిప్ పుల్‌మన్ రచించిన 'ది రోజ్ ఫీల్డ్' వంటి ఫాంటసీ రచనల్ని కూడా మార్క్సిస్టు కోణంలో చదవవచ్చు. అధికార వ్యవస్థలు, జ్ఞానంపై నియంత్రణ, ప్రజలపై సంస్థాగత ఆధిపత్యం వంటి అంశాలు ఈ నవలలో రూపకాలుగా కనిపిస్తాయి. ఇది గ్రామ్‌స్కీ చెప్పిన 'సాంస్కృతిక హెగెమనీ' భావనకు దగ్గరగా ఉంటుంది. అధికార వర్గాలు ఎలా ఆలోచనల ద్వారా, నైతిక విలువల ద్వారా ప్రజలను నియంత్రిస్తాయో ఈ కథ ఊహాజనిత ప్రపంచంలో చూపిస్తుంది. ఈ ఏడాది ప్రపంచ సాహిత్యంలో మరో ముఖ్యమైన లక్షణంగా అనువాద సాహిత్యానికి పెరిగిన ప్రాధాన్యతను పేర్కోవచ్చు. పాశ్చాత్య కేంద్రిత సాహిత్య ఆధిపత్యానికి సవాళ్లు మొదలయ్యాయి. ఇది ప్రపంచ సాహిత్యంలో ఒక రకమైన ప్రజాస్వామ్య విస్తరణగా చూడవచ్చు. మార్క్సిస్టు దృష్టిలో ఇది సాంస్కృతిక ఉత్పత్తి సాధనాలపై ఉన్న ఏకపక్ష నియంత్రణకు వచ్చిన చిన్న పగుళ్లుగా భావించవచ్చు. అయితే ఈ గుర్తింపు కూడా అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఎంపిక ఉంటుందనే విమర్శ లేకపోలేదు. ఈ సంవత్సరంలో వచ్చిన అనేక రచనలు పని అనే భావనను కొత్తగా నిర్వచించాయి. గిగ్ ఎకానమీ, తాత్కాలిక ఉద్యోగాలు, డిజిటల్ శ్రమ, అల్గోరిథమ్ ఆధిపత్యం వంటి అంశాలు కథల రూపంలో వ్యక్తమయ్యాయి. శ్రమ అనేది ఫ్యాక్టరీ గోడల మధ్య మాత్రమే కాకుండా, మనసు, భావాలు, సృజనాత్మకత వరకు విస్తరించిందన్న భావన ఈ రచనల్లో కనిపిస్తుంది. ఇది మార్క్స్ పేర్కొన్న 'వస్తు పరమైన పరాయీకరణ' ఆధునిక రూపానికి సంకేతం. స్థూలంగా చెప్పాలంటే, ప్రపంచ సాహిత్యం విప్లవాత్మక నినాదాలతో కాకపోయినా, మౌనంగా మూలధన వ్యవస్థలోని విరోధాలను బయటపెట్టింది. ఇది ప్రత్యక్షంగా విప్లవాన్ని పిలుపునివ్వదు. కానీ, జీవన వాస్తవాలను నిజాయితీగా చూపిస్తూ పాఠకుడిలో ప్రశ్నలను రేపుతుంది. మార్క్సిస్టు దృక్పథంలో ఇది ఒక అంతర దశ సాహిత్యం. పూర్తిస్థాయి ప్రతిఘటన సాహిత్యం కాకపోయినా, వర్గ చైతన్యానికి బీజాలు వేసే సాహిత్యంగా దీన్ని చూడవచ్చు. అందువల్ల 2025 ప్రపంచ సాహిత్యం మార్క్సిస్టు విశ్లేషణలో ఒక ముఖ్యమైన దశగా నిలుస్తుంది. ఇది మూలధన వ్యవస్థ విజృంభిస్తున్న కాలంలో, మానవ అనుభవాన్ని వస్తువుగా మార్చుతున్న పరిస్థితుల్లో, సాహిత్యం ఇంకా ప్రతిఘటనకు అవకాశం ఉందని నెమ్మదిగా, లోతుగా చెప్పిన సంవత్సరం అని నిర్ధారించవచ్చు. ఇలా, ప్రపంచ సాహిత్యంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పులు తెలుగు సా హిత్యం పైనా స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రత్యేకంగా సామాజిక అసమానతలు, రాజకీయ చైతన్యం, ఆధునికతపై ప్రశ్నలు తెలుగు రచనల్లో కూడా బలమైన ముద్ర వేస్తున్నాయి. సాహిత్యం అంటే ఒక అద్దం కాదు.. ఒక ప్రశ్న అనే భావన పెరిగింది. ఒక పోరాటం.. ఒక మేధో మథనం.. ఒక నిత్య ప్రయోగం అనే ఆలోచనలు పెరుగాయి. ప్రస్తుత కాలాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం జోరందుకుంది. భవిష్యత్తును ఊహించే ధైర్యం రచనల్లో మెరుస్తోంది.

– బిఎల్


## గ్లోబల్ క్యాపిటలిజం దృక్పథంలో...

ప్రపంచ సాహిత్యాన్ని గ్లోబల్ క్యాపిటలిజం దృక్పథంలో పరిశీలించినప్పుడు, అది మన కాలానికి చెందిన ఒక సామాజిక–ఆర్థిక పత్రంలా కనిపిస్తుంది. ఈ ఏడాది వెలువడిన నవలలు, కథలు, స్మృతిరచనలు ప్రపంచ మార్కెట్ ఆధిపత్యం, కార్పొరేట్ సంస్కృతి, అస్థిర ఉపాధి, వలస శ్రమ, డిజిటల్ జీవితం వంటి అంశాలను ప్రత్యక్షంగా కాకపోయినా, అంతర్లీనంగా బలంగా ప్రతిబింబించాయి. సాహిత్యం ఇక కేవలం సౌందర్య అనుభూతి మాత్రమే కాకుండా, మూలధన వ్యవస్థ మానవ జీవితాన్ని ఎలా ఆక్రమిస్తుందో చూపించే ఒక విమర్శాత్మక సాధనంగా మారింది. గ్లోబల్ క్యాపిటలిజం యొక్క ముఖ్య లక్షణం ప్రపంచాన్ని ఒకే మార్కెట్‌గా మార్చడం. 2025 సాహిత్యంలో ఇది కథా నిర్మాణాల్లో, పాత్రల జీవితాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. రచయితల కథలు తరచుగా దేశ సరిహద్దులను దాటుతాయి. ఒక దేశంలో పుట్టిన పాత్ర మరొక దేశంలో పని చేస్తుంది.. మూడవ దేశ సంస్కృతిలో జీవిస్తుంది. ఈ అంతర్జాతీయ కదలిక స్వచ్ఛందం కాదు.. అది జీవన అవసరాల వల్ల, ఉపాధి ఒత్తిడుల వల్ల ఏర్పడిన వలస. ఈ వలస అనుభవం వ్యక్తిగత విషాదంగా కనిపించినా, దాని వెనుక ప్రపంచ కార్మిక విభజన వ్యవస్థ ఉందన్న సత్యాన్ని సాహిత్యం స్పష్టంగా సూచిస్తుంది. మరోవైపు నేటి సాహిత్యంలో 'పని' అనే పదానికి అర్థం క్రమంగా మారుతున్నది. గ్లోబల్ క్యాపిటలిజంలో శ్రమ స్థిరమైనది కాదు... అది తాత్కాలికం. ఒప్పందాలపై ఆధారపడినది. నిరంతర భద్రత లేనిది. 2025లో వచ్చిన అనేక నవలల్లో పాత్రలు స్థిర ఉద్యోగాలు కాకుండా, గిగ్ పనులు, ఫ్రీలాన్స్ పనులు, డిజిటల్ సేవలపై ఆధారపడతాయి. ఇది కార్మికుడిని వ్యక్తిగా కాకుండా, సేవల ప్యాకేజీగా మార్చే మూలధన తర్కానికి సంకేతం. ఈ పరిస్థితిలో శ్రమ విలువ కంటే వేగం, లాభం, అల్గోరిథమ్ నిర్ణయాలే ముఖ్యమవుతాయి. సోషల్ మీడియా, డేటా, ఆన్‌లైన్ గుర్తింపులు కథల నేపథ్యంగా మాత్రమే కాకుండా, పాత్రల అంతర్గత జీవితాన్ని నియంత్రించే శక్తులుగా కనిపిస్తాయి. వ్యక్తి భావాలు కూడా మార్కెట్‌కు అనుగుణంగా మారుతున్నాయనే భావన ఈ రచనల్లో వ్యక్తమవుతుంది. ప్రేమ, స్నేహం, ఒంటరితనం కూడా వినియోగ సంస్కృతిలో భాగమవుతున్నాయని ఈ సాహిత్యం సూచిస్తుంది. ఇది గ్లోబల్ క్యాపిటలిజం మానవ అనుభూతులను కూడా వస్తువులుగా మార్చే స్థాయికి చేరిందన్న వాస్తవాన్ని బయటపెడుతుంది. 2025 సాహిత్యంలో గమనించాల్సిన మరో ముఖ్యమైన కోణం అసమానత. ప్రపంచం అభివృద్ధి చెందుతున్నట్లు కనిపించినా, సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతుందన్న నిజం కథల రూపంలో ప్రతిఫలించింది.


విలాస జీవితం గడి పే నగరాలు ఒకవైపు ఉంటే, అదే నగరాల్లో కనిపించని శ్రమజీవుల జీవితం మరోవైపు ఉంటుంది. ఈ విరుద్ధతలు కథలలో మౌనంగా ఉన్నా, తీవ్రంగా పనిచేస్తాయి. గ్లోబల్ క్యాపిటలిజం ఎలా అసమానతను సహజంగా మారుస్తుందో 2025 సాహిత్యం ప్రశ్నిస్తుంది. సాహిత్య ఉత్పత్తి కూడా గ్లోబల్ క్యాపిటలిజం ప్రభావం నుంచి త ప్పించుకోలేకపోతున్నదనే చేదు వాస్తవాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. 2025లో ఏ పుస్తకం అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందుతుందన్నది మార్కెట్ నిర్ణయాలపై ఎక్కువగా ఆధారపడింది. అనువాదాలు పెరిగినా, అవి కూడా ప్రపంచ పఠన మార్కెట్ అభిరుచులకు అనుగుణంగా ఎంపిక జరుగుతున్నదనే విమర్శ ఉంది. ఈ సందర్భంలో సాహిత్యం కూడా ఒక వస్తువు గా మారిన పరిస్థితిని ఈ ఏడాది స్పష్టంగా చూపిస్తుంది. అయితే అదే సమయంలో, ఈ వ్యవస్థలో నుంచే విమర్శాత్మక స్వరాలు పుట్టడం ఒక ముఖ్యమైన విరోధాభాసం. ఏదిఏమైనా, ఇప్పటి సాహిత్యం గ్లోబల్ క్యాపిటలిజాన్ని నేరుగా ఖండించకపోయినా, దాని ప్రభావాలను మానవ జీవితాల ద్వారా బహిర్గతం చేసింది. ఇది పెద్ద సిద్ధాంత నినాదాల కంటే, చిన్న జీవితాల కథల ద్వారా వ్యవస్థాత్మక అన్యాయాన్ని చూపించింది. ఈ విధంగా 2025 సాహిత్యం గ్లోబల్ క్యాపిటలిజం యు గంలో సాహిత్యం ఇంకా విమర్శాత్మక పాత్రను పోషించగలదన్న నమ్మకాన్ని బలపరుస్తుంది. కాబట్టి, సాహి త్యం, గ్లోబల్ క్యాపిటలిజం అనే కోణం మనకు ఒక ము ఖ్యమైన అవగాహనను కలిగిస్తుంది. అది ఏమిటంటే, ప్రపంచ మార్కెట్ ఎంత విస్తరించినా, మానవ అనుభవం ఇంకా పూర్తిగా వశం కాలేదన్న సత్యం. ఆ అనుభవాన్ని కథలుగా, భావాలుగా నిలబెట్టే ప్రయత్నమే నేటి సాహిత్యపు అసలైన విలువ.

## చదవాల్సిన పుస్తకం

# మానసిక సంఘర్షణల 'చరిత్రహీనులు'




శరత్ చంద్ర చటోపాధ్యాయుడు 1917లో రచించిన 'చరిత్రోహిన్' (తెలుగులో చరిత్రహీనులు పేరుతో బొందలపాటి శివరామకృష్ణ అనువదించారు) బెంగాలీ సమాజంలో స్త్రీలపై మోపబడే నైతిక ముద్రలపై గాఢమైన సామాజిక–మనో విశ్లేషణ. ఈ నవల వెలువడిన తర్వాత శరత్ చంద్రుడు స్త్రీ హక్కుల పక్షపాతిగా, సంప్రదాయాల పేరుతో జరిగే అన్యాయాల్ని ప్రశ్నించిన రచయితగా స్థిరపడ్డాడు. ఈ కథ 20వ శతాబ్దం ఆరంభంలోని బెంగాలీ హిందూ సమాజాన్ని నేపథ్యంగా తీసుకుని సాగుతుంది. ఇక్కడ సావిత్రి, కిరణ్మయి ప్రధాన పాత్రలు కాగా, సూరబాల, సరోజిని ఉప పాత్రలు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే... నలుగురినీ సమాజం చరిత్రహీనం అని అనుమానిస్తే గానీ, వాస్తవంగా నలుగురి జీవనాలు, స్వభావాలు, పరిస్థితులు పూర్తిగా భిన్నమైనవి. సావిత్రి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన విధవ. బంధువుల మోసం వల్ల ఇంటి నుంచి వెళ్లగొట్టబడి, సమాజం తక్కువగా చూసే పనులు చేయాల్సి వస్తుంది. అయినా ఆమె వ్యక్తిత్వం పూర్తిగా పవిత్రమైనదిగా శరత్ చంద్రుడు స్పష్టం చేస్తాడు. సతీశ్‌పై ఆమెకు ఉన్న ప్రేమ మాటల్లో కాదు, త్యాగంలో వ్యక్తమవుతుంది. ఈ మౌన ప్రేమే చివరికి ఇద్దరినీ అశీలులు అన్న ఆరోపణల దాకా నెట్టేస్తుంది. సావిత్రి కాశీకి వెళ్లిపోవడం, సతీశ్ అంతర్గత వేదన— స్త్రీ గౌరవాన్ని కాపాడడంలో పురుషుడు ఎంత అశక్తుడో చూపిస్తాయి. కిరణ్మయి ఈ నవలలో అత్యంత సంక్లిష్టమైన పాత్ర. అపూర్వ సౌందర్యం, తర్కబుద్ధి, తిరుగుబాటు స్వభావం ఉన్న ఆమె, భర్త నిర్లక్ష్యం మరియు అత్త వేధింపుల వల్ల భావోద్వేగంగా నలిగిపోతుంది. అణచివేయబడిన కోరికలు, అతిశయమైన ఆత్మగౌరవం చివరికి ఆమెను మానసిక విపథం వైపు నడిపిస్తాయి. కిరణ్మయి పతనం వ్యక్తిగత దోషం కంటే, కుటుంబ–సమాజ వ్యవస్థల వైఫల్యంగా కనిపిస్తుంది. సూరబాల అంధ విశ్వాసంతో కూడిన పతివ్రత; సరోజిని పాశ్చాత్య విద్య పొందిన ఆధునిక యువతి. వీరిద్దరూ స్త్రీలపై ఉన్న రెండు విభిన్న సామాజిక అంచనాలను సూచిస్తారు. సరోజిని–సతీశ్ సంబంధం స్పష్టత లేనిదిగా మిగిలిపోవడం, ప్రేమ–వివాహాల విషయంలో అప్పటి సమాజపు అయోమయాన్ని ప్రతిబింబిస్తుంది. పురుష పాత్రలు.. సతీశ్, ఉపేంద్ర, దిబాకర్— స్త్రీల జీవితాలపై ప్రభావం చూపుతాయి గానీ, ఎక్కువ సందర్భాల్లో అవే వారికి హానికరం. స్త్రీ మనస్సు లోతును గ్రహించలేని, సంప్రదాయ బంధనాల్లో చిక్కుకున్న పురుషుల ప్రతిరూపాలుగా వీరు నిలుస్తారు. ముఖ్యంగా దిబాకర్–కిరణ్మయి సంబంధం, అపరిపక్వ భావోద్వేగాలు ఎలా విధ్వంసానికి దారితీస్తాయో చూపిస్తుంది. నవల ముగింపులో అన్ని స్త్రీలకూ ఒక విధమైన నైతిక విముక్తి లభిస్తుంది. సావిత్రి దేవీసమానంగా గుర్తింపు పొందుతుంది. కిరణ్మయి బాధలకు కనీస అవగాహన కలుగుతుంది. సరోజినికి వివాహ హామీ లభిస్తుంది; సూరబాల సతీశ్, ఉపేంద్రలకు కళ్లుతెరిపిస్తుంది. ఇది శిక్షకన్నా కరుణ, తీర్పుకన్నా అవగాహన ముఖ్యమని రచయిత చెబుతున్న సంకేతం. బ్రిటిష్ ప్రభావంతో వచ్చిన పాశ్చాత్య ఆలోచనలు.. సనాతన హిందూ సంప్రదాయాల మధ్య సంఘర్షణను శరత్ చంద్రుడు వాస్తవికంగా చిత్రించాడు. చరిత్ర అనేది స్త్రీకి మాత్రమే కొలమానం ఎందుకు అవుతుందన్న ప్రశ్న ఈ నవల అంతటా ప్రతిధ్వనిస్తుంది. ఈ రచన ఆధారంగా 1982లో దూరదర్శన్‌లో 'చరిత్రహీన్' టీవీ సీరియల్ ప్రసారమైంది. 2018లో స్వస్తిక ముఖర్జీ నటించిన బెంగాలీ వెబ్ సిరీస్ కూడా రూపొందింది. ఇవి ఈ నవల యొక్క కాలాతీత ప్రాసంగికతకు నిదర్శనాలు. మొత్తంగా, 'చరిత్రోహిన్' స్త్రీ పతనం కథ కాదు; సమాజపు ద్వంద్వ నైతికతపై వేసిన పదునైన ప్రశ్న. శరత్ చంద్రుడి మానవతావాద దృష్టి ఈ నవలను భారతీయ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిపింది.




### పుస్తకం పేరు

**చరిత్రహీనులు**

**రచయిత: శరత్ చంద్ర చటోపాధ్యాయుడు**

**వెల: రూ. 350**

**అనువాదం: బొందలపాటి శివరామకృష్ణ**

ప్రతులకు

**నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్‌ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

ఈ వారం కవితలు

## ఉద్యమాల ఉత్తుంగ తరంగం

ఉద్యమాల ఉత్తుంగ తరంగం,
రాజ్యాన్ని గొంతెత్తి ప్రశ్నించిన
వీరంగం, పడకేసిన ప్రజా సంఘాలకు
నడక నేర్పిన కొదమసింహం,
'ఆయనే కామ్రేడ్ నరసింహారెడ్డి,
ఇక మరిచిపోదు నిన్ను, మన కామారెడ్డి.

కమ్యూనిస్టులకు ఆక్సిజన్‌గా..
ప్రాతినిధ్యాలతో ప్రజల్లో చైతన్యాన్ని
నింపిన, మడమ తిప్పని పోరాట
యోధునివి... లెఫ్ట్ ఉద్యమాల కథా
నాయకునివి. 'సలాం పేదల పెద్దన్నా,
లాల్ సలాం నరసన్నా'.

పేదల సమస్యలే కేంద్రంగా.. వాస్తవాలే
ప్రాతిపదికగా.. వ్యాపార వాదనలను
తిప్పికొడుతూ.. నిజాల నిగ్గు తేల్చిన
మానవతావాదివి...న్యాయవాదివి...
'సలాం...పేదల పెద్దన్నా..
లాల్ సలాం.. నర్సన్నా.'

ఆదమరిచి నిద్రిస్తున్న
కామ్రేడ్‌లను మేలుకొలిపి, ఫణిహారం
రంగాచారికి ప్రాణం పోశావు,
మరుగున పడ్డ చరిత్రను
తిరగరాశావు,'ఆయనే, కామ్రేడ్
నర్సింహా రెడ్డి, ఇక మరువదు నిన్ను
మన కామారెడ్డి'

ఆక్రమిత కామారెడ్డి క్లబ్, కాలేజీ స్థల
వివాదం, గోదావరి జలాల మళ్లింపు,
సారా నిషేధ పోరాటము, అశ్లీల పోస్టర్ల
నిషేధము, రైతుల ఆత్మహత్యలు,
విద్యారంగ సమస్యలు, తెలంగాణ
పోరాటము, వెరసి...

ఉవ్వెత్తున ఎగిసిపడే ఉద్యమాలకు
ఊపిరివై, ప్రజల్లో చైతన్యాన్ని నింపావు,
హక్కులకై కనబడుతూ...
బాధ్యతలకు నిలబడ్డావు, మీ అమరత్వం
ఇక వృథా కాదు.. 'ఆయనే కామ్రేడ్
నర్సింహా రెడ్డి.. ఇక మరువదు నిన్ను
మన కామారెడ్డి'. 'సలాం.. పేదల
పెద్దన్నా... లాల్ సలాం... నర్సన్నా.'

– కందుకూరి శ్రీనివాస్

## పోరాటలతోనే పురుడు పోసుకున్న పార్టీ

పోరాటలతోనే పురుడు పోసుకున్న పార్టీ రా
వంద ఏళ్ల చరిత ఉన్న పోరాట పార్టీ రా
జనం గుండెల్లో నిలిచి ఉన్న కమ్యూనిస్టు పార్టీ రా
సిపిఐ సిపిఐ సిపిఐ రా
అదే భారత కమ్యూనిస్టు పార్టీ రా

బాంచెను దొరా అన్న చేత బందూకును పట్టించి
దోపిడీల గురుతులైనా దొర గడులను కూల్చేసి
రజాకర్ నిజాం భారత సైన్యంకు కూడా
ఎదురొడ్డి నిలబడి లక్షల ఎకరాలు పంచిన
వీర తెలంగాణ పోరాటం నడిపిన
సిపిఐ సిపిఐ సిపిఐ రా అ
దే భారత కమ్యూనిస్టు పార్టీ రా

బొంబాయి అహ్మదాబాద్ పారిశ్రామిక నగరాలన్నింట
కార్మికులను కూడ గట్టి సమ్మెలెన్నో నిర్వహించి
హక్కులను వసతులను కార్మికుల ఐక్యతను సాధించి
స్వాతంత్ర్య ఉద్యమానికి కార్మిక బాసటను
కల్పించిన పోరాట పార్టీ రా
సిపిఐ సిపిఐ సిపిఐ రా
అదే భారత కమ్యూనిస్టు పార్టీ రా

భూ పోరాట లెన్నో చేసి భూములెన్నో పంచింది.
నగరాల్లో పట్టణాల్లో నీడ లేని పేదలకై
పోరాట లెన్నో చేసి ఇళ్ల జాగలేన్నో పంచింది
పోరాటలతోనే పురుడు పోసుకున్న పార్టీ రా
పోరాటలే ఊపిరిగా బతుకుతున్న పార్టీ రా
సిపిఐ సిపిఐ సిపిఐరా
అదే భారత కమ్యూనిస్టు పార్టీ

హక్కులకు భంగమస్తే పక్షిలాగా వాలుతుంది
ప్రజల అక్కరలు తెలుసుకొని ఉద్యమాలు నిర్మిస్తుంది
ప్రగతి వాద శక్తులను ఒక్క తాటిపైకి తెచ్చి
దేశాన్ని పాసిజం నుంచి కాపాడగ పూనుకున్న పార్టీరా
సిపిఐ సిపిఐ సిపిఐరా అదే భారత కమ్యూనిస్టుపార్టీరా
పోరాటాలతోనే పురుడు పోసుకున్న పార్టీ రా
పోరాటలే ఊపిరిగా బతుకుతున్న పార్టీ రా

–'నిధి'



## ఎర్రకోటపై ఎగరాలి ఎర్రజెండా

ఎర్రకోటపై ఎగరాలి ఎర్రజెండా
ఎగరాలి ఎగరాలి మా ఎర్రజెండా
వందేళ్ళ త్యాగాల ఘనకీర్తి మా ఎర్రజెండా
॥ఎగరాలి॥

స్వాతంత్ర్య సంగ్రామ రణభేరి మా ఎర్రజెండా
నైజామ్ సర్కారునే మట్టికరిపించిన
సాయుధ సంగ్రామ ధీర నా ఎర్రజెండా
॥ఎగరాలి॥

దొరలు జమీందారులు భూస్వామ్య వర్గాలపై
పోరుచేసింది మా ఎర్ర జెండా
లక్షల ఎకరాల భూమి పేదలకు పంచింది నా ఎర్రజెండా
॥ఎగరాలి॥

గనులు కార్ఖానాలు కర్మాగారాల్లో
కార్మిక సంఘాల పెట్టింది మా ఎర్రజెండా
కార్మికులకు హక్కులు సాధించి పెట్టింది మా ఎర్రజెండా
॥ఎగరాలి॥

విద్యార్థి యువకుల వెన్నుతట్టింది నా ఎర్రజెండా
నిరుద్యోగ రక్కసిపై పోరుచేసింది నా ఎర్రజెండా
॥ఎగరాలి॥

సామ్రాజ్య వాదులు మతోన్మాదులు ఒక్కటై
వస్తున్నరమ్మ ఓ ఎర్రజెండా
వాళ్లకి ఎదురొడ్డి పోరాడి గెలవాలి మా ఎర్రజెండా
॥ఎగరాలి॥

ఎగరాలి ఎగరాలి మా ఎర్రజెండా
ఎర్రకోటపై నువ్వు ఎగరాలి మా ఎర్రజెండా
॥ఎగరాలి॥

ఎగరాలి ఎగరాలి మా ఎర్రజెండా
భరత ఖండంపై సమతారాజ్యంబు
సాధించుదాకా ఎగరాలి మా ఎర్రజెండా

– బొమ్మగాని నాగభూషణం
ఉపాధ్యక్షుడు తెలంగాణ అరసం

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు మృతి



ప్రజాపక్షం/అర్వపల్లి : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాయ యోధుడు సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు నల్లు శేఖర్ రెడ్డి మృతి చెందారు. ఆయన మల్లు స్వరాజ్యంతో కలిసి ఉద్యమంలో పనిచేశారు. కాసర్లపాడు గ్రామ సర్పంచ్‌గా పని చేసి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆయన మృతిపట్ల పలువురు నాయకులు సంతాపం తెలిపారు. సిపిఎం నాయకులు మల్లు నాగార్జున్ రెడ్డి, కొలిశెట్టి యాదగిరిరావులు హైదరాబాదులో ఆయన మృతదేహంపై అరుణ పథకం కప్పి పూలమాలతో జోహార్లు అర్పించారు. శేఖర్ రెడ్డి మృతదేహాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధన నిమిత్తం బీబీనగర్ ఎమ్స్ కళాశాలకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ఉప్పు సత్యనారాయణ, శేఖర్ రెడ్డి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ ముసబ్ అహ్మద్ గారికి గ్రేడ్1 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. నల్లగొండ మున్సిపాలిటీలో కమిషనర్‌గా పనిచేస్తూ పట్టణాభివృద్ధి,పారిశుధ్యం,మౌలిక వసతుల మెరుగుదల,ప్రజలకు మెరుగైన సేవల అందజేతలో ఆయన విశేష సేవలు అందించారు.అయన పని తీరు,పరిపాలనా సామర్థ్యం,నిబద్ధతను గుర్తించి ప్రభుత్వం ఈ పదోన్నతిని కల్పించడం అభినందనీయమని పలువురు ప్రజాప్రతినిధులు,అధికారులు,మున్సిపల్ సిబ్బంది ప్రశంసించారు.ఈ సందర్భంగా సయ్యద్ ముసబ్ అహ్మద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా మరింత ఉన్నత సేవలు అందించాలని ఆకాంక్షించారు.



## మౌలిక వసతుల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

### ఆర్ అండ్ బి రోడ్డును ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండలం కేంద్రంలో వలిగొండ నుండి సుంకిశాల మీదగా కాటేపల్లి వరకు 49.50 కోట్ల రూపాయలతో నిర్మించనున్న నూతన డబుల్ రోడ్డు పనులను రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం ప్రారంభించారు. భువనగిరి, చిట్యాల రోడ్డు 180 కోట్లతో త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోలేదు ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం వచ్చాక ప్రజలకు అన్ని విధాలుగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ రహదారి ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఆ దిశగా ఈ రహదారి కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. నాణ్యమైన రహదారులు సమగ్ర అభివృద్ధి అనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని, ప్రతి గ్రామం అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమన్న నమ్మకంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎన్నారై పైళ్ళ మల్లారెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యతనిస్తాం : వేణారెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : స్థానిక సంస్థల ఎంపిటిసి, జడ్‌పిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తామని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ మాట్లాడుతూ జిల్లా కమిటితోపాటు నియోజక వర్గ, మండల కమిటిలను సమన్వయం చేస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సూచనల మేరకు శక్తి వంచన లేకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేస్తామన్నారు. అనంతరం ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచులుగా, ఉపసర్పంచులుగా, వార్డు సభ్యులుగా విజయం సాధించిన యూత్ కాంగ్రెస్ నాయకులను సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన యూత్ కాంగ్రెస్ జిల్లా ఇంచార్జిలు వెలిమినేటి సురేష్, రమ్యకృష్ణ, సునీల్‌లతో కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము జవహర్, శ్రావ్య సుధీర్‌రెడ్డి, కందుకూరి అంబేద్కర్, రామడుగు నవీన్‌చారి, విజయ భాస్కర్, అబ్దుల్ అజీమ్, జావీద్, బొడ్డు సాయి, వినయ్, పవన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## మన గ్రోమోర్ సెంటర్ ఫర్టిలైజర్ లైసెన్స్ రద్దు



ప్రజాపక్షం/మర్రిగూడ: నిబంధనలకు విరుద్ధంగా యూరియా విక్రయాలు జరిపినందుకు మర్రిగూడలోని మన గ్రోమోర్ సెంటర్ ఫర్టిలైజర్ లైసెన్సును సస్పెండ్ చేస్తూ మునుగోడు డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు.ప్రభుత్వం నిర్దేశించిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చెయ్యని రైతులకు నిబంధనలకు విరుద్ధంగా యూరియా విక్రయంచినట్లు తనిఖీల్లో తేలిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న రైతులకు యూరియా విక్రయించకుండా,స్లాట్ బుక్ చేసుకోని రైతులకు నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపినట్లు గుర్తించినట్లు ఏడీఏ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఈ నెల 24న మర్రిగూడ మన గ్రోమోర్ డీలర్‌కు మొత్తం 19.98 మెట్రిక్ టన్నులు (444 బస్తాలు) యూరియా సరఫరా కాగా,వాటిని ఈ నెల 25,26 తేదీల్లో అనధికారికంగా స్లాట్ బుక్ చేసుకోని రైతులకు విక్రయించినట్లు విచారణలో తేలిందని తెలిపారు.యూరియా కోసం ముందుగానే స్లాట్ బుక్ చేసుకున్న రైతులు ఈ నెల 27న ఎరువుల దుకాణానికి చేరుకోగా,అక్కడ స్టాక్ లేకపోవడంతో మండల కేంద్రంలో తీవ్ర గందరగోళం నెలకొందని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకొని ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్1985 లోని క్లాజ్31 ప్రకారం సదరు డీలర్ లైసెన్సును తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ఏడీఏ స్పష్టం చేశారు.ఎరువుల విక్రయాల్లో నిబంధనలు అతిక్రమించే ఏ డీలర్ అయినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## అంబులెన్స్‌లోనే ప్రసవం...



ప్రజాపక్షం/చివ్వెంల : మండలంలోని కోమటికుంటకు చెందిన పి సమ్మక్కకు ఆదివారం ఉదయం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో నొప్పులు తీవ్రమవ్వడంతో ఈఎంటి ప్రవళిక, పైలట్ శంకర్ సమయస్ఫూర్తితో అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. సమ్మక్క ఆడ శిశువుకు జన్మనివ్వగా, ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

# ప్రాణం ఉన్నంతవరకు ప్రజాసేవ చేస్తా

### సోనియా గాంధీది త్యాగాల కుటుంబం

### ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర

### అసెంబ్లీకి వస్తే కెసిఆర్‌ను ఉతికి ఆరేసేందుకు రె‘ఢీ’

### కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే అభివృద్ధి: యువ చైతన్య ర్యాలీ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ :పదవి ఉన్నా లేకున్నా తన ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవ చేస్తానని రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.కాంగ్రెస్ పార్టీ 140 వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎన్‌జి కళాశాల నుంచి శివాజీ నగర్, రామగిరి, బస్టాండ్, ప్రకాశం బజార్ మీదుగా క్లాక్ టవర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగాలన్న కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యపడుతుందని అన్నారు.తనను 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నల్గొండ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. నల్గొండ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.రాష్ట్రంలో మట్టి రోడ్డు ఉన్న ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు వేయిస్తానని పేర్కొన్నారు.నల్లగొండలో ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా బయట ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడని విమర్శించారు.కెసిఆర్‌కు దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సవాల్ చేశారు.అసెంబ్లీకి వస్తే కేసీఆర్‌ను ఉతికి ఆరేవేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. 24 నెలలుగా కేసీఆర్ అసెంబ్లీకి రాకుండానే నెలకు 5 లక్షల చొప్పున ఇప్పటివరకు కోటి 20 లక్షల జీతం తీసుకున్నాడని అన్నారు.పదవిలో ఉన్నన్ని రోజులు కేసీఆర్ అల్లుడు,కొడుకు ప్రజల సొమ్మును దోచుకు తిన్నారని విమర్శించారు.అవినీతిని ప్రశ్నించిన సొంత కూతురిని బయటకు వెళ్ళగొట్టారని అన్నారు. కల్వకుంట్ల కవిత అడిగిన దోచుకున్న వేలకోట్లకు లెక్క కెసిఆర్ లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. సోనియా గాంధీ ది త్యాగాల కుటుంబమని అన్నారు.రాజీవ్ గాంధీ చనిపోయిన సమయంలో మరో రెండు సార్లు ప్రధానిగా అవకాశం వచ్చిన తీసుకోలేదని అన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల కోసం సోనియా గాంధీ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకు వచ్చిందని ఉన్నారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ దేశంలో బిజెపి మతతత్వ రాజకీయాలు చేస్తుందని విమర్శించారు.వచ్చే ఎన్నికలలో రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని అన్నారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాయకత్వంలో నల్లగొండ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోనడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హాఫీజ్ ఖాన్,మాజీ మున్సిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,మాజీ జడ్‌టిసిలు వంగూరి లక్ష్మయ్య,పాశం రామ్ రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్,కనగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనుప రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకర బోయిన బిక్షం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల భద్రతకు పెద్దపీట

### ఐజి అరోమాసింగ్‌ఠాకూర్

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాకూర్ తెలిపారు. స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన రైల్వే రక్షణ దళ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఆదివారం స్టేషన్‌కు వచ్చిన ఆమెకు రైల్వే పోలీసులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైలు ప్రయాణీకులు సురక్షితగా గమ్య స్థానాలకు చేర్చేందుకు ఆధునీక రక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్యాసింజర్ల వస్తు సామాగ్రి భద్రతతోపాటు ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ నియంత్రణకై ఆధునీక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. 24గంటల నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని, స్టేషన్లలో అత్యాధునీక సీసీ , బాడీవేర్ కెమెరాలు అందుబాటులో ఉంచామన్నారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలోని స్టేషన్లు, రైళ్లలో విధులు నిర్వహించే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల శాశ్వత ఐడీలను సేకరిస్తున్నామని, భద్రత బృందాలను పెంచి సెల్‌ఫోన్, చైన్ స్నాచింగ్‌లు అరికట్టే చర్యలకు ఉపక్రమిస్తున్నామన్నారు. వారంతపు భద్రత సమీక్షలు నిర్వహిస్తూ ఉద్యోగుల మధ్య సమన్వయం పెంచుతున్నామన్నారు. భారతీయ రైల్వేలో భద్రతను పటిష్టం చేసేందుకు సురక్ష సమ్మేళన్, మేరీ సహేలి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ చరిత్రలో మదనాచారి ఒక అధ్యాయం

### శాసనమండలిమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ చరిత్రలో అన్నభీమోజు మదనాచారి ఒక అధ్యాయమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కళాభారతిలో నిర్వహించిన జన హృదయేతన అన్నభీమోజు ఆచారి పుస్తకాన్ని ఆయన మాజీ శాసనమండలి చైర్మన్ సిరికొండ మధుసుధనాచారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్నేహితున్ని రక్షించడానికి వెళ్లి ప్రాణత్యాగం చేసిన త్యాగశీలి ఆచారి అన్నారు. ప్రతి ఉద్యమంలో కార్యకర్తలు ఎన్నో త్యాగాలను చేస్తేనే ఉద్యమాలు విజయాలు సాధిస్తున్నాయని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలో ఆచారి ఎంతో పోరాడారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పలు నిర్మాణ, సేవారంగాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు 20లక్షల మంది వరకు ఉన్నారని, తెలంగాణీయులు అలసత్వం వదిలి మన నేల మీద పనులు మనమే చేయాలన్నారు. కాలమే కొందరిని ఇష్టంగా కంటుందని అలాంటి వాళ్లే చరిత్రకు కొత్త చరిత్రను అందిస్తారని అన్నారు. ఆచారి జీవించింది తక్కువ కాలమే అయిన ఎక్కువ చరిత్ర సృష్టించారని అన్నారు. ఇలాంటి వాళ్లు సమాజంలో అరుదుగా ఉంటారని అన్నారు. తాను 1984లో తొలి విశ్వకర్మ శాసనసభ్యుడిగా గెలిచి అసెంబ్లీకి వచ్చానని సిరికొండ మధుసుధనాచారి అన్నారు. విశ్వకర్మ జాతీయుడిగా పుట్టినందుకు తాను గర్విస్తున్నానని అన్నారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో జరిగిన వీర తెలంగాణ పోరాటానికి అన్ని రకాల ఆయుధాలను అందించింది విశ్వకర్మీయులేనన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు కెతావత్ శంకర్‌నాయక్, ఎంసీ.కోటిరెడ్డిలు మాట్లాడుతూ మిర్యాలగూడ అభివృద్ధికి అన్నభీమోజు ఆచారి చేసిన సేవకు గుర్తుగా మిర్యాలగూడలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, నల్లమోతు సిద్దార్థ, పుస్తక రచయిత తాటికొండ రమేష్, జితేంద్రచారి, అన్నభీమోజు నాగార్జునచారి, గడగోజు చంద్రశేఖర్, మారం శ్రీనివాస్, ధనావత్ చిట్టిబాబునాయక్, మండలోజు సైదాచారి, పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఎండి.షోయబ్ పాల్గొన్నారు.

## 29 బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రానున్న మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మిర్యాలగూడలోని బీసీ హక్కుల సాధన సమితి కార్యాలయంలో జిల్లా స్థాయి ముఖ్య నేతల సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ రెండు పార్టీలు కూడా తీవ్రంగా బీసీలను మోసం చేశాయని, అయినప్పటికీ బీసీలు స్థానిక సంస్థల్లో 50శాతం సీట్లు గెలిచి బీసీ సత్తాచాటారని, అయినప్పటికీ చట్టసభల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ ఇంకా సజీవంగానే ఉందని, రానున్న ఎన్నికల్లో తప్పనిసరిగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి కాంగ్రెస్ పార్టీ తన నిబద్ధతను చాటుకోవాలన్నారు. సమావేశానికి సంఘం నాయకులు చిలకరాజు శ్రీను,సైదాఖాసీం, మాడుగుల శ్రీనివాస్, నరేందర్‌నాయుడు, కొమర్రాజు వెంకట్ తదితరులు ఉన్నారు.



## కమ్యూనిస్టులు నిరంతరం ప్రజల పక్షం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : కమ్యూనిస్టులు నిరంతరం ప్రజల పక్షం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం భువనగిరి పట్టణంలోని జగదేవ్ పూర్ చౌరస్తాలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎర్రజెండాను భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దాసరి లక్ష్మయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్ మాట్లాడుతూ భూస్వాములు, జమీందారులు, జాగిర్దారులకు వ్యతిరేకంగా పేద ప్రజలకు భూములు పంచాలని దున్నేవాడికి భూమి కావాలనే నినాదంలో సిపిఐ చేపట్టిన పోరాటాల ఫలితంగానే భూసంస్కరణల చట్టం అమలులోకి వచ్చిందని అన్నారు. 100 సంవత్సరాలలో సిపిఐ కార్మికులు, కర్షకులు పేదల హక్కుల కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించిందని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం ఉప ప్రధాన కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, సిపిఐ నాయకులు చింతల పెంటయ్య, చొప్పరి సత్తయ్య, భవన నిర్మాణ కార్మికులు ఎల్లంల సతీష్, దాసరి వెంకటేష్, బండారి కుమార్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిజం అజేయం..

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : కమ్యూనిజం అజేయం అని సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం భువనగిరి మండలంలోని కూనూరు గ్రామంలో ఎర్రజెండాను దాసరి లక్ష్మయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో భూస్వామ్య శృంకలాలను తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కూనూరు గ్రామ శాఖ కార్యదర్శి మరిపెల్లి రాములు, నాయకులు మరిపెల్లి ఎల్లయ్య, వాడి శ్రీను, పాశం యాదగిరి పాల్గొన్నారు.



# దేశానికి స్వాతంత్య్రం తెచ్చింది కాంగ్రెస్సే

### ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

ప్రజాపక్షం/దేవరకొండ : దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరకొండ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ పార్టీ జెండాను ఎంఎల్‌ఏ బాలు నాయక్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత పురాతన పార్టీ కాంగ్రెస్ అని, అనేక మంది మహనీయుల సంకల్పంతో ఏర్పడిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. స్వాతంత్య్ర పోరాటంలో, దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఎనలేనిదని అన్నారు. జాతీయ ఉపాధి హామీ చట్టం పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నడం పనికిమాలిన చర్యగా భావించారు. ఈకార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు యూనుస్, వెంకటేశ్వర్లు, నాయకులు వేణుధర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, నజీర్, సురేష్‌గౌడ్, రహత్‌అలి, రైస్, సైదులు, హరికృష్ణ, రాంసింగ్ పాల్గొన్నారు.



**నేడు రాష్ట్ర సాధనకు కాంగ్రెస్సే కారణం : ఎమ్మెల్యే వేముల వీరేశం**

ప్రజాపక్షం/నకిరేకల్ : దేశ స్వాతంత్య్ర సాధన నుంచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు చరిత్రాత్మక బాధ్యతలను భుజాన వేసుకుని ప్రజల పక్షాన నిలిచిన పార్టీ కాంగ్రెస్ అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం స్పష్టం చేశారు.ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒంటేపాక ఏసురత్నం,సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి,కౌన్సిలర్ గాజుల సుకన్య, యాసారపు వెంకన్న,నాయకులు లింగాల వెంకన్న,కొండ వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : భారత జాతీయ కాంగ్రెస్ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని డిసిసి అధ్యక్షుడు గుటిపాటి నర్సయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటే ప్రజల కోసం పోరాటం, కాంగ్రెస్ అంటే అభివృద్ధి, సంక్షేమం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజద్‌అలీ, ఎలిమినేటి అభినయ్, వెలిమినేటి సురేష్, రమ్యకృష్ణ, సునీల్, కొమ్ము జవహర్, శ్రావ్య సుధీర్‌రెడ్డి, కందుకూరి అంబేద్కర్, రామడుగు నవీన్‌చారి పాల్గొన్నారు.

### మహాత్మా గాంధీ పేరు తొలగింపు దుర్మార్గపు చర్య

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంకు తూట్లు పొడుస్తూ మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నారని డిసిసి జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్ నేత అన్నారు.ఆదివారం నాడు జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్ నుండి రామగిరిలోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. గాంధీ చిత్ర పటాలతో మోదీ, బీజేపీ లకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తెచ్చిన జాతిపిత మహాత్మా సిద్ధాంతాలను తుంగలో తొక్కి గాడ్సే వాదాన్ని బలపరుస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు కన్నారావు, ఎండి ముంతాజ్ అలీ,బోడ స్వామి,నూనె కోటి,జిల్లపల్లి పరమేష్,సుధాకర్ ముదిరాజ్,పుట్టవెంకన్న, రాంబాబు నాయుడు రవితేజ బాలకృష్ణ నేత, రఫీ,శివ, బ్రహ్మచారి, టి యాదగిరి ,మహేష్ కురుమ ,కోటేష్ ,సంతోష్ ,సాయి సాయితేజ, దశరథ,శరత్, సాయి,లక్ష్మణ్, ఉమేష్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





## ధాన్యం కేటాయింపులో అక్రమ పద్ధతులు అవలంబిస్తున్న అధికారులు

**ప్రజాపక్షం/పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావు పల్లి గ్రామ శివారులోని ప్రారంభం కాని మారుతి ఆగ్రో లిమిటెడ్ రైస్ మిల్లులో మూడు లారీల లోడ్‌తో ధాన్యాన్ని ఆదివారం అక్రమంగా తీసుకు వచ్చి డంపు చేస్తున్నారు. నిర్మాణ దశలో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యాన్ని కేటాయించడం జిల్లా సివిల్ సప్లై అధికారులకు మామూలుగా మారింది. వనపర్తి సివిల్ సప్లై అధికారి ఆదేశాల ప్రకారమే పర్మిషన్ లేని రైస్ మిల్లుకు, ట్రక్ షీట్లు లేకుండా పెబ్బేరు సింగిల్ విండో ఆధ్వర్యంలోని కొను గోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని పంపిస్తున్నట్లు తెలుస్తుంది. వనపర్తి జిల్లాలో నిర్మాణంలో ఉన్న రైస్ మిల్లులకు చాలా వాటికి అక్రమంగా ధాన్యాన్ని కేటా యించడం అలవాటుగా పెట్టుకున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయా లని పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కలె క్టర్ తక్షణం చర్యలు తీసుకొని కొనసాగుతున్న అక్రమ కేటాయింపుల వ్యవ హారాన్ని విజిలెన్స్‌తో దర్యాప్తు జరిపి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవా లని జిల్లా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గిన్నిస్ రికార్డులకు పెబ్బేరు విద్యార్థులు

**ప్రజాపక్షం/పెబ్బేరు:** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో కూచిపూడి కళా విభాగం భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా నృత్య కార్యక్రమంలో పాల్గొని పెబ్బేరుకు చెందిన విద్యార్థులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకు ఎక్కారు. పెబ్బేరు మూన్ వాక్ అకాడమీలో నృత్య గురువు జ్యోతి ఆధ్వర్యంలో పెబ్బేరుకు చెందిన చిన్నారులు కంచ శిశిర, నయన, ప్రణవి, సాన్విక, అమూల్య, సహస్ర, బిల్వశ్రీ, చతుర్వేదలు 7209 మందిలో నృత్య ప్రదర్శన చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును పొందారు.



ఈ సందర్భంగా గురువు జ్యోతి మాట్లాడుతూ సంప్రదాయ నృత్య రూపమైన కూచిపూడిని అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టింపజేయడం తమ లక్ష్యమని చెప్పారు. రికార్డు సాధించిన చిన్నారులను పలువురు అభినందించారు.



## గ్రామాల అభివృద్ధికి శ్రీకారం

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందడుగు

ప్రభుత్వాల నిధులకై ఎదురుచూపు

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** గ్రామపంచాయితీలకు నూతనంగా ఎన్నికైన పాలకవర్గం బాధ్యతలు చేపట్టడంతో గ్రామాలలో అభివృద్ధి పనులకు మళ్లీ ఊపిరి పోసినట్లైంది. సర్పంచ్, ఉపసర్పంచులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాభివృద్ధిని ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ పలు కీలక పనులకు శ్రీకారం చుట్టారు. మండల పరిధిలోని కోర్లకుంట గ్రామ సర్పంచు పానుగంటి శ్రీదేవి బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే గ్రామ భద్ర తకు ప్రాధాన్యం ఇస్తూ రూ.2 లక్షల వ్యయంతో గ్రామంలో 10 సీసీ కెమె రాలు ఏర్పాటు చేయించారు. అదే విధంగా గ్రామపంచాయితీలో నిరుప యోగంగా పడి ఉన్న ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను రూ.80 వేల వ్యయంతో మరమ్మత్తులు చేయించి, గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబా టులోకి తీసుకువచ్చారు. అలాగే తూముకుంట గ్రామ సర్పంచు పలుస రామన్ గౌడ్, నాగర్లబండ తండా సర్పంచు గోపాల్ నాయక్, తమ తమ గ్రామాలకు సమీపంలోని రహదారుల ఇరువైపులా పెరిగిన కంపచెట్లను జెసీబీ సహాయంతో తొలగించి వాహనదారులకు ఎదురవుతున్న ఇబ్బందు లను తొలగించారు. వీపనగండ్ల గ్రామ సర్పంచు మీసాల పార్వతమ్మ గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేయించి పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా నివారణ చర్యలు చేపట్టారు. అదే విధంగా పుల్గర్‌చర్ల గ్రామ సర్పంచు బత్తుల బాలరాజు గ్రామంలో తాగునీటి బోరు మోటార్ కాలిపో వడంతో వెంటనే స్పందించి మరమ్మత్తులు చేయించి, తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్పంచులు ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తూ, నిధుల కొరత ఉన్నా వెనుకడుగు వేయకుండా అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇదే విధంగా గ్రామాల అభివృద్ధి నిరంతరం కొన సాగాలని వారు ఆకాంక్షించారు.

## విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమమే సమాజ భవిష్యత్తుకు పునాది



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూ ప్రభుత్వ హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థులు చలికాలంలో ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండాలనే సదుద్దేశంతో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో బెడ్‌షీట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మహబూబ్ నగర్‌లోని బోయపల్లి ఎస్టీ హాస్టల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థులకు స్వయంగా బెడ్‌షీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సంస్థ సేవలు ప్రశంసనీయమని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని రెడ్ క్రాస్ సంస్థను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు ఖాజా పాషా, అజ్మత్ అలి తదితరులు పాల్గొని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు, హాస్టల్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మేధా సంపత్తి తెలంగాణ కవుల సొంతం



మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** తెలంగాణ గడ్డ పై పుట్టిన కవుల మేధా సంపత్తి అపారమని, సమాజంలోని వాగ్దాన భంగాలను ప్రశ్నించే చైతన్యం వారి కవిత్వంలో కనిపిస్తుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని టి.ఎన్.జి.ఓ భవన్‌లో గంగవరం రామకృష్ణారెడ్డి రచించిన ''ఖాళీ కుర్చీ'' కవితా సంపుటిని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ. సమాజంలో పాలకులు ఇచ్చిన వాగ్దానాలకు భంగం కలిగినప్పుడు వారిని ప్రశ్నించడం ప్రజల ప్రాథమిక హక్కు అని గుర్తు చేశారు. అధికారానికి ప్రతీక అయిన 'కుర్చీ' సామాజిక బాధ్యతల నిర్వహ ణకు మౌన సాక్షిగా ఉంటుందని, ఆ బాధ్యతలను విస్మరించకూడదని పిలు పునిచ్చారు. రామకృష్ణా రెడ్డి ఎంతో సరళమైన శైలిలో సమాజంలోని క్లిష్ట మైన అంశాలను స్పృశిస్తూ ఈ కవితా సంపుటిని రూపొందించడం అభినం దనీయమని కొనియాడారు. మహాకవి దాశరథి రాసిన '' ఆ చల్లని సముద్ర గర్భం'' గేయం ప్రకృతిలోని శాస్త్రాలను ఎలా స్పృశించిందో వివరిస్తూ, వర్ధ మాన కవులు అటువంటి గొప్ప రచనలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ప్రముఖులు డాక్టర్ వీరయ్య, నారాయణరెడ్డి, డాక్టర్ సురేష్, విశ్వ, నాయకంటి నరసింహ శర్మ, బైరోజు చంద్రశేఖర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ , ప్రేమ్ నాథ్ రెడ్డి, సుగురు మురళి సాగర్, మంద రాము ఇతర సాహితీవే త్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్న ప్రసాద వితరణ

**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఆర్డీవో లయన్ పాండు జ్ఞాపకార్థం స్థానిక పడమటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆది వారం లయన్స్ క్లబ్ మక్తల్ సహకారంతో కుటుంబ సభ్యులు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. దాదాపు 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పాండు సార్ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అడ్వకేట్ దత్తాత్రేయ, హేమ్ సుందర్, శ్రీధర్, తుకారం, లయన్స్ క్లబ్ మక్తల్ అధ్యక్షుడు సత్య ఆంజనేయులు, ట్రెజరరీ ఆదెం సత్య నారాయణ, సీనియర్ సభ్యులు డాక్టర్ శ్రీరామ్, రమేష్ రావు, ఎ.రవి కుమార్, జాయింట్ సెక్రటరీ మామిళ్ళ పృథ్వీరాజ్, నాగరాజు, జయపాల్ రెడ్డి, అంబాదాస్, శరణప్ప, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివితే భవిష్యత్ బంగారు బాట

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** చదువు జీవితాన్ని మార్చుతుందని, విద్యా ర్థిని లు బాగా కష్టపడి చదివి తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకొని తల్లి దండ్రుల ఆశయం నెరవేర్చాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంక టయ్య అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన వేముల గ్రామంలో అత్యాచారానికి గురై మరణించిన దళిత యువతి కుటుంబాన్ని పరామర్శించి ఆర్ &బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ విజ యేందిర బోయి, ఎస్పీ డి.జానకిలతో కలిసి చర్చించారు. అనంతరం మహ బూబ్ నగర్ తిరుమల హిల్స్‌లోని గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను సందర్శించారు. డిగ్రీ రెండవ, మూడవ సంవత్సరం చదువు తున్న విద్యార్థులతో సమావేశమై వారితో మాట్లాడారు. బోధన, భోజనం, వస తులు, ఇతరత్రా ఏమైనా సమస్యలు ఉన్నాయా విద్యార్థినులను అడిగి తెలుసు కున్నారు. సమస్యలు ఏమి లేవని విద్యార్థినిలు చెప్పారు. ప్రశ్నించినప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని భారత రత్న అంబేద్కర్ అన్నారని, విద్యా ర్థినిలు తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. విద్య కు ఎంతో ప్రాముఖ్యత ఉందని, చదువుతోనే జీవితం, భవిష్యత్ అని విద్యా ర్థినులు బాగా కష్టపడి చదివి తమ తల్లిదండ్రుల ఆశయం నిలబెట్టాలని అన్నారు. చాకలి ఐలమ్మ, ఝాన్సీ లక్ష్మీ బాయి, ఇందిరా గాంధీ, సావిత్రి బాయి పులే , లాంటి మహిళలను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. తొలుత కళాశాల ప్రిన్సిపాల్ వాసంతి పిళ్ళై మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థిని ల సర్వతోముఖాభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు, ఇతర కార్యక్రమాలను నిర్వ హిస్తున్నట్లు, గత సంవత్సరం 98 శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. వృత్తి నైపుణ్య, బ్యాంకింగ్, కానిస్టేబుల్ తదితర పోస్టులకు శిక్షణ నిస్తున్నట్లు తెలిపారు. సమావేశం తర్వాత విద్యార్థినులతో కలిసి రాష్ట్ర ఎస్సి, ఎస్టీ కమి షన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, అధికారులు భోజనం చేశారు. ఈ కార్యక్ర మంలో ఆర్.డి.ఓ. నవీన్, డిఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి అధి కారి కె.జనార్ధన్, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సుదర్శన్, ఆర్.సి.ఓ కళ్యాణి, డి.పి.ఆర్.ఓ శ్రీనివాస్, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వాసంతి పిళ్ళై, తహశీల్దార్ ఘన్సీరాం విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ భ్యులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చైర్మన్ బక్కి వెంకటయ్య, అధికారులను శాలువాతో సత్కరించారు.

**అత్యాచారానికి గురై మరణించిన దళిత యువతి కుటుంబానికి పరామర్శ**

మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామంలో ఈనెల 17న అత్యాచారానికి గురై మరణించిన దళిత యువతి ప్రవళిక కుటుంబా నికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని రాష్ట్ర ఎస్పీ, ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదివారం వేముల గ్రామంలో ప్రవళిక కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున రూ.3 లక్షల 47



వేల చెక్కును పరిహారంగా వారికి అందజేశారు. రూ.4,12,000లకు గాను రూ.3,47,000లు అందజేసినట్లు, మిగతా రూ.65 వేలు కలెక్టర్‌తో మాట్లాడి త్వరగా అందచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సంఘటన గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత మీడియాతో మాట్లాడుతూ సంఘటన బాధాకరం అని, తనను తీవ్రంగా కలచి వేసిందని అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించా లని అన్నారు. ఆర్ &బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి. జానకి ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ నవీన్, డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్ధన్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి సుదర్శన్, తహశీల్దార్ రాజు, ఎం.పి.డి.ఓ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

# పట్టణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

రూ.6కోట్ల 30లక్షలతో అభివృద్ధిపనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో పలు అభి వృద్ధిపనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌ను ప్రారంభించారు. సిలార్‌ప ల్లిలో అమృత్ 2.0నిధులతో ఈదులచెరువు అభివృద్ధి చేయుటకు రూ.220. 59కోట్లతో శంకుస్థాపన చేశారు. రూ.3కోట్లు నగరాభివృద్ధి నిధులతో 7,10, 11,12,13,14,15,16,17,18,19,20,21,22వ వార్డులలో సిసిరోడ్లు, డ్రైనేజిల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఎల్లికల్ రోడ్డులో కోటి రూపాయలతో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.15కోట్లతో కల్వకుర్తి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్తరేషన్‌కా ర్డులు, మహిళలకు ఉచితబస్సు, మహిళా సంఘాలకు రుణాలు, పేదలకు అనేక సంక్షేమ ఫలాలు అందిస్తూ ప్రభుత్వం అండగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల సంక్షేమ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజిసింగ్, కమీషనర్ మహ్మద్‌షేక్, ఏఈ షబ్బీర్‌అహ్మద్, నాయకులు ఆనంద్‌కుమార్, విజయ్ కు మార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, షానవాజ్‌ఖాన్, మిరియాల శ్రీనివాస్ రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, గోరేటిశ్రీను, ఎజాస్, చిన్న , పాండు రంగారెడ్డి, జమ్ముల శ్రీకాంత్, జంగారెడ్డిపల్లి, జీడిపల్లి సర్పంచులు కృష్ణా రెడ్డి, ఆంజనేయులు, దామోదర్‌గౌడ్, పుట్టశేఖర్ పాల్గొన్నారు.



## పేద ప్రజల గొంతుక సిపిఐ

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేతూరి శ్రీరామ్

**ప్రజాపక్షం/పానుగల్:** దేశంలో పేద ప్రజల గొంతుక సిపిఐ అని ఏఐటీ యూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ అన్నారు. సిపిఐ ఆవిర్భవించి 1925, డిసెంబర్ 26కు వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో పానుగల్ మండలం కేతేపల్లిలో శతజయంతి వారోత్సవాలను నిర్వహించారు. గ్రామపంచాయితీ వద్ద సిపిఐ జెండాను సీనియర్ నేత కమ్మావుల పెంటయ్య ఆవిష్కరించగా శ్రీరామ్ మాట్లాడుతూ శ్రమజీవుల కష్టాలను కడగళ్లను చట్టస భల్లో ప్రజా పోరాటాల్లో వినిపించి పరిష్కారం సాధించిందన్నారు. హామీలను విస్మరించి, వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించే కుట్ర చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు పూర్తిస్థాయిలో అమలు కావటం లేదన్నారు. ఉపే క్షిస్తే ప్రజలతో తిరస్కరణ తప్పదు అన్నారు. కేతేపల్లి గ్రామ ఉపసర్పంచు కృష్ణ వేణి, సిపిఐ మండల కార్యదర్శి డంగు కురుమయ్య, మాజీ వార్డు సభ్యులు లక్ష్మీ నారాయణ, పెంటయ్య, గ్రామశాఖ కార్యదర్శి కాకం చిన్న నారాయణ, నేతలు కాకం కాశన్న, పరుశరాముడు, సంతోష్, రామాంజనేయులు, ఎల గొద్దు రాముడు, నరసింహ, బోయ చిన్నకురుమయ్య, వెంకటమ్మ, శంక రమ్మ, అంజనమ్మ, దేవమ్మ, బాలపీరమ్మ, ఎల్లమ్మ, దొడ్ల బీరయ్య, ఎజ్జు బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనుల ప్రారంభం

**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని నందిని నగర్‌లో మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు రూ.10 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు పాల్గొ న్నారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధిలో భాగంగా అవసరమైన అన్ని చోట్ల సిసి రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ మండల అధ్యక్షులు గణేష్ కుమార్, కట్ట సురేష్ కుమార్ గుప్తా, టౌన్ ప్రెసిడెంట్ రవి కుమార్, కోళ్ల వెంకటేష్, కట్ట వెంకటేష్, మందుల సురేందర్, కున్సీ నాగేందర్, బోయి వెంకటేష్, రాయికోడ్ ఆనంద్, గొల్లపల్లి నారాయణ, సాయి ఫైనాన్స్ శీను, అబ్దుల్ రెహమాన్, నూరుద్దీన్, కావలి తాయప్ప, విష్ణు, ఉసాముద్దీన్, రహీం పటేల్, పంచ లింగాల నాగేష్, బోయి నరసింహ, మెకానిక్ రాము బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ జెండా మోసిన వారికి అండగా ఉంటాం

డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** పార్టీకి జెండా మోసిన వారికి అన్ని విధా లుగా అండగా ఉంటామని డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపులకు తావు లేదని, వ్యక్తులు కాదని పార్టీ ముఖ్యమని డిసిసి అధ్యక్షులు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో ఆదివారం కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండాన్ని డీసీసీ అధ్యక్షులు ఆవిష్కరించారు. సమావేశంలో డీసీసీ అధ్య క్షులు మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేద్దామని కోరారు. ఎవరైతే గ్రూపులు పెట్టాలనుకుంటే పక్కకు వెళ్లి గ్రూపులు పెట్టుకోవాలన్నారు. పార్టీ జెండాలు మోసిన వారికి అండగా ఉంటామని అన్నారు. పార్టీ కార్యాలయం నుంచి అశోక్‌టాకీస్ చౌరస్తాలోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరు. తీసివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు డిసిసి అధ్య క్షులు అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర



ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆరోపిం చారు. ఆయన మాట్లాడుతూ వలసలను అరికట్టి, పేదరికాన్ని తగ్గించి స్థాని కంగానే ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించడం సరికాదన్నారు. టీజీఎంఎప్సి చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి సభ్యుడిగా ఉండడం చాలా గర్వంగా ఉంద న్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అనిత, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, నాయకులు చంద్రకు మార్ గౌడ్, దుష్యంత్ రెడ్డి, వినోద్ కుమార్, జహీర్ అఖ్తర్ పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం అందించడమే కాంగ్రెస్ లక్ష్యం



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ అని, ప్రజలకు సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం కల్పించాలనే మహ త్తర లక్ష్యాలతో ఆంగ్లేయ పాలకులపై పోరాటం చేసి స్వాతంత్ర్య భారతదేశాన్ని సాధించిన ఘన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతి థిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన త్యాగాలు అనిర్వచనీయ మని, వారి త్యాగాల ఫలితంగానే నేడు దేశం ప్రజా స్వామ్య విలువలతో ముందుకు సాగుతోందని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ భవన్ నుంచి భారీ ర్యాలీ నిర్వ హించగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సేవాదళ్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



**ప్రజాపక్షం/వంగూర్ :** మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 140వ ఆవిర్భావ దినోత్సవ వేడుక లను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జెండాను మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పురుగుల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గఫూర్, యువజన సంఘం అధ్య క్షులు చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు ఖయ్యూం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యక ర్తలు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/వెల్దండ :** కాంగ్రెస్‌పార్టీతోనే బడుగు బలహీ నవర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంవద్ద పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండా ఎగరవేసి, అనంతరం కేక్ కట్ చేసి పార్టీ ఆవి ర్భావ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్ర మంలో పిసిసి సభ్యులు ఠాకూర్ బాలాజిసింగ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, మట్టవెం కటయ్యగౌడ్, నాయకులు భూపతిరెడ్డి, పర్వత్‌రెడ్డి, పూల్‌సింగ్, ఎర్ర శ్రీను ముదిరాజ్, మట్ట భరత్‌గౌడ్, కడా రిశ్రీనివాస్‌యాదవ్, కృష్ణముదిరాజ్, మండల నాయ కులు , వివిధ గ్రామాల నూతన సర్పంచ్‌లు, ఉపసర్పం చులు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కల్వకుర్తి రూరల్ :** కల్వకుర్తి మండలపరిధి లోని జిల్లెల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ 140 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్య క్రమానికి జిల్లా ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటి, విజిలెన్స్ కమిటి మెంబర్ జిల్లెల రాములు ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రె స్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లెల గ్రామసర్పంచ్ కొమ్మగొని రాజేశ్వరి రవిగౌడ్, ఉపస ర్పంచ్ ఎముకరవి, గ్రామ కమిటీ అధ్యక్షులు ముచ్చర్ల శ్రీకాంత్‌రెడ్డి, హనుమాన్ దేవాలయ వైస్‌చైర్మన్ వీరెడ్డి శ్యామ్ సుందర్‌రెడ్డి, వార్డుసభ్యులు గుమ్మకొండ నాగ మణి మహేందర్, చెన్నమ్మ, ఇందిరమ్మ కమిటి సభ్యులు నాపమల్లయ్య పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/పెబ్బేరు:** జాతీయ కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పెబ్బేరు మండల కేంద్రం లో నిర్వహించగా మార్కెట్ చైర్మన్ గౌని ప్రమోదిని రెడ్డి ముఖ్య అతిథులు హాజరవగా పట్టణ మాజీ అధ్యక్షులు వెంకట్‌రాములు యాదవ్ పార్టీ జెండా ఆవిష్కరణ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నూతన సర్పంచులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినో త్సవ వేడుకలను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు మండల కేంద్రంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిం చారు. వీపనగండ్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు మీసాల పార్వతమ్మ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదల బీరయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల నారాయణరెడ్డి, ఉపసర్పంచు బాలపీర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నక్క విష్ణు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజశేఖర్, నాయకులు రవీందర్‌రెడ్డి, మహేష్ నాయుడు, రజాక్, వెంకట్‌రెడ్డి, ఎస్.వెంక టయ్య, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కొత్తకోట:** కొత్తకోట మండల కేంద్రంలో కొత్తకోట పట్టణ చౌరస్తాలో గాంధీ విగ్రహం దగ్గర కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం పట్టణ అధ్యక్షుడు మేస్త్రి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును మార్చినందున నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ధర్నా కార్యక్ర మంలో ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శులు ఎన్‌జేఓ ఏజ్ పాపయ్య, కృష్ణారెడ్డి, పీజే బాబు, వేముల శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షులు మేస్త్రి శ్రీనివాసులు అధ్యక్షత వహించగా పలువురు నాయకులు నరేందర్ సాగర్, చంద్రశేఖర్ యాదవ్, సాయిలు యాదవ్, శ్రీని వాసులు, సుభాష్, యాదయ్య సాగర్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు కొత్తకాపు శివసేనా రెడ్డి మూడు కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, పీసీసీ సభ్యు లు శంకర్ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, మాజీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ధరలక్ష్మి, మాజీ కౌన్సిలర్ బ్రహ్మంచారి, మాజీ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు మధు గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ నంది మల్ల చంద్రమౌళి పాల్గొన్నారు.



# క్రీడ

## హాకీ ఇండియా లీగ్‌కు వేళాయే




మహిళల హాకీ ఇండియా లీగ్ (2025–26) రెండో సీజన్‌కు కౌంట్ డౌన్ మొదలైంది. మరికొన్ని నిమిషాల్లో రాంచీ వేదికగా ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. అయితే.. తొలి సీజన్ ఛాంపియన్ ఒడిశా వారియర్స్ ఈసారి బరిలోకి దిగడం లేదు. ఈ జట్టు స్థానంలో రాంచీ రాయల్స్ ఆడనుంది. దాంతో.. ఇప్పుడు కూడా నాలుగు జట్లు ట్రోఫీకోసం నువ్వానేనా అన్నట్టు తలపడనున్నాయి. రాంచీ రాయల్స్, ఎస్‌జీ పైపర్స్, జేఎస్ డబ్ల్యూ సూర్మ హాకీ క్లబ్, శ్రచి బెంగాల్ టైగర్స్ జట్లు టైటిల్ వేటకు సిద్ధంగా ఉన్నాయి.
రాంచీ వేదికగా మహిళల హాకీ ఇండియా లీగ్ రెండో సీజన్ రోజు ఆదివారం (డిసెంబర్ 28) రాత్రి 7:30 గంటలకు ప్రారంభం కానుంది. ఆరంభ పోరులో రాంచీ రాయల్స్, ఎస్‌జీ పైపర్స్ జట్లు తలపడనున్నాయి. నాలుగు జట్లు ఒక్కోటి మరో జట్టుతో రెండేసి మ్యాచ్‌లు ఆడుతాయి. అనంతరం టాప్–2 జట్ల మధ్య టైటిల్ పోరు జరుగుతుంది. జనవరి 10న జరిగే ఫైనల్‌తో ఈ టోర్నీ ముగుస్తుంది.

**మ్యాచ్ తేదీలు ఇవే..**

- ✻డిసెంబర్ 28 – రాంచీ రాయల్స్ vs ఎస్‌జీ పైపర్స్, రాత్రి 7:30 గంటలకు రాంచీలో.
- ✻డిసెంబర్ 29 – సూర్మ హాకీ క్లబ్ vs శ్రచి బెంగాల్ టైగర్స్, రాత్రి 7:30 గంటలకు రాంచీలో.
- ✻డిసెంబర్ 30 – రాంచీ రాయల్స్ vs శ్రచి బెంగాల్ టైగర్స్, రాత్రి 7:30 గంటలకు రాంచీలో.
- ✻డిసెంబర్ 31 – ఎస్‌జీ పైపర్స్ v s సూర్మ హాకీ క్లబ్, రాత్రి 7:30 గంటలకు రాంచీలో.
- ✻జనవరి 1 – ఎస్‌జీ పైపర్స్ vs శ్రచి బెంగాల్ టైగర్స్, రాత్రి 7:30 గంటలకు రాంచీలో.
- ✻జనవరి 2 – రాంచీ రాయల్స్ vs సూర్మ హాకీ క్లబ్, రాత్రి 7:30 గంటలకు రాంచీలో.
- ✻జనవరి 3 – సూర్మ హాకీ క్లబ్ vs ఎస్‌జీ పైపర్స్, సాయంత్రం 5:30 గంటలకు రాంచీలో.
- ✻జనవరి 4 – శ్రచి బెంగాల్ టైగర్స్ vs రాంచీ రాయల్స్, సాయంత్రం 4 గంటలకు రాంచీలో.
- ✻జనవరి 5 – సుర్మ హాకీ క్లబ్ vs రాంచీ రాయల్స్, సాయంత్రం 6 గంటలకు రాంచీలో.
- ✻జనవరి 6 –ఎస్‌జీ పైపర్స్ vs శ్రచి బెంగాల్ టైగర్స్, సాయంత్రం 6 గంటలకు రాంచీలో.
- ✻జనవరి 7– శ్రచి బెంగాల్ టైగర్స్vs సుర్మ హాకీ క్లబ్, సాయంత్రం 4 గంటలకు రాంచీలో.
- ✻జనవరి 8 – ఎస్‌జీ పైపర్స్ vs రాంచీ రాయల్స్, సాయంత్రం 6 గంటలకు రాంచీలో.
- ✻జనవరి 10 – ఫైనల్ – రాత్రి 8:15 గంటలకు, రాంచీలో.

## భారత్‌దే నాలుగో టీ20

### శ్రీలంకపై విజయం




నాలుగో టీ20లోనూ శ్రీలంకను భారత మహిళా జట్టు చిత్తు చేసింది. టీమ్ఇండియా నిర్దేశించిన 222 పరుగుల లక్ష్య ఛేదనలో శ్రీలంక 191 పరుగులకే పరిమితమైంది. దీంతో 30 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది. ఇప్పటికే ఐదు టీ20ల సిరీస్‌ను నెగ్గిన భారత్ 40 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.
**ఆరంభంలో దూకుడు..** టీమ్ఇండియా నిర్దేశించిన భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక బ్యాటర్లు దూకుడుగా ఆడారు. తొలి వికెట్‌కు హాసిని పెరీరా (33), చమరి ఆటపట్టు (52) హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నిర్మించారు. తర్వాత హాసిని ఔటైనప్పటికీ.. దులాని (29✻)తో కలిసి ఆటపట్టు ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లింది. హర్షిత (20), నిలాక్షిక సిల్వా (23) పోరాడినా ఓటమి తప్పలేదు. భారత బౌలర్లు కీలక సమయంలో వికెట్లు తీసి జట్టును గెలిపించారు. అరుంధతి 2, వైష్ణవి శర్మ 2, చరణి ఒక వికెట్ తీశారు.
**పోటాపోటీగా..** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు అద్భుతమైన ఆరంభం దక్కింది. ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలీ వర్మ పోటాపోటీగా బౌండరీల వర్షం కురిపించారు. తొలి వికెట్‌కు 162 పరుగులు జోడించారు. ఈ క్రమంలో శతకాలు చేస్తారని భావించినా.. స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరారు. మహిళల క్రికెట్‌లో 10 వేల పరుగులు చేసిన నాలుగో బ్యాటర్‌గా స్మృతి నిలిచింది. మరోవైపు, షెఫాలీ వరుసగా మూడో హాఫ్ సెంచరీని నమోదు చేసింది. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన రిచా ఘోష్ దూకుడుగా ఆడింది. కేవలం 16 బంతుల్లోనే 4 ఫోర్లు, 3 సిక్స్‌ల సాయంతో 40 పరుగులు రాబట్టింది. హర్మన్ ప్రీత్ కౌర్‌తో కలిసి రిచా మూడో వికెట్‌కు 23 బంతుల్లోనే 53 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది.

### టీ20 ప్రపంచ కప్.. పాక్ జట్టు నుంచి సూపర్ స్టార్లు ఔట్

2026 టీ20 ప్రపంచ కప్‌నకు సన్నాహకంగా జనవరి 7 నుంచి శ్రీలంకతో పాక్ మూడు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం పాక్ సీనియర్ సెలక్షన్ కమిటీ 15మందితో జట్టును ప్రకటించింది. ఆస్ట్రేలియాలో జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్‌లో ఆడుతున్న స్టార్ ఆటగాళ్లు బాబర్ అజామ్, షాహీన్ అఫ్రిది, హారిస్ రవూఫ్, మహ్మద్ రిజ్వాన్‌లను లంకతో సిరీస్‌కు ఎంపిక చేయలేదు. అన్‌క్యాప్‌డ్ వికెట్ కీపర్ ఖవాజా నఫేను తొలిసారి జాతీయ జట్టులోకి తీసుకున్నారు. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన నఫే ఇటీవల పాకిస్థాన్ షహీన్స్ జట్టులో భాగమయ్యాడు. ఈ కుర్రాడు ఇప్పటి వరకు 32 టీ20లు ఆడి 132.81 స్ట్రైక్‌రేట్‌తో 688 పరుగులు చేశాడు. ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్ తిరిగి టీ20 జట్టులోకి వచ్చాడు. సల్మాన్ అఘా కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. శ్రీలంకతో టీ20 సిరీస్ ఆడే జట్టు ప్రదర్శన ఆధారంగా ప్రపంచ కప్‌నకు పాకిస్థాన్ టీమ్‌ను ఖరారు చేసుకునేందుకు అవకాశం దొరుకుతుంది. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభంకానున్న టీ20 ప్రపంచ కప్‌లో గ్రూప్ బిలో భారత్, పాక్, నమీబియా, నెదర్లాండ్స్, యూఎస్ఏ ఉన్నాయి. పాకిస్థాన్ మ్యాచ్‌లు కొలంబోలో జరుగుతాయి.
**శ్రీలంకతో సిరీస్‌కు పాక్ జట్టు:** సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్దుల్ సమద్, అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్, ఫకార్ జమాన్, ఖవాజా నఫే, మహ్మద్ నవాజ్, మహ్మద్ సల్మాన్ మీర్జా, మహ్మద్ వసీం జూనియర్, నసీమ్ షా, సాహిబ్‌జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఉస్మాన్ తరీక్.

# ఫోకస్

## ఆరోగ్యం – ఇయర్ ఎండర్




### ఎఐ సేవలు



ఆరోగ్య సేవలలో కృత్రిమ మేధస్సు (ఎఐ), ఆధునిక టెక్నాలజీ వినియోగం ఇటీవలి కాలంలో వేగంగా పెరిగింది. ఎఐ ఆధారిత వ్యవస్థలు రోగ లక్షణాలను త్వరగా విశ్లేషించి వ్యాధులను ముందుగానే గుర్తించడంలో వైద్యులకు సహాయపడుతున్నాయి. ఎక్స్‌రే, స్కాన్‌లు, రక్త పరీక్షల వంటి నివేదికలను ఎఐ వేగంగా చదివి ఖచ్చితమైన నిర్ధారణకు దోహదపడుతుంది. టెలిమెడిసిన్, డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా దూర ప్రాంతాల ప్రజలకు కూడా వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే రోగి ఆరోగ్య డేటాను విశ్లేషించి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స సూచించే విధానాలు అభివృద్ధి చెందుతున్నాయి. మొత్తం మీద ఎఐ మరియు టెక్నాలజీ ఆరోగ్య సేవలను మరింత వేగవంతం, ఖచ్చితమైనవి మరియు అందరికీ చేరువయ్యేలా చేస్తున్నాయి.

### మెడిసిన్ అండ్ జెనోమిక్స్

మెడిసిన్ అండ్ జెనోమిక్స్ అనేది అధునాతన వైద్యశాస్త్రం. మనుషుల జన్యువుల (డిఎన్ఎ) అధ్యయనాన్ని కలిపి ఉపయోగించే ఆధునిక రంగం. ప్రతి వ్యక్తి జన్యువుల నిర్మాణం భిన్నంగా ఉండడం వల్ల, ఒకే వ్యాధి ఉన్నా చికిత్స ప్రభావం వ్యక్తివ్యక్తికి మారుతుంది. జెనోమిక్స్ సహాయంతో రోగి జన్యు సమాచారాన్ని విశ్లేషించి, అతనికి ఏ మందులు సరిపోతాయో, ఏ చికిత్స ఎక్కువ ప్రయోజనం ఇస్తుందో ముందుగానే నిర్ణయించవచ్చు. ముఖ్యంగా కేన్సర్, గుండె జబ్బులు, అరుదైన జన్యు వ్యాధుల చికిత్సలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. అలాగే కొన్ని వ్యాధులు భవిష్యత్తులో వచ్చే అవకాశాన్ని ముందే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవడానికి కూడా జెనోమిక్స్ ఉపయోగపడుతుంది. మొత్తంగా మెడిసిన్ అండ్ జెనోమిక్స్ వైద్యాన్ని సాధారణ చికిత్స నుంచి వ్యక్తిగత, ఖచ్చితమైన చికిత్స దిశగా తీసుకెళ్తున్నాయి.



### మహమ్మారి వ్యాధులపై మరింత అవగాహన



మహమ్మారి వ్యాధులు అనేవి ఒక దేశం లేదా ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తరించి పెద్ద సంఖ్యలో ప్రజలను ప్రభావితం చేసే అంటువ్యాధులు. కోవిడ్–19 వంటి అనుభవాల వల్ల మహమ్మారి నివారణ, చికిత్స ఎంత కీలకమో ప్రపంచం స్పష్టంగా గ్రహించింది. ఈ వ్యాధులపై సమర్థవంతమైన పోరాటం ముందస్తు నివారణతోనే ప్రారంభమవుతుంది. టీకాలు మహమ్మారి వ్యాధుల నివారణలో అత్యంత ముఖ్యమైన సాధనం. టీకాలు శరీరానికి ముందే రోగనిరోధక శక్తిని అందించి వ్యాధి తీవ్రతను తగ్గిస్తాయి లేదా పూర్తిగా నివారిస్తాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు టీకాలు తీసుకుంటే సామూహిక రోగనిరోధక శక్తి ఏర్పడి వ్యాధి వ్యాప్తి తీవ్రత తగ్గుతుంది లేదా ఆగిపోతుంది. మహమ్మారులను నియంత్రించడంలో ముందస్తు గుర్తింపు కీలక పాత్ర పోషిస్తుంది. కొత్త వైరస్ లేదా బాక్టీరియా ఉద్భవించిన వెంటనే దానిని గుర్తించి, దాని స్వభావాన్ని అధ్యయనం చేయడం వల్ల వ్యాప్తిని అడ్డుకోవచ్చు. ఇందుకోసం ప్రయోగశాల పరీక్షలు, జెనోమ్ సీక్వెన్సింగ్, డిజిటల్ నిఘా వ్యవస్థలను ఉపయోగించుకుంటున్నారు. ప్రజా ఆరోగ్య చర్యలు కూడా నివారణలో ముఖ్యమైనవి. చేతులు శుభ్రంగా కడగడం, మాస్క్ ధరించడం, పరిశుభ్రత పాటించడం, శుభ్రమైన నీరు మరియు పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు మహమ్మారి వ్యాప్తిని గణనీయంగా తగ్గిస్తాయి. అలాగే మహమ్మారి దేశాల సరిహద్దులను గుర్తించదని తెలిసిన కారణంగా అంతర్జాతీయ సహకారం అవసరం. దేశాల మధ్య సమాచారం పంచుకోవడం, చికిత్సా మార్గదర్శకాలను సమన్వయం చేయడం, టీకాలు, మందులను సమానంగా అందించడం వల్ల ప్రపంచ స్థాయిలో మహమ్మారులను నియంత్రించవచ్చు. మహమ్మారి వ్యాధులు సోకిన తర్వాత సరైన చికిత్స ఎంతో అవసరం. వైరస్‌ల వల్ల వచ్చే వ్యాధులకు యాంటీవైరల్ మందులు, బాక్టీరియా వల్ల కలిగే వ్యాధులకు యాంటీబయోటిక్స్ ఉపయోగిస్తారు. అయితే అవసరం లేకుండా మందులను వాడటం వల్ల ఔషధ నిరోధకత పెరిగే ప్రమాదం ఉంటుంది. తీవ్రమైన సందర్భాల్లో రోగికి ఆక్సిజన్ సరఫరా, ద్రవాలు, జ్వరం మరియు నొప్పి నియంత్రణ వంటి సహాయక చికిత్సలు ప్రాణాలను కాపాడతాయి. కొవిడ్ 19 మహమ్మారి సమయంలో ఈ సహాయక చికిత్సలు ఎంత ముఖ్యమో స్పష్టమైంది. ఇటీవలి కాలంలో మహమ్మారి చికిత్సలో ఆధునిక సాంకేతికతలు ప్రవేశించాయి. మోనోక్లోనల్ యాంటీబాడీలు, జెనోమ్ ఆధారిత మందులు, కృత్రిమ మేధస్సు సహాయంతో వేగవంతమైన నిర్ధారణ వంటి పద్ధతులు చికిత్సను మరింత ప్రభావవంతంగా మారుస్తున్నాయి. అదే సమయంలో మహమ్మారులు ప్రజల మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయి. భయం, ఒత్తిడి, ఒంటరితనం వంటి సమస్యలను ఎదుర్కొనడానికి మానసిక ఆరోగ్య సహాయం, కౌన్సెలింగ్ మరియు సామాజిక మద్దతు అవసరం. భారతదేశంలో మహమ్మారి నివారణ, చికిత్సకు ప్రభుత్వం పెద్ద స్థాయిలో చర్యలు చేపట్టింది. దేశీయంగా టీకాలు మరియు మందుల ఉత్పత్తి, విస్తృత టీకాకరణ కార్యక్రమాలు, డిజిటల్ హెల్త్ వ్యవస్థలు మరియు టెలిమెడిసిన్ సేవలు ప్రజలకు వైద్యం చేరువ చేశాయి. ఆయుష్, ఆధునిక వైద్య విధానాల సమన్వయం కూడా ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ఒక భాగంగా మారింది. మొత్తం మీద మహమ్మారి వ్యాధుల విషయంలో నివారణే ఉత్తమ మార్గం. శాస్త్రీయ అవగాహన, ప్రజల బాధ్యతాయుత ప్రవర్తన మరియు ప్రభుత్వాల సమన్వయ చర్యల ద్వారానే మహమ్మారులను సమర్థవంతంగా ఎదుర్కొనడం సాధ్యమవుతుంది.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి


## సింగరేణి భవన్‌లో ఐఎన్‌టియుసి సమావేశాలు దుర్మార్గం

### ఎఐటియుసి కార్మిక సంఘాల ధ్వజం




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి భవన్‌లో ఐఎన్‌టియుసి యూనియన్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం దుర్మార్గమైన చర్య అని, సమావేశం ఏర్పాటుకు సింగరేణి భవన్‌ను అనుమతి ఇచ్చిన అధికారులపై యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఎఐటియుసి సమావేశంలో వారు మాట్లాడుతూ 135 ఏండ్ల సింగరేణి చరిత్రలో ఏ యూనియన్ సింగరేణి భవన్‌లో సమావేశాలు పెట్టిన సందర్భాలు లేవన్నారు. కార్మికుల సమస్యలపై సమీక్ష నిర్వహించేందుకు సింగరేణి భవన్‌లో జరిగిన ఐఎన్‌టియుసి కార్యకర్తల సమావేశంలో సిఎండి కుర్చీలో జనక్ ప్రసాద్ కూర్చొని సమీక్ష నిర్వహించడాన్ని సింగరేణి కంపెనీని, కార్మికులను మరియు సిఎండిని అగౌరవపర్చడమేనని వారు పేర్కొన్నారు. ఐఎన్‌టియుసి సమావేశం కొరకు సింగరేణి భవన్ ను అనుమతి ఇచ్చిన అధికారులపై యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, అర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను,ఉపాధ్యక్షులు మాదన మహేష్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎ గౌస్, నాయకులు బోగ సతీష్ బాబు, దొంత సాయన్న, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్, బలుసు రవి, చెప్యాల భాస్కర్, నాయిని శంకర్, గుర్రం ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సాయిఆజాద్, ప్రీతం




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా నాలుగో మహాసభలను పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఈనెల 23,24,25 తేదీలలో ఆర్నకొండ సాయి ఆజాద్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ మహాసభలకు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్ హాజరై అనేక విషయాలపై ప్రసంగించారు. మహాసభలలో పలు తీర్మానాలను చేశారు. పెద్దపల్లి జిల్లాకు న్యాయవిద్య కళాశాల, ప్రభుత్వ డిప్లమా (మైనింగ్), ఇంజనీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల, నవోదయ పాఠశాల ను కేటాయించడంతోపాటు సిబిఎస్‌ఇ పాఠశాలలను స్థాపించాలనీ తీర్మానాలు చేశారు. అవి సాధించేంతవరకు ఏఐఎస్‌ఎఫ్‌గా పోరాటం చేస్తామని నిర్ణయం తీసుకోవడం జరిగిందనీ ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు తెలిపారు. మహాసభల ముగింపు రోజు జిల్లాకు నూతన ఎఐఎస్‌ఎఫ్ కమిటీని రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రకటించాడు. కమిటీలో 23మంది కౌన్సిల్ సభ్యులను, 9మంది కార్యవర్గం సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఆర్నకొండ సాయిఆజాద్, ప్రధాన కార్యదర్శిగా రేణుకుంట్ల ప్రీతం, ఉపాధ్యక్షులుగా మొలుగూరి నితిలేష్, పల్లె హర్ష, మంథని యశ్వంత్, సహాయకార్యదర్శులుగా ఎల్కపల్లి సురేష్, గుండ్ల లక్ష్మీ ప్రసన్న, శ్రీవర్ధన్, కోశాధికారిగా కల్వల శ్రీకాంత్, స్టాలిన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందనీ ఎఐఎస్‌ఎఫ్ నాయకులు తెలిపారు.

## జనసేవాదళ్‌తో నాయకత్వ లక్షణాలు

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** జనసేవాదళ్‌తో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, రాజకీయ సైదాంతిక శిక్షణతో పాటు జీవిత భరోసాకు దిక్సూచి జనసేవాదళ్ అని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్ రావు అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఓ వెంచర్‌లో జనసేవాదళ్ మూడవ దశ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. తొలుత అరుణ పతాకాన్ని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాగం మాట్లాడుతూ జనసేవాదళ్ శిక్షణతో సమాజానికి సేవ చేయాలనే భావన బలపడుతుందన్నారు. బృందాన్ని నడిపించే బాధ్యత వస్తుందన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రయోజనకర నిర్ణయాలు తీసుకోవడంలో దృఢ సంకల్పం కలుగుతుందన్నారు. జీవిత ఎదుగుదలకు సోపానాలైన క్రమశిక్షణ, సమయపాలన, నియమాలు పాటించడం సమయానికి పనిచేయడం అలవాటు అవుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాలు, రక్తదానం సహాయక చర్యలలో ఎలా స్పందించాలో తెలుస్తుందన్నారు. శారీరక మానసిక బలం, వ్యాయామాలు, ఆటలు, ఆరోగ్యం మెరుగువుతుందన్నారు. సమాజంపై అవగాహణ ప్రజా సమస్యలు హక్కులు, బాధ్యతలపై అవగాహణ కలుగుతుందన్నారు. ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు మాట్లాడే నైపుణ్యం ప్రజల ముందు చర్చించే ధైర్యం వస్తుందన్నారు. అలాగే మంచి పౌరులుగా మారే అవకాశం దేశభక్తి సామాజిక బాధ్యత పెరుగుతుందన్నారు. జనసేవాదళ్ శిక్షణ శిబిరం వ్యక్తిని క్రమశిక్షణ గల సేవల భావంతో కూడిన మంచి పౌరుడిగా తయారు చేస్తుందన్నారు. యువత పాలకవర్గాల తీరుతో నైరాశ్యానికి గురవుతుందన్నారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనలో పాలకులు విఫలం కావడంతో యువశక్తి నిర్వీర్యమవుతుందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో యువత చైన్యవంతమైన ఆలోచనలతో రాజకీయాల్లోకి రావాలని వామపక్ష ప్రజాతంత్ర, లౌకిక శక్తులకు మద్దతుగా నిలవాల్సి ఉందన్నారు. పాలకులు కర్మ సిద్ధాంతాన్ని బోధిస్తూ యువత ను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సుదీర్ఘ కాలం పోరాటాలతో అనేక హక్కులను, సంక్షేమ పథకాలను సాధించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను జనవరి 18న ఖమ్మంలో జరగనున్నాయన్నారు. ఈ సందర్భంగా 5వేల మంది యువకులకు జన సేవాదళ్ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేస్తూ సమస్యలపై జరిగే పోరాటాలకు సంబంధించి కార్యోన్ముఖులను చేయడమే లక్ష్యంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల ఐలయ్య ఇన్స్పెక్టర్‌గా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, ఐఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, సిపిఐ జిల్లా నాయకులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, దండి రంగారావు, వెన్నం భాస్కర్, మున్సిపాలిటీ సిపిఐ డివిజన్ సెక్రటరీలు వెంపటి రాము, లగిశెట్టి రమేష్, బియ్యాల రాజు, యువజన సంఘం సభ్యులు గణపారపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాదులకు వ్యతిరేకంగా యువత పోరాటం

### సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మౌలానా

**ప్రజాపక్షం/ఖమ్మం :** మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా నేటి యువత పోరాటాలు చేయాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. సిపిఐ ఖమ్మం రూరల్ మండల సమితి సమావేశం ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మౌలానా మాట్లాడుతూ నాటి స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, ఆ తర్వాత స్వతంత్ర భారతదేశంలోనూ అనేక నిర్బంధాలను ఎదుర్కొని అనేక త్యాగాలు చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, ఏ రాజకీయ పార్టీకి లేని గొప్ప చారిత్రిక పోరాట నేపథ్యం సిపిఐకి ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది అమరులయ్యారని ఆ పోరాటం తెలంగాణ ప్రజల జీవనగతిని మార్చివేసిందన్నారు. నేటి యువతకు గత పోరాట నేపథ్యాన్ని వివరించి మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు కార్యోన్ముఖులను చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ జనవరి 18న జరిగే సిపిఐ శతవసంతాల సభకు భారీ జనసమీకరణ చేయాలని కోరారు. సమావేశం సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, కమలాకర్, ఉన్నం రంగారావు తదితరులు పాల్గొన్నారు.




## సిపిఐది నిత్యజ్వలిత పోరాటాల చరిత్ర

### పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** నాటి నుంచి నేటి వరకు నిత్యజ్వలిత పోరాటాల చరిత్ర గల పార్టీ సిపిఐ అని పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసి జైలు జీవితాలు గడిపి చిత్రహింసలకు గురై పోరాడిన పార్టీ సిపిఐ అన్నారు. అనేక ప్రజాసంఘాలు నిర్మించి వారి హక్కుల సాధన కోసం అగ్రభాగాన ప్రజాఉద్యమాలు నిర్వహించి పోరాడిన ఘనమైన చరిత్ర సిపిఐది అని గుర్తు చేశారు. నిజాం నిరంకుశ పాలనను అంతమొందించి, దొరలను దోపిడీదారుల గడీలను కూల్చి, భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి 4500మంది ప్రాణాలు అర్పించి, 10లక్షల ఎకరాల భూములు పంచి, 3000 గ్రామాలను విముక్తి చేసి గ్రామ స్వరాజ్యం స్థాపించిన పార్టీ సిపిఐ అని కొనియాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీర్యాలీ, బహిరంగ సభ విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 30న సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం సూర్యాపేటలోని కిరాణ అండ్ ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్‌లో జరుగుతుందని, సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ నుండి విజయం సాధించిన ఆరుగురు సర్పంచ్‌లు, ఇద్దరు ఉపసర్పంచ్‌లు, 40 మంది వార్డు సభ్యులను సమావేశంలో సన్మానించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, నాయకులు చామల అశోక్ కుమార్, పెంద్ర కృష్ణ, దేశగాని హేమలత, విజయ్‌కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




## వార్డులు కావవి.. డంపింగ్ యార్డులు




### ఇంటింటికీ సిపిఐ పాదయాత్రలో గోదా శ్రీరాములు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట మున్సిపల్‌లో వార్డులు డంపింగ్ యార్డులా దర్శనమిస్తున్నాయని, అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలోని వార్డుల పరిస్థితి మరి అధ్వానంగా తయారయ్యాయని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోదా శ్రీరాములు విమర్శించారు. ఇంటింటికీ సిపిఐ' పాదయాత్రలో భాగంగా ఆదివారం మూడవరోజు 9,10,11,12 వార్డులలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని ఖాళీ ప్లాట్లల్లో, లోటస్ టెంపుల్ ఏరియాలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. మురుగు కాల్వల్లో చెత్త చెదారం పేరుకుపోయి ఈగలు, దోమలతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అమృత్ 2.0 పథకం కింద పట్టణంలోని సీసీ రోడ్లను తవ్వి వదిలేయడంతో గల్లీలలో ప్రజలు నడవలేని దుస్థితి నెలకొందన్నారు. తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చి అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలన్నారు. 29న సోమవారం మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టి మూడు రోజుల పాదయాత్రలో గుర్తించిన సమస్యల పరిష్కారించేందుకు ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, సిపిఐ జిల్లా నాయకులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు పాటుపడాలి



**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, వార్డు సభ్యులు కృషి చేయాలని మాజీ జడ్‌పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ బి.కవిత కరుణాకర్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని సన్మానించారు. ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి మొదటి పౌరుడైన సర్పంచ్ అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేయాలన్నారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిలబెట్టుకోవాల్సిన బాధ్యత సర్పంచ్‌లపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ శతాబ్ది ఉత్సవాలు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** త్యాగధనుల కృషితో 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న భారత కమ్యూనిస్ట్ పార్టీ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. ఆదివారం కొత్తపేట డివిజన్‌లోని మోహన్‌నగర్, ప్రజానివాస్ ఎక్స్‌లో నాయకులు ఉడతల మల్లేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బొడ్డుపల్లి చికయ్య, ఎల్‌బినగర్ జోన్ మున్సిపల్ అండ్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎం.మద్దిలేటి లతో కలిసి కృష్ణ ముఖ్యఅతిథులుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చెరుకు ఈశ్వర్, జంగయ్య, సంతోష్, బాలమణి, లక్ష్మీ, బ్రహ్మం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలోనే పల్లెసీమలు అభివృద్ధి : ఎమ్మెల్యే శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఇందిరమ్మ రాజ్యంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధిస్తాయనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఆదివారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని తూంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచినా..ఓడినా పంచాయతీల అభివృద్ధికి మొదటి ప్రాధాన్య ఇవ్వడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, సర్పంచులు జాకారం చంద్రశేఖర్, శ్వేతా చంద్రబాబుగౌడ్, పావని శివమౌళి, నీలయ్య, జంగయ్య, నరసింహులు, కుమార్, చందునాయక్, సునీత రాములు, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి బాల్‌రాజ్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మున్నూరు కాపు సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. పట్టణంలోని సాయిరాజా పంక్షన్ హాల్‌లో అధ్యక్షుడు మేడగ పెంటయ్య, గౌరవ అధ్యక్షుడు సాయికృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మున్నూరు కాపు నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్నూరు సంఘం నేతలు ఇస్నాతి శ్రీనివాస్, మురళి, శ్రీశైలంచ దామోదర్, రమేష్, మార్కెట్ కమిటి డైరెక్టర్ కరుణాకర్, దివాకర్‌తోపాటు నూతన సర్పంచులు పాల్గొన్నారు.


## ప్రజాసేవలో ముందుండాలి

లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బూడిద నందారెడ్డి




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచుగా, ఉపసర్పంచుగా, వార్డు సభ్యులుగా గెలుపొందిన ఆటో నగర్ ఇసుక లారీల యజమానుల సంఘం నాయకులను తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బూడిద నందారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులకు, ఉపసర్పంచులకు, వార్డు సభ్యులకు ఘనంగా ఆదివారం వారి కార్యాలయంలో శాలువతో సత్కిరించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గం సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని అల్లందేవి చెరువు గ్రామ పంచాయితీ సర్పంచిగా గెలుపొందిన ఆటో నగర్ ఇసుక లారీ యజమానుల సంఘం అధ్యక్షులు సుర్వి సౌజన్య రాజు గౌడ్, చిట్యాల మండలం సుంకెనపల్లి గ్రామ ఉపసర్పంచ్‌గా ఎన్నికైన కొసనం శేఖర్‌రెడ్డి, అల్లందేవిచెరువు, సుంకనపల్లి, ఏపూరు, కాట్రేవ్ గ్రామాలలో వార్డు సభ్యులుగా గెలుపొందిన వంటల సువర్ణ, గణేష్ యాదవ్, గుండు లింగస్వామి, గౌడ్, బల్లూరి వెంకటేష్ గౌడ్, బాతరాజు లిగమయ్య, అంతటి జ్యోతి నరేష్ గౌడ్, బచ్చ రాజేందర్‌లను సన్మానం చేశారు. హయత్ నగర్ లోని సూర్య నగర్ కాలనీ అధ్యక్షులుగా ఎన్నికైన ఆకుల శ్రీను శాలువతో సన్మానం చేశారు. సర్పంచ్‌గా గెలుపొందిన వారికి 20వేలు, ఉపసర్పంచ్‌గా గెలుపొందిన వారికి 10వేలు, వార్డు సభ్యులుగా గెలుపొందిన వారికి 5వేలు చొప్పున నగదును నందారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఆటో నగర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లగ్గోని అంజయ్య గౌడ్, కొండే శ్రీశైలం, కురుమ, లగ్గొని శ్రీనివాస్ గౌడ్, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సాయితేజరెడ్డి, నాగేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు


## పేదల సంక్షేమం కోసం పాటుపడిన కార్మిక నేత పిజెఆర్




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పేదల సంక్షేమం కోసం పాటు పడిన కార్మిక నేత పిజెఆర్ అని షాద్‌నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య అన్నారు. ఆదివారం షాద్‌నగర్‌లో మాజీ సిఎల్పీ నేత పి.జనార్థన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ పేద వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానేత, పేదల పెన్నిది కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నేత, యువత నాయకత్వానికి ఆదర్శ నాయుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. పి.జనార్ధన్‌రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ చైర్మన్ విశ్వం, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మధన్‌మోహన్‌రెడ్డి, నేతలు నాగిళ్ళ గోపాల్ గుప్తా, చెంది తిరుపతిరెడ్డి, బస్వం, మసూద్‌ఖాన్, దంగు శ్రీనివాస్, మహ్మద్ ఇబ్రహీం, రాజేందర్‌రెడ్డి, పెంటయ్య, నీరటి వాసు, సత్తయ్య, జాంగారి రవి, జమల్‌పూర్ చందులాల్‌తోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం లక్ష్యంగా పనిచేయాలి

సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా నూతన సర్పంచ్‌లు పనిచేయాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని కెఎల్ సిసి కన్వెన్షన్ హాల్‌లో రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, వికారాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షుడు దారా సింగ్‌ల ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నూతన సర్పంచ్‌లను మంత్రి శ్రీధర్‌బాబు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా పనిచేయాలని, ప్రజలు అప్పగించిన బాధ్యతను నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహించాలని సర్పంచ్‌లకు సూచించారు. గ్రామ స్వయంప్రతిపత్తికి పెద్దపీట వేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేస్తోందన్నారు. గ్రామ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రజలతో మమేకమై గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమం స్థానిక ప్రజాప్రతినిధులలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, గ్రామాభివృద్ధి దిశగా అందరూ కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నాయకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లను ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్చార్జిల ఆధ్వర్యంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు సత్కరించిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రకాష్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, కాలే యాదయ్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బోర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మల్ రెడ్డి రాంరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సత్యనారాయణ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జ్ బొంతు రామ్మోహన్, కాంటెస్టెడ్ ఎమ్మెల్యేలు కిచ్చన్న లక్ష్మారెడ్డి, భీమ్ భరత్ , రాష్ట్ర స్పోక్స్‌పర్సన్ గౌరీ సతీష్‌కుమార్, గ్రంథాలయ కమిటీ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ ఉత్తర్వులు బేఖాతరు!

జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ సస్పెన్షన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి)లో బదిలీ ఉత్తర్వులను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారిపై కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కఠిన చర్యలు తీసుకున్నారు. కవాడిగూడ (సర్కిల్40) డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన వి. శ్రీనివాస్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిహెచ్‌ఎంసిని ఇటీవల 60 సర్కిళ్లుగా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో, లా న్యాయ శాఖ నుండి డెప్యుటేషన్‌పై వచ్చిన శ్రీనివాస్ రెడ్డిని సర్కిల్40 (కవాడిగూడ) డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఈ నెల 28 ఉత్తర్వులు వెలువడ్డాయి. నిబంధనల ప్రకారం ఆయన తక్షణమే విధుల్లో చేరాల్సి ఉంది. బదిలీ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, శ్రీనివాస్ రెడ్డి ఇప్పటి వరకు తన కొత్త బాధ్యతలను స్వీకరించలేదు. పై అధికారుల ఆదేశాలను పాటించకపోవడం, విధులకు గైర్హాజరు కావడాన్ని 'డ్యూటీ పట్ల నిర్లక్ష్యం'గా కమిషనర్ పరిగణించారు. తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సిసి, ఎ) రూల్స్, 1991 ప్రకారం ఆయనపై క్రమశిక్షణా చర్యలు చేపడుతూ, విచారణ పెండింగ్‌లో ఉన్నందున సస్పెన్షన్ విధిస్తున్నట్లు ప్రకటించారు. సస్పెన్షన్ కాలంలో శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్‌లోనే ఉండాలని, అధికారుల ముందస్తు అనుమతి లేకుండా నగరాన్ని విడిచి వెళ్లకూడదని కమిషనర్ ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఆయనకు సబ్సిస్టెన్స్ అలవెన్స్ (జీవన భృతి) అందుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల ప్రతిని సంబంధిత న్యాయ శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు పంపించారు.

## టిడిపి నేత సాయిబాబా మృతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పిన్నమనేని సాయిబాబా శనివారం రాత్రి మృతిచెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. సాయిబాబా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు.

**సంతాపం తెలిపిన నేతలు...**సాయిబాబా మృతి పట్ల ఎమ్మెల్సీ ఎల్.రమణ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్, బక్కని నర్సింహులు, పార్టీ నాయకులు పడి గోపాల్ రెడ్డి, రాష్ట్ర ఎస్‌సి సెల్ మాజీ అధ్యక్షులు పోలంపల్లి అశోక్ కుమార్, బిసి సెల్ మాజీ అధ్యక్షులు శ్రీపతి సతీష్, నాయకులు రవీంద్ర చారి, నాగు నగేష్, సాంబశివరావు, నల్లెల్ల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఆనంద్, సికింద్రాబాద్ పార్లమెంట్ మాజీ మహిళా అధ్యక్షురాలు విజయశ్రీ, శివ, తదితరులు ఆయన మృతదేహంపై పూలమాలలు వేసిన నివాళులర్పించారు. సాయిబాబా మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. దోమల్‌గూడలోని నగర పార్టీ కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కటాక్షంతో రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని బిఆర్‌ఎస్ గోషామహల్ నేత ఎం. ఆనంద్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో సాయన్న ఆహ్వానం మేరకు ఆయన నివాసంలో నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆనంద్ కుమార్‌గౌడ్ దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కల్యాణ మహోత్సవం భక్తుల మనసుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపిందన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన దొంతాన్‌పల్లి సర్పంచ్

**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** మండల పరిధిలోని దొంతాన్ పల్లి బిఆర్‌ఎస్ నాయకులు, గ్రామ సర్పంచ్ అబ్దుల్ అజిత్ మహమ్మద్ చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సర్పంచ్ తో పాటు గ్రామ ఉపసర్పంచ్ బాసుపల్లి బాలకృష్ణ, వారితోపాటు వార్డు సభ్యులు ప్రభాకర్,అనిల్ గౌడ్, డేవిడ్, చిట్టి రాజు, గీతా శ్రీనివాస్ వారి అనుచరులు పదిమంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే గారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో..
# 60 మంది డిఇల బదిలీలు

నగర పరిశుభ్రత మరింత మెరుగుపరిచేందుకు నిర్ణయం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగర విస్తరణ నేపథ్యంలో ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎస్‌డబ్ల్యూఎం) విభాగంలో పనిచేస్తున్న 60 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను బదిలీ చేస్తూ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్ – మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 27 మున్సిపాలిటీలను జిహెచ్‌ఎంసిలో ఇటీవల ప్రభుత్వం విలీనం చేయడంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధి పెరిగింది. దీనితో నగర జనాభా, నివాస ప్రాంతాలు, చెత్త ఉత్పత్తి పరిమాణం కూడా భారీగా పెరిగాయి. ఈ మార్పులను దృష్టిలో పెట్టుకుని జిహెచ్‌ఎంసి పరిపాలనా సౌలభ్యం కోసం పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. విస్తరించిన గ్రేటర్ హైదరాబాద్‌ను 12 జోన్‌లు, 60 సర్కిల్స్‌గా విభజించి, ప్రతి సర్కిల్‌లో చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులు సమర్థవంతంగా జరిగేలా ప్రత్యేక బాధ్యతలతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను నియమించింది. ఈ క్రమంలోనే 60 మంది డిఈలను వివిధ సర్కిల్స్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్.బి. నగర్, శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికిందరాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లలోని వివిధ సర్కిల్స్‌కు ఈ ఇంజనీర్లను నియమించారు. ముఖ్యంగా కొత్తగా జిహెచ్‌ఎంసిలో విలీనమైన మున్సిపాలిటీల్లో చెత్త సేకరణలో ఉన్న లోపాలను సరిదిద్దడమే ఈ బదిలీల ప్రధాన లక్ష్యంగా వెల్లడించారు. బదిలీ అయిన ఇంజనీర్లు వెంటనే తమ కొత్త పోస్టింగ్‌లలో బాధ్యతలు స్వీకరించాలని కమిషనర్ కర్ణన్ ఆదేశించారు. ఈ ప్రక్రియ సాఫీగా సాగేందుకు సంబంధిత సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పూర్తి సహకారం అందించాలని సూచించారు. చెత్త సేకరణ పనుల్లో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం కొనసాగించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ బదిలీలతో నగరంలో చెత్త సేకరణ వ్యవస్థ మరింత క్రమబద్ధంగా మారుతుందని, శివారు ప్రాంతాల్లో ఉన్న పరిశుభ్రత సమస్యలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రజారోగ్యం, నగర స్వచ్ఛత దృష్ట్యా ఈ నిర్ణయం కీలకంగా మారనుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఐక్యమత్యంతో బిసిలకు రాజ్యాధికారం




**ప్రజాపక్షం/హయత్‌నగర్:** ఐకమత్యంతోనే బిసి లకు రాజ్యాధికారం సాధ్యమని పలువురు బిసి జాతీయ నేతలు తెలిపారు. ఆదివారం హైదరాబాదు వనస్థలిపురం ఆటోనగర్‌లోని అనన్య ఎకో రిసార్ట్స్‌లో బిసి జనభోజన మహోత్సవం పెద్ద ఎత్తున జరిగింది. ఈ బిసిల జనబోధనాల మహోత్సవానికి రాజ్యసభ సభ్యుడు ఆర్,కృష్ణయ్య, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్ మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రాష్ట్రంలో బిసి జన భోజన కార్యక్రమం బిసిల రాజ్యాధికారానికి దారులు వేస్తుందన్నారు. గతంలో బిసి ఉద్యమా లు తెలంగాణలో బలంగా నిర్వహించామని, భవిష్యత్తులో బిసి ఉద్యమాలు మరింత బలోపేతం చేస్తామన్నారు. బిసి జన భోజన కార్యక్రమం భవిష్యత్తులో మరింత ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జన భోజన నిర్వహణ కమిటీ సలహాదారులు ఈశ్వరమ్మయాదవ్, గౌరవ సలహాదారులు కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, కూరెళ్ళ వేములయ్యగౌడ్, కమిటీ సభ్యులు బొమ్మ రఘురాం నేత, చామకూర రాజు, కెవి.గౌడ్, విశ్వనాథ పుష్పగిరి ఉమా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ పల్లి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా సురేందర్‌గౌడ్



**ప్రజాపక్షం/శంకర్ పల్లి :** శంకర్ పల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులుగా మండలంలోని పరివేద గ్రామ సర్పంచ్ ఏ. సురేందర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఈ ఎన్నిక జరిగింది. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు సురేందర్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సురేందర్ గౌడ్ మాట్లాడుతూ ఆయా గ్రామాల సర్పంచుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధికై కృషి చేయాలని చెప్పారు. అభివృద్ధి పనులలో ఏమైనా ఆటంకాలు ఏర్పడితే వాటిని పరిష్కరించడానికి తన వంతు సహాయాన్ని అందిస్తానని అన్నారు. తనను సర్పంచుల సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళలు, యువత సంక్షేమమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి





**ప్రజాపక్షం/హయత్ నగర్ :** పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం అని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎల్.బి నగర్ నియోజకవర్గం వీరన్నగుట్టలో జాతీయ కాంగ్రెస్ పార్టీ అవిర్భావ దినోత్సవం సందర్భంగా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జక్కిడి శివ చరణ్ రెడ్డి పాల్గొని కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన చారిత్రక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు, కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కళ్లెం నర్సింహా రెడ్డి, ఎర్ర మహేందర్, కోలన్ సుధాకర్ గారు, సుక్క వెంకట్, నగేష్, కళ్లెం సుజాతరెడ్డి, ధనలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

**షాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్టం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి అన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అతి పెద్ద పార్టీ గా అవతరించిన కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజా సేవకు అంకితం అయిందన్నారు. నిరుపేదలకు అండగా ప్రజలకు సేవలందిస్తున్న ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానికి సాధ్యం అయిందన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, సర్పంచ్‌లు గుండాల అశోక్, రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, స్వరూప, శాంతమ్మ, లావణ్య, పావని, మంగమ్మ, ఉప సర్పంచ్ దండు రాహుల్, నాయకులు తమ్మళి రవీందర్, రామ్ రెడ్డి, అశ్విని, శశికిరణ్‌రెడ్డి, ఖాజమియా, నారాయణ రెడ్డి, అక్తర్ పాష, గౌరీశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, పెంటారెడ్డి, కిషోర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
## గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## క్యాలెండర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కాప్రా :** మీర్పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్ ఇందిరానగర్ కాలనీ ఫేజ్ 2 వెల్ఫేర్ అసోసియేషన్, మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి,గొల్లూరి అం.జయ్య, రాంప్రదీప్, పంజరి ప్రవీణ్, సతీష్‌రెడ్డి, సెక్రటరి హరిప్రసాద్, రంగారెడ్డి, జనార్ధన్, లక్ష్మి , శోభ గౌడ్, విజయరెడ్డి, ఆదిశంకర్,విష్ణుగౌడ్, బ్రహ్మచారి, ఆంజనేయులు, గోపాల్, పెంటయ్య, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉత్సాహాన్ని పెంచుతాయ్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** క్రీడలు మానసిక ఉత్సాహాన్ని పెంచుతాయని మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి అన్నారు.మల్లారెడ్డి సేవా ట్రస్ట్ సౌజన్యంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో గురుకుల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రీమియం సీజన్2 క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా భద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో చైతన్యమైన యువత క్రీడలలో నైపుణ్యం సాధించలని గ్రామాలలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి క్రీడారంగాలను ప్రోత్సహించాలని అన్నారు.క్రికెట్లో గెలిచిన మొదటి బహుమతి 20 వేల రూపాయలు చొప్పున,రెండవ బహుమతికి 10 వేల రూపాయల చొప్పున విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్,సారా శ్రీనివాస్ గౌడ్,హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి విజయ్ ఆనంద్,మాజీ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్లు బండారి ఆంజనేయులు గౌడ్,చందుపట్ల వెంకట్ రెడ్డి, జాంగీర్, బేతల నర్సింగ్ రావు, రేసు లక్ష్మారెడ్డి, రవి, డొంకెన్ బిక్షపతి గౌడ్, క్రీడాకారులు యువజన సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** రానున్న జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించేందుకు ముందుకు వెళ్లాలని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ పిలుపిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మల్కాజిగిరి చౌరాస్తాలో ఆదివారం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు చంద్రశేఖర్, వెంకటేష్‌యాదవ్, పిట్టల శ్రీనివాస్, ఎస్సార్ ప్రసాద్, రాందాస్, సంతోష్, వైనాల ప్రవీణ్, యూసూఫ్, వినోద్ యాదవ్ సత్యమూర్తి, ఫరీద్, సయ్యద్ మబ్బు, ఇస్త్రారి, ఇందిరా ప్రియదర్శిని, సత్యానారాయణ, ఆశా, రోజా, రమణి, బ్రహ్మయ్య, రాజు, శ్రీరామ్, నవీన్ కన్నా తదితరులు పాల్గొన్నారు.

## సంస్థాగత నిర్మాణంలో భాగస్వాములు కావాలి : తీన్మార్



**ప్రజాపక్షం/కాప్రా :** పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రతి ఒక్క కార్యకర్త భాగస్వాములు కావాలని తెలంగాణా రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపిచ్చారు. ఆయనతో పాటు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పొనగట్ల చక్కపాణి, పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ సుదగాని హరిశంకరగౌడ్‌ల సమక్షంలో ఆదివారం ఉప్పల్, కుషాయిగూడ డివిజన్‌లకు చెందిన వివిధ పార్టీ శ్రేణులు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన తీన్మార్ మల్లన్న క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలన్నారు. సింగం అరుణ్, ఎం, బాను ప్రకాష్, ఎల్ సురేందర్, కిరణ్, దేవేందర్, శ్రీకాంత్, పి.అనిత, సౌందర్య, శాలిని, వనజ, హరిత, మంజుల, రేణుక తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**ప్రజాపక్షం/చర్లపల్లి :** జెవివి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఎస్‌ఐ సతీస్ అన్నారు.ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రీపురం శ్రీ చక్రీ విద్యా నికేతన స్కూల్‌లో 124వ ఉచిత వైద్య శిబిరానికి ఎస్‌ఐ విచ్చేసి ప్రారంభించారు.ముఖ్యంగా వాలంటీర్లు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ సేవలు అందించడం అభినందనీయమని ఆయన అన్నారు.జయరాజ్,విద్యాసాగర్,దేవిక, నవనీత,ఫిజియోథెరఫీ వైద్యులు దీప్తి,సంగీత,జనార్ధన,ధనంజమ్,నర్సింహులు 150 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.ఇందులో కరుణాకర్,జెన్నీ,వెంకటరమణ,శివశంకర్‌రెడ్డి,చరణ్,రామ్మోహన్‌రావు,నరసింహరావు,నాగేశ్వరరావు,రవి తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల సంకల్పంతో ఏర్పడిన పార్టీ కాంగ్రెస్ : కొలన్



**ప్రజాపక్షం/ కుత్బుల్లాపూర్:** దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన పార్టీ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 279 డివిజన్ రోడమేస్త్రీ నగర్, శ్రీరాంనగర్ బస్టాప్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత పురాతన పార్టీ కాంగ్రెస్ అని, అనేక మంది మహనీయుల సంకల్పంతో ఏర్పడిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. జాతీయ ఉపాధి హామీ చట్టం పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. అధికారం ఉందికదా అని కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన నిర్ణయం తీసుకుందని, ప్రతి భారతీయుని గౌరవం దెబ్బ తీసేలా తీసుకున్న నిర్ణయాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అట్టడుగు పేద ప్రజలు కరువుకాటకాల్లో ఉన్నప్పుడు కాంగ్రెస్ తీసుకున్న గొప్ప పథకమని, ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బిజెపి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ప్రజావ్యతిరేక విధానాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కేంద్రం కుట్రలకు పాల్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవి జె జేమ్స్, సిద్ధనోల్ల సంజీవరెడ్డి, పండరిరావు, ఎండి లయక్, అరుణ్, అజయ్, గఫ్ఫార్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

### బోడుప్పల్‌లో కుబేర ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం : మంత్రి గడ్డం వివేక్





**ప్రజాపక్షం/బోడుప్పల్ :** జిహెచ్‌ఎంసి బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన కుబేర ఫిల్లింగ్ స్టేషన్‌ను తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణలు ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఇలాంటి వ్యాపార సంస్థల ప్రారంభం తో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అం దించే విధంగా ఫిల్లింగ్ స్టేషన్ నిర్వహణ ఉండాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, ఫీర్జాదిగూడ కార్పొరేషన్ మాజీ మేయర్ అమర్ సింగ్ , బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యద ర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ డిప్యూటి మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, నిర్వహకులు మాజీ కార్పొరేటర్ బొమ్మకు కళ్యాణ్ కుమార్, మాజీ వార్డు సభ్యులు బోమ్మక్ రమేష్, మాజీ బ్యాంక్ డైరెక్టర్ బోమ్మక్ విశ్వనాథ్, మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోమ్మక్ అజయ్, మాజీ కా ర్పొరేటర్లు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు బోమ్మ క్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ స్ఫూర్తితోప్రభుత్వం పని చేస్తుంది

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బో డుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 358వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పా ర్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రె స్ సీనియర్ నాయకులు డాక్టర్ రాపోలు రాములు, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూ ర అజయ్ యాదవ్, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధా న కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేట ర్లు, నాయకులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కృషి, త్యాగం ఫలితంగానే భారతీయులందరికీ స్వేచ్ఛ, సమానత్వాలు లభించాయని ప్రతి ఒక్కరూ నిత్యం అంబేద్కర్ ఆశయాల కోసం ఆకాంక్షల కోసం కృషి చేయాలని పిలుపునిస్తూ 358 ఆదివారాలుగా ప్రతి ఆదివారం అంబేద్కర్‌కు జ్ఞానమాల సమర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న కత్తి మైసయ్యను అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులను మంత్రి వివేక్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని నత్తి మైసయ్య మంత్రికి బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు రాపోలు శ్రీరాములు, గరుగులయ్య యాకయ్య, సాయితదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే బాధ్యత సర్పంచ్‌లదే

### తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి ప్రజల మన్ననలను పొందాలని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శంషాబాద్ పట్టణంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅథితిగా జిల్లా ఇంచార్జీ మంత్రి శ్రీధర్‌బాబుతో ఉమ్మడి జిల్లాలోని ఎంఎల్‌ఎలతో కలసి తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నూతన విజయం సాధించిన సర్పంచ్‌లకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాలలో వీధి లైట్లు, పారిశుద్ధ్యం, తాగునీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ పథకాలను సర్పంచ్‌లు ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ గ్రామస్తుల మన్ననలను పొందాలని సూచించారు. మీ ఆలోచన సేవా భావాలను బట్టి ప్రజలలో గుర్తింపు ఉంటుందని అన్నారు. ఓటమి పాలైన కాంగ్రెస్ నాయకులు ఎవ్వరు ఆధైర్య పడవద్దని, వారందరు సమయ భావంతో ఉండి గ్రామాలలో మరింత సేవ చేయాలని, పార్టీ వారికి సరైన సమయంలో అవకాశం కల్పిస్తుందన్నారు. తాండూరు నియోజకవర్గంలో పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెపార్టీకి బ్రహ్మరథం పట్టారని, జిల్లాలోనే అత్యాధికంగా తాండూరు నుండి 25 సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవం కావడం సంతోషదాయకమన్నారు. గ్రామ సర్పంచ్‌గా విధులు, బాధ్యతలను సర్పంచ్‌లు తెలుసుకోవాలని అన్నారు. గత రెండు సంవత్సరాల నుండి గ్రామాలలో పాలకవర్గం లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఆర్థిక సంఘం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం భారి మొత్తంలో నిధులు విడుదల చేయబోతుందన్నారు. సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశల వారిగా అమలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి,డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, చల్లా నర్సింహారెడ్డి, కార్పోరేషన్ చైర్మన్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, నూతన సర్పంచ్‌లు నాయకులు పాల్గోన్నారు.

## దేశానికి ఆర్థిక వ్యవస్థ తీసుకవచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

### ఆవిర్భావ దినోత్సవంలో జెండాను ఆవిష్కరించిన తుంకి రమేష్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** భారతదేశానికి ప్రతిష్టాత్మకమైన ఆర్థిక వ్యవస్థను తీసువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, ఎ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అలియాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను అధ్యక్షుడు తుంకి రమేష్ ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 1885లో ఆవిర్భవించిందని దేశంలోనే అతి పెద్ద పార్టీగా ఎదిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలోనే ఎక్కువ సంవత్సరాలు పాలించి ప్రజలకు అవసరమైన ఎన్నో సంస్కరణలను తీసుకవచ్చిందన్నారు. అనంతరం ఇటీవల ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులకు పదవుల నియామక పత్రాలను అందజేశారు. అలాగే తూంకుంటలో కాంగ్రెస్ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కొల్తూర్‌లో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కమఠం కృష్ణారెడ్డి, యాంజాల శశిధర్‌రెడ్డి, మల్లేష్, ఉపాధ్యక్షులు ముద్దం సుధాకర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సిరిసాదుల శంకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకర్‌రెడ్డి, మాజి వైస్ ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# దేశానికి దిశ చూపిన పార్టీ కాంగ్రెస్

### సత్యం శ్రీరంగం



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** దేశానికి దిశ చూపిన పార్టీ, ప్రజలకు భరోసా ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పిసిసి సభ్యులు, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం, మాజీ సిఎల్‌పి నేత పిజెఆర్ వర్థంతిని పురస్కరించుకుని డివిజన్ అధ్యక్షులు కృష్ణరాజ్‌పుత్, తమ్మినేని ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్, సత్యం శ్రీరంగంలు హాజరై కెపిహెచ్‌బి కాలనీ రోడ్ నెంబర్ 1 గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, జెండా ఎగురవేశారు. అనంతరం పిజెఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రజలందరినీ ఐక్యం చేసి బ్రిటిష్ వారి నుంచి స్వాతంత్ర్యం తేవడంలో కాంగ్రెస్ కీలకపాత్ర పోషించిందన్నారు. భవిష్యత్తు భారతం కాంగ్రెస్ పార్టీదేనని, పార్టీకి పున:వైభవం తీసుకువద్దామని అన్నారు.

**మహానాయకుడు మాజీ సిఎల్‌పి నేత పిజెఆర్..**

బడుగు బలహీన వార్గలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సమానంగా, పార్టీలకు అతీతంగా సేవలందించిన మహానాయకుడు మాజీ సిఎల్‌పి నేత పిజెఆర్ అని అన్నారు. సుదీర్ఘకాలంగా పార్టీలకతీతంగా ప్రజలే తన బలం బలగం అంటూ నగరంలో అతిపెద్ద నియోజకవర్గానికి సుమారు ఐదు సార్లు ప్రాతినిధ్యం వహించి అనేక బస్తీలు కాలనీలు ఏర్పాటు చేసిన మహానాయకుడు పిజెఆర్ అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో తనకెవరూ సాటిలేరని, ఏ పార్టీ అధికారంలో ఉన్న ప్రజలే తన బలంగా భావిస్తూ వారందరికీ కావాల్సిన నిధులు సరైన సమయంలో తీసుకువచ్చి అభివృద్ధికి అండగా ఉన్నారని అన్నారు. కార్మిక నాయకుడిగా మంచి గుర్తింపు పొందారని, దాని కి తోడు తన రాజకీయ జీవితం ఆదర్శంగా నిలిచారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా సిఎల్‌పి లీడర్‌గా ప్రజల కోసం, తెలంగాణ అభివృద్ధి కోసం అసెంబ్లీలో మాట్లాడి తెలంగాణ ప్రజల్లో బాగా ఆదరణ పొందిన వ్యక్తిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ గోపిశెట్టి రాఘవేందర్, శేరి సతీష్‌రెడ్డి, గొట్టిముక్కల దేశల్, సంజీవరావు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గంధం రాజు, సతీష్‌గౌడ్, ప్రకాష్ ముదిరాజ్, కలికోట బాలరాజ్, కరుణాకర్ నాయుడు, పొన్నం రజిత, స్వరూపగౌడ్, రేష్మా, జ్యోతి, లక్ష్మి , అరవింద తదితరులు పాల్గొన్నారు.

## గత ఏడాదితో పోలిస్తే ఈ సారి 3.31% పెరిగిన నేరాలు

● తగ్గిన రోడ్డు ప్రమాదాలు , సివిల్ తగాదాల్లో పోలీసుల ప్రమేయం ● దొంగతనాలు రాబరీలు హత్యలు, ఆత్మహత్య కేసులు అధికం, ఇసుక అక్రమ రవాణాలోనూ ఆరోపణలు



**ప్రజాపక్షం/వికారాబాద్:**వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 2024తో పోలిస్తే ఈ ఏడాది నేరాల సంఖ్య పెరిగింది. నిఘా వ్యవస్థల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. వికారాబాద్ జిల్లాలో గ తంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది హ త్యలు పెరిగాయి. 25 హత్యలు జరిగ్గా 24కేసుల్లో పోలీసులు పురోగతి సాధించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నాలుగు ఆస్తి కోసం హత్య లు, 13 కుట్ర పూరిత హత్యలు, అడ్డువచ్చిన వారిపై కత్తితో దాది చేశారు. జిల్లాలో 2024 –2025లో ఆస్తి కోసం హత్యలు 2024లో ఒకటి ఉంటే 2025లో 4 మొత్తం కేసులు 2024, 3691, 2025లో 3813 నమోదు కావడం జరిగింది. రోడ్డు ప్రమాదాలు కొంతమేర తగ్గాయి. మృతుల సంఖ్య కాస్త తగ్గింది. కొన్ని చోట్ల సివిల్ తగాదాల్లో పోలీసులు తల దూర్చుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. వికారాబాద్, తాండూర్, పరిగి, మోమిన్‌పే ట్, ధారూర్, నవబ్‌పేట్, మర్పల్లి తదితర ప్రాంతాల్లో పోలీసుల జోక్యం పెరిగిందనే విమర్శలు ఉన్నాయి. హత్యలు, దోపిడీలు , దొంగతనాలు, మిస్సింగ్, కిడ్నాప్ కేసులు పెరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. గుట్కా, బియ్యం, కలప, గంజాయి, లభ్యత , ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమయ్యారు. సీసీ టీవిల ఏర్పాటులో పురోగతి సాధించారు. జిల్లా వ్యాప్తంగా చాలా ఫిర్యాదులు ఎఫ్ఐఆర్ నమోదు కాకుండానే బుట్ట దాఖల వుతున్నాయి. పోలీస్ స్టేషన్‌లో రాజకీయ నేతలు తల్లొగ్గి ఫిర్యాదులను పక్కన పడేస్తున్నరనే విమర్శలు ఉన్నాయి. భూ వివాదాల్లో ఏదో ఒక వర్గాని కి మేలు చేసేలా వ్యవహరిస్తున్నారని చర్చించుకుంటున్నారు. తాండూర్ సబ్ డివిజన్ పోలీసులు ఇసుక మాఫియాతో జత కట్టారనే విమర్శలు వచ్చాయి. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఒకే సారి ముగ్గురు అధికారులపై వేటు పడిన విషయం తెలిసిందే అయినా మారని అధికారుల తీరులో ఏలాంటి మార్పు లేదు. ఈ ఏడాది జిల్లా కోర్టు నేరస్తుల విషయంలో సంచలన తీర్పులు ఇచ్చింది. చాలా మందికి జీవిత ఖైదు శిక్ష విధించారు. చేవేళ్ల మండల ఖనాపూర్ సమీపంలో ఆర్‌టిసి బస్సు టిప్పర్‌ను డీ కొట్టిన ఘటనలో 19 మంది మృతి చెందారు. గతంలో పోలిస్తే వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా సైబర్ , ఇతర నేరాలు పెరిగాయి. కేసుల నమోదులో పారదర్శకంగా వ్యవహరించాం కొన్ని రకాల నేరాలు తగ్గుముఖ్యం పట్టడం ఉరటనిస్తుందని , రోడ్డు ప్రమాదాలు తగ్గిచగలిగాం అని జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా తెలిపారు.




## రతన్‌టాటా జీవితం స్ఫూర్తిదాయకం

### ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** భావితరాలకు రతన్ టాటా జీవితం స్ఫూర్తిదాయకమని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పద్మభూషణ్ రతన్ టాటా 88వ జయంతోత్సవాల సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ (టిసిసి) రాష్ట్ర అధ్యక్షులు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, తెలంగాణ వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు జస్టిస్ డా.గురుజాల రాధారాణితో కలిసి మాట్లాడారు. దేశ నిర్మాణాన్ని నైతిక విలువల వ్యాపార వృద్ధిని మేళవించిన ఐకాన్ రతన్ టాటా అని కొనియాడారు. ప్రపంచపటంలో దేశానికి గుర్తింపు తెచ్చిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా.బి.కే, ఉమారాణి, శశిధర్, సాంబ లలిత, పి.అర్పిత, తిరుపతి కదిరి, మంగళం సావిత్రి, డి.కోమలి కృష్ణారెడ్డి, పద్మ కళావూరి, జ్యోతి, మేకల చంద్రశేఖరరావు, పోరిక అన్నపూర్ణలకు రతన్‌టాటా సేవా రత్న పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రొ.అక్బర్ అలీఖాన్, డా.కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఓఎయు ప్రొ.ఏ.పాట్రిక్, ఆర్.ప్రశాంత్‌కుమార్, ప్రొ.అబ్దుల్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాట పటిమతో మరింత ఉత్సాహంతో ముందకు వెళుతాం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రజా పోరాటాలే లక్ష్యంగా కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై గత వందేళ్లుగా కొనసాగిస్తున్న పోరాట పటిమతో మరింత ఉత్సాహంతో ముందకు వెళుతామని సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. పార్టీ 100 ఏళ్ల ఆవిర్భావ వేడుకల్లో భాగంగా మోహన్‌నగర్ సిపిఐ శాఖ ఆధ్వర్యంలో ప్రజా నివాస్ ఎక్స్‌రోడ్‌లో ఆదివారం ఎర్రజెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి చిక్కయ్య, ఎం.మద్దిలేటి, ఎల్బీనగర్ జోన్ మున్సిపల్ అండ్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్ యూనియన్ కార్యదర్శి ఉప్పల్ మండల పార్టీ సహాయ కార్యదర్శి ఎండి బషీర్, ఈశ్వర్, జంగయ్య,సంతోష్,బాలమణి,లక్ష్మి , బ్రహ్మం, విజయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా రైతాంత సాయుధ పోరాట త్యాగాలు చిరస్థాయిగా నిలిచి పోయాయన్నారు.

### సర్కిల్ కార్యాలయాన్ని అనుకూల స్థలంలో ఏర్పాటు చేయాలి

నూతనంగాఏర్పాటైన నాగోల్ సర్కిల్ కార్యాలయాన్ని సర్కిల్ ఆరు డివిజన్‌వాసులకు సౌకర్యంగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి బొడ్డుపల్లి కృష్ణ కోరారు. ప్రస్తుతం పెద్ద అంబర్‌పేటలో సర్కిల్ కార్యాలయం తాత్కాలిక ప్రాతిపదికన ప్రారంభిస్తుండటం వృథా వ్యయప్రయాసలకు గురి అవుతారన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

### డిస్ట్రిక్ట్ గవర్నర్ సెల్వా సాయిరాం రాజ్

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని లయన్స్ క్లబ్ 320 బి డిస్ట్రిక్ట్ గవర్నర్ సెల్వా సాయిరాం రాజ్ కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రి సమీపంలో నిత్యం ఉదయం పేదలకు అందిస్తున్న బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్ల నుంచి చేస్తున్న సేవలకు గుర్తింపుకు గాను ప్రత్యేక జ్ఞాపికను డిస్ట్రిక్ట్ గవర్నర్ సెల్వా సాయిరాం రాజ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షుడు బిర్రు ఆంజనేయులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక కార్యక్రమాన్ని నిరంతరాయంగా ఐదేళ్లపాటు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌ను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మాజీ అధ్యక్షుడు కృష్ణను అభినందించారు. రానున్న కాలంలోనూ ఇదే విధంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. నిత్యం ఉదయం ఆసుపత్రి రోగులకు సహాయకులుగా ఉంటున్న వారికి బ్రేక్‌ఫాస్ట్‌ను అందజేసేందుకు అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్న లయన్ రవిందర్ ముదిరాజ్‌ను ఆయన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ టి.రాజేంద్ర ప్రసాద్, జిఈటి కో ఆర్డినేటర్ ఎస్‌ఎన్‌రెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అవంతిరెడ్డి, డిసి అంగర్ రిలిఫ్ రాందాస్, రిజియన్ చైర్‌పర్సన్ సురేష్ కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షుడు బిర్రు ఆంజనేయులు, మాజీ అధ్యక్షులు కృష్ణ, కిషోర్, బి.శ్రీనివాస్‌రెడ్డి, వినోద్ జాదవ్, సిద్ధారెడ్డి, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.



# రీల్

## హుమా ఖురేషి పోస్టర్ విడుదల




కేజీఎఫ్ హీరో తాజాగా నటిస్తున్న టాక్సిక్ సినిమా నుంచి హుమా ఖురేషి పోస్టర్ విడుదల చేశారు. ఇందులో హుమా ఖురేషి చాలా కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. గీతు మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవిఎన్ ప్రొడక్షన్స్, మోన్ స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి 2026 మార్చి 19న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. హుమా ఖురేషితో పాటు కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది.

## '45 ది మూవీ' ప్రీ రిలీజ్



కరుణాడ చక్రవర్తి శివ రాజ్ కుమార్, రియల్ స్టార్ ఉపేంద్ర, రాజ్ బి శెట్టి వంటి స్టార్లతో అర్జున్ జన్య తెరకెక్కించిన చిత్రం '45 ది మూవీ'. ఈ చిత్రాన్ని సూరజ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద ఉమా రమేష్ రెడ్డి, ఎం రమేష్ రెడ్డి భారీ ఎత్తున నిర్మించారు. మైత్రి ద్వారా తెలుగులో జనవరి 1న ఈ సినిమాను గ రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా శివ రాజ్ కుమార్ మాట్లాడుతూ.. 'వేద' తరువాత మళ్లీ '45' మూవీ కోసం హైదరాబాద్‌కు వచ్చాను. నాలుగైదు నిమిషాల్లోనే అర్జున్ జన్య అద్భుతంగా స్టోరీని నెరేట్ చేశారు. తెలుగులో మా మూవీని మైత్రి రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. కన్నడలో ఆల్రెడీ సక్సెస్ అయింది. ఈ మూవీని చూస్తే కచ్చితంగా ప్రతీ ఒక్క ప్రాణిని ప్రేమిస్తారు. జనవరి 1న మా మూవీని అందరూ చూడండి' అని అన్నారు. ఉపేంద్ర మాట్లాడుతూ 'అర్జున్ కథను నెరేట్ చేసిన విధానం నాకు చాలా నచ్చింది. మ్యూజిక్ డైరెక్టర్గా ఆయన ఎంత సక్సెస్ అయ్యారో నాకు తెలుసు. ఈ కథను నెరేట్ చేసేటప్పుడు ప్రతీ పాత్రను యాక్ట్ చేసి మరీ చూపించారు. ముందుగా ఓ సీన్‌ను చిత్రీకరించాడు. ఈ మూవీ తరువాత అర్జున్ పెద్ద దర్శకుడిగా మారిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు అర్జున్ జన్యా, నిర్మాత రమేష్ రెడ్డి, మైత్రి శశి పాల్గొన్నారు.




చిరంజీవి నటించిన 'మన శంకర్ వర ప్రసాద్ గారు' సినిమా కోసం విదేశాల్లో బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి. ఇందులో వెంకటేష్ మరో కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. చిరంజీవి సరసన నయనతార హీరోయిన్‌గా నటించింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రీమియర్ షోస్ జనవరి 11న విదేశాల్లో జరుగనుంది. ఈ సినిమాను 12న థియేటర్లలో విడుదల కానుంది. ముఖ్యంగా అమెరికాలో చిరంజీవికి విపరీతంగా ఫాలోయింగ్ ఉంది. బుకింగ్స్ ప్రారంభం అయిన నేపథ్యంలో చాలా ఫాస్ట్‌గా బుకింగ్స్ జరుగుతున్నాయని నిర్మాతలు తెలిపారు. సుస్మిత కొణిదెల, సాహు నిర్మిస్తున్నారు.

## 'శంబాల'కు అద్భుతమైన స్పందన...

- యుగంధర్ ముని




ఆది సాయికుమార్ హీరోగా షైనింగ్ పిక్చర్స్ నిర్మించిన చిత్రం'శంబాల'. ఇటీవల విడుదలై సక్సెస్ ఫుల్‌గా నడుస్తున్న నేపథ్యంలో దర్శకుడు యుగంధర్ ముని మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. శంబాల' ప్రయాణం మూడేళ్ల క్రితం ఈ పాయింట్ అనుకున్నాను. నాకు రాజశేఖర్‌తో ఐదేళ్ల నుంచి అనుబంధం ఉంది. ఈ పాయింట్‌ను ఆయనకు చెప్పాను. ఆ కథ నిర్మాతకి చాలా నచ్చింది. ఆ తరువాత మహిధర్ వచ్చారు. అలా మా ఈ జర్నీ మొదలైంది దర్శకుడిగా ఈ కథను ఎంతో బాధ్యతతో రాసుకున్నాను. నేను చెప్పే కథను చాలా మంది చూస్తారు. ఎంతో నేర్చుకుంటారు. ఏ ఒక్కరినీ బాధ పెట్టకూడదు. సైన్స్, శాస్త్రానికి మధ్య బాలెన్స్ చేయాలని, ఎవ్వరి మనోభావాల్ని దెబ్బ తీయకూడదని ముందే అనుకున్నాను. హౌస్ ఫుల్ బోర్డులు పడినా కూడా గేట్లు తన్నుకుంటూ వెళ్తున్నారు. ఇవన్నీ నేను చిన్నప్పుడు చిరంజీవి సినిమాలకు చూశాను. ఇండస్ట్రీ నుంచి చాలా మంది ఫోన్స్ చేశారు. హీరోలు, దర్శక, నిర్మాతలందరూ ఫోన్స్ చేసి అభినందిస్తున్నారు. ఆది ఈ మూవీ విజయం పట్ల ఆనందంగా ఉన్నారు. ఆయన ఇలాంటి ఓ సక్సెస్ కోసం చాలా కష్టపడుతూనే వచ్చారు. సెట్లో ఎన్ని గాయాలైనా కూడా ఆయన ఎక్కడా తగ్గకుండా వర్క్ చేశారు. ఆది స్క్రిప్ట్‌లో ఎక్కువగా ఇన్ పుట్స్ ఇవ్వలేదు. కథా చర్చల టైంలో ఆది సలహాలు ఇచ్చారు. కానీ ఒక్కసారి స్క్రిప్ట్ లాక్ అయిన తరువాత ఆయన మళ్లీ ఛేంజెస్ చెప్పలేదు. ఆయన చెప్పింది చెప్పినట్టుగా నటించుకుంటూ వెళ్లారు. ఉల్క పడిన ప్రాంతం ఎలా ఉంటుంది? అనే విషయంలో చాలా రీసెర్చ్ చేశాను. ఉల్క పడితే ఏం జరుగుతుంది? దాని చుట్టూ ప్రాంతం ఎలా ఉంటుంది? అని బ్రెజిల్లో జరిగిన ఘటనల మీద పరిశోధన చేశాం.



## స్టార్స్ ముచ్చట్లు...

స్టార్స్ కలిసి ఒక చోట కలిస్తే చూడముచ్చటగా ఉంటుంది కదు. ఈ ఫోటో అదే సూచిస్తోంది. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ స్టార్ రామ్ చరణ్, క్రికెట్ స్టార్ ఎంఎస్ ధోణి, విలన్ బాబీ డియోల్ ఒకే చోట కలసి ముచ్చట్లు పెట్టుకుంటున్నారు. సల్మాన్ ఖాన్ 60వ జన్మదిన వేడుకల సందర్భంగా ఈ స్టార్స్ అంతా కలిశారు.

## రోషన్‌తో అల్లు అరవింద్ సినిమా



'చాంపియన్' బ్లాక్‌బస్టర్ విజయంతో యంగ్ హీరో రోషన్ కెరీర్ కీలక మలుపు తిరిగింది. తాజాగా గీతా ఆర్ట్స్ అధినేత, అగ్ర నిర్మాత అల్లు అరవింద్ 'చాంపియన్' చిత్రాన్ని వీక్షించి, రోషన్ నటనకు ఎంతగానో ముగ్ధులయ్యారు. ఆయన వ్యక్తిగతంగా రోషన్‌ను అభినందించడమే కాకుండా, తన బ్యానర్‌లో రోషన్‌తో సినిమా చేయనున్నారు. ఈ విషయాన్ని అల్లు అరవింద్ ప్రకటించారు. టాలీవుడ్లో అగ్ర నిర్మాతల్లో ఒకరైన అల్లు అరవింద్ నుంచి వచ్చిన ఈ అవకాశం రోషన్ టాలెంట్‌కు గొప్ప గుర్తింపుగా నిలుస్తోంది. ఇప్పటికే ఇండస్ట్రీలో మోస్ట్ ప్రామెసింగ్ యంగ్ హీరోగా గుర్తింపు తెచ్చుకుంటున్న రోషన్, నాగ వంశీ సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్లో కూడా ఓ సినిమా చేయనున్నారు.

## మూడు రోజుల్లో 'ఈషా'కు రూ.4 కోట్ల గ్రాస్




ఇటీవల విడుదలైన ఈషా సినిమా విడుదలైన మూడు రోజుల్లో 4 కోట్ల 80 లక్షల గ్రాస్‌ను వసూలు చేసిన బ్లాక్‌బస్టర్‌గా నిలిచిందని సమర్పకులు దామోదర్ ప్రసాద్ అన్నారు. ఈషా చిత్రం నుంచి లాభాల బాటల్లో అడుగుపెట్టింది. పెయిడ్ ప్రీమియర్స్ దగ్గర నుంచే స్ట్రాంగ్ కలెక్షన్స్‌తో అద్భుతమైన ఓపెనింగ్స్‌తో ప్రారంభమైన 'ఈషా' బ్లాక్‌బస్టర్ టాక్‌ను సొంతం చేసుకోవడంతో పాటు రోజు రోజుకు కలెక్షన్స్ పెంచుకుంటూ విజేతగా నిలిచింది.

## జనవరి 2న 'ఓ అందాల రాక్షసి'



దర్శకుడిగా, హీరోగా, సంగీత దర్శకుడిగా, కథకుడిగా షెరాజ్ మెహదీ అందరినీ ఆకట్టుకుంటూ ఉన్నారు. ప్రస్తుతం ఆయన 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో విహాన్షి హెగ్డే, కృతి వర్మలు హీరోయిన్లుగా నటించారు. స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్ మీద సురీందర్ కౌర్ నిర్మాతగా 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రం జనవరి 2న రాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కథ, మాటల రచయిత భాష్య శ్రీ, కృతి వర్మ, విహాన్షి హెగ్డే పాల్గొన్నారు.

# 'రాజా సాబ్' బ్లాక్ బస్టర్ కావాలి

ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రభాస్



రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'రాజా సాబ్'. దర్శకుడు మారుతి. 'రాజా సాబ్' సినిమాను టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న 'రాజా సాబ్' సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'రాజా సాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గేయ రచయిత కాసర్ల శ్యామ్ మాట్లాడుతూ... 'రాజా సాబ్' చిత్రంతో ఫస్ట్ టైమ్ ప్రభాస్‌కి పాట రాశాను. ఆ పాటను సర్ ప్రైజ్ ప్యాకేజ్‌లా త్వరలో రిలీజ్ చేయబోతున్నారు. ముగ్గురు హీరోయిన్స్‌తో ప్రభాస్ ఈ పాటలో వేసే స్టెప్స్ స్క్రీన్ మీద చూసేందుకు నేను కూడా మీతో పాటు ఎదురుచూస్తున్నాన్నారు. నటి జరీనా వాహాబ్ మాట్లాడుతూ... నేను 40 ఏళ్లుగా సినిమా ఇండస్ట్రీలో ఉన్నాను. రాజా సాబ్ వంటి మంచి సినిమాతో తెలుగులో నటించే అవకాశం కల్పించారు. నేను ఎంతోమంది నటులతో నటించాను గానీ ప్రభాస్ వంటి మంచి మనసున్న వ్యక్తిని చూడలేదు. అతనికి నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి అన్నారు. హీరోయిన్ రిద్ధి కుమార్ మాట్లాడుతూ.. ఆయన ఎలా ఉంటారో అలాగే ఈ సినిమాలో మారుతి చూపించబోతున్నారు. ప్రభాస్‌లో ఉన్న మంచి క్వాలిటీస్ అన్నీ ఈ సినిమాలో మీరు చూడొచ్చు. ఈ సినిమా చూస్తున్నప్పుడు ప్రభాస్‌ని మరింత ఇష్టపడతారు. మీరంతా రాజా సాబ్‌ను జనవరి 9న థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేస్తారన్నారు. హీరోయిన్ మాళవిక మోహనన్ మాట్లాడుతూ.. నాకు తెలుగు సినిమా ఇండస్ట్రీ అంటే ఇష్టం, గౌరవం. ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్ సరసన నటిస్తూ, రాజా సాబ్ లాంటి ప్రెస్టీజియస్ మూవీతో టాలీవుడ్‌లోకి అడుగుపెడతానని ఊహించలేదు. ప్రభాస్ ఫ్యాన్స్‌కు రెబల్ స్టార్, రెబల్ గాడ్. కానీ మా అందరికీ రాజా సాబ్. హీరోయిన్ నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. ఇండియా బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్‌తో కలిసి సినిమా చేయడం కల నిజమైన అనుభూతి కలిగిస్తోంది. ఆయన ఎంతమంచి వారో మాటల్లో చెప్పలేను. మీ అందరి అభిమానం, ప్రేమతో ఇంకా మరిన్ని విజయాలు ప్రభాస్ అందుకోవాలి. గల్లీలో సిక్స్ కొట్టడం కాదు స్టేడియంలో కొట్టేవాడికి ఒక రేంజ్ ఉంటుంది. ప్రభాస్ రేంజ్ అది. రాజా సాబ్‌లో నటించే అవకాశం కల్పించిన మారుతికి థ్యాంక్స్ అని అన్నారు. డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ.. నేను ఈ వేదిక మీద నిలబడ్డాను అంటే అది మీరు ఇస్తున్న సపోర్ట్ వల్లే. రాజా సాబ్ వెనక బలంగా నిలబడింది ఇద్దరు. ప్రభాస్ ఆదిపురుష్ సినిమాలో రాముడిగా నటిస్తుండగా, ఈ మారుతి ఆయన దగ్గరకు వెళ్లాడు. రాజా సాబ్ కథ విని ప్రభాస్ చాలా నవ్వుకున్నారు. అయితే ఆయనకు ఈ సినిమా చేయాల్సిన అవసరం లేదు. బాహుబలి తర్వాత ప్రపంచమంతా ప్రభాస్ గుర్తింపు తెచ్చుకున్నారు. మేము సౌతాఫ్రికాలో ఒక చిన్న ఊరిలో షూటింగ్ చేస్తుంటే, అక్కడి వారికి కూడా ప్రభాస్ తెలియడం మమ్మల్ని సర్ ప్రైజ్ చేసింది అని అన్నారు. రెబల్ స్టార్ ప్రభాస్ మాట్లాడుతూ... ఈ మధ్యే జపాన్ ఫ్యాన్స్‌ను కలిసినప్పుడు ఇలాగే హ్యాపీగా ఫీలయ్యా. మీ అందరి కోసం కొత్త హెయిర్ స్టైల్‌లో వచ్చా. అనిల్ తడానీ నా బ్రదర్ లాంటి వారు. ఆయన నా సినిమాలకు నార్త్‌లో సపోర్ట్ చేస్తుంటారు. సంజయ్ దత్ క్లోజ్ షాట్ పెడితే సీన్ మొత్తం తినేస్తారు, నాతో పాటు జరీనా కూడా రాజా సాబ్‌లో హీరోనే. రిద్ధి, మాళవిక, నిధి ముగ్గురూ బ్యాటిఫుల్ హీరోయిన్స్. ఈ సినిమాకు అనుకున్న బడ్జెట్ పెరిగింది. మూడేళ్ల 'రాజా సాబ్' స్ట్రెస్, బాధ్యత అన్నీ కలిసి మారుతికి కన్నీళ్లు వచ్చాయి. సంక్రాంతికి అన్ని సినిమాలతో పాటు మా రాజా సాబ్ కూడా బ్లాక్‌బస్టర్ కావాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్స్ టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ రచన, దర్శకత్వం మారుతి పాల్గొన్నారు.

# 1 నుంచి నుమాయిష్

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందన్నారు. ప్రవేశ టికెట్ ధర రూ.50, 5 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత ప్రవేశం ఉందని తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలకు స్టాళ్ల కేటాయింపులో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని ఎగ్జిబిషన్ సొసైటీ వెల్లడించింది.

### భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

ఎగ్జిబిషన్ నిర్వహణకు 34 ఉప కమిటీలను ఏర్పాటు చేశారు. భద్రత కోసం 106 మంది సెక్యూరిటీ సిబ్బంది, 138 మంది డే వాలంటీర్లు, 76 మంది నైట్ వాలంటీర్లు విధులు నిర్వహిస్తారు. మొత్తం 320 మంది వాలంటీర్లు ఎగ్జిబిషన్‌లో సందర్శకుల భద్రతను పర్యవేక్షించనున్నారు. ప్రవేశ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేపడతారు. నిషేధిత వస్తువులకు అనుమతి ఉండదని నిర్వాహకులు స్పష్టం చేశారు.

### అగ్నిమాపక భద్రత

అగ్నిప్రమాదాలను నివారించేందుకు రెండు అండర్‌గ్రౌండ్ వాటర్ సంప్స్, 82 హైడ్రెంట్లు, నిరంతర నీటి ఒత్తిడి ఏర్పాటు చేశారు. 10 వేల లీటర్ల సామర్థ్యం గల రెండు ఫైర్ ఇంజిన్లు ప్రాంగణంలో అందుబాటులో ఉంటాయి.

### 1050 స్టాళ్లు – 20 ఫుడ్ స్టాళ్లు

ఈ ఏడాది స్టాళ్లకు భారీ డిమాండ్ నెలకొంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తయారీదారులు, కళాకారులతో కలిపి 1050 స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిలో 20 ఫుడ్ స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆర్‌బిఐ, ఖాదీ, అటవీ శాఖ, పోలీస్ శాఖ, ఎల్ఐసి, పర్యాటక శాఖ వంటి ప్రభుత్వ విభాగాలు కూడా ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాయి.

### రవాణా – పార్కింగ్ సౌకర్యం

గాంధీభవన్, నాంపల్లి మెట్రో స్టేషన్ల నుంచి ఎగ్జిబిషన్‌కు నేరుగా మెట్రో సౌకర్యం ఉంది. ప్రత్యేకంగా రాత్రివేళల వరకు మెట్రో రైళ్లు నడపనున్నారు.
టిఎస్ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేయనుంది.
చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉచిత పార్కింగ్, హ్యాండ్లూమ్ హౌస్ సమీపంలో మల్టీ లెవల్ పేడ్ పార్కింగ్ అందుబాటులో ఉంటుంది.

### వైద్య సేవలు..

యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హెల్త్ చెకప్ సెంటర్, లయన్స్ ఇంటర్నేషనల్ సహకారంతో కంటి ఆస్పత్రి ఏర్పాటు చేశారు. 24x7 అంబులెన్స్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది.

### నగరానికి నుమాయిష్ గర్వకారణం..

గత 8 దశాబ్దాలుగా నుమాయిష్ హైదరాబాద్ సంస్కృతిలో భాగమైందని, అన్ని వర్గాల ప్రజలను ఒక్కచోట చేర్చే వేదికగా నిలుస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది కూడా సురక్షితంగా, సంతోషకరంగా నుమాయిష్‌ను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు.



## ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడిగా సురేష్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రోగ్రెసివ్ ప్యానెల్ విజయ దుందుభి మోగించింది. ఫిలమ్స్ చాంబర్ నూతన అధ్యక్షుడిగా దగ్గుబాటి సురేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సూర్యదేవర నాగవంశీ (లక్కి భాస్కర్ నిర్మాత), భరత్ చౌదరి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా అశోక్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా మోహన్ వడ్లపట్ల, విజయేందర్ రెడ్డి, కోశాధికారిగా ముత్యాల రాందాస్ విజయం సాధించారు. ప్రోగ్రెసివ్ ప్యానెల్ సహకారంతో సురేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
ఈ ప్యానెల్‌కు దిల్ రాజు, అల్లు అరవింద్ మద్దతు తెలిపారు. 31మంది ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి సభ్యులు గెలిచారు. 17 మంది మన ప్యానెల్ నుంచి సభ్యులుగా విజయం సాధించారు.

## ఆడంబరాలు వీడి.. అప్పులు లేని సమాజాన్ని నిర్మించండి

'ప్రభాత' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం

మంత్రి జూపల్లి కృష్ణారావు




ప్రజాపక్షం/హైదరాబాద్: సమాజంలో ఆర్థిక అస్థిరతకు మనిషి ఆలోచనా విధానమే ప్రధాన కారణమని, ఆడంబరాలు, అనవసర ఖర్చులను వీడి అప్పులు లేని సమాజాన్ని నిర్మించుకోవాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో భాగంగా అనిశెట్టి రజిత వేదికపై ఆదివారం సాయంత్రం పుస్తక స్ఫూర్తి, పుస్తకం ఒక దారిదీపం చర్చా కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సీనియర్ పాత్రికేయులు కే.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విజ్ఞానం పెరిగినా మనిషి ఇంకా అప్పుల ఊబిలోనే ఉండటం విచారకరమన్నారు. ప్రభుత్వాలు రూ.వేల కోట్లు సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తున్నా, ఆ సంపద పేదవాడి ఇంట నిలవకపోవడానికి కారణం కార్పొరేట్ విద్య, వైద్యం పేరిట జరుగుతున్న వృథా ఖర్చులేనని విశ్లేషించారు. వచ్చే ఐదేళ్లలో అప్పులు లేని సమాజాన్ని చూడాలన్న లక్ష్యంతో 'ప్రభాత' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. అధికారులు, కవులు, కళాకారులను ఏకం చేసి గ్రామ గ్రామాన నాటికలు, కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. చిన్నప్పుడు పాఠశాలల్లో ఉండే ప్రభాత భేరీ స్ఫూర్తిని మళ్ళీ తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.
మహిళలు, యువతలో పఠనాశక్తిని పెంచేందుకు తమ శాఖ తరపున రూ.ఒక కోటి వ్యయంతో స్ఫూర్తిదాయక పుస్తకాలను కొనుగోలు చేస్తున్నట్లు జూపల్లి ప్రకటించారు. వీటిని గ్రామ పంచాయతీలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కేవలం పుస్తకాలు చదవడం ద్వారానే కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయని, అది సామాజిక మార్పుకు నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. అనంతరం ప్రసంగకర్తలు రమ మేల్కొటే, పాశం యాదగిరి, మాడభూషి శ్రీధర్, గోరటి వెంకన్నలను సన్మానించారు.






# రెట్టింపు

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా సిపిఐ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 100 ఏళ్ల పైలాన్‌ను కూనంనేని ముఖ్యఅతిథిగా హాజరై సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి పైలాన్ ఆవిష్కరించారు. అంతకంటే ముందు సిపిఐ వందేళ్ల ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ముందుగా అరుణ పతాకాన్ని ఎగురవేసి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూలమాలవేసి శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బిజెపి యుద్ధోన్మాదానికి కూడా తెరలేపిందని, మతోన్మాదులు, యుద్ధోన్మాదులతో దేశానికి ప్రమాదకరమని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం పేరు మీద ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతున్నాయని ధ్వజమెత్తారు. దేశభక్తి ముసుగులో బిజెపి కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతున్నదన్నారు. కోట్ల సంవత్సరాలు చరిత్ర కలిగిన అరావళి పర్వతాలను ఆదాని మైనింగ్ కంపెనీకి కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం కట్టబెడుతున్నదని విమర్శించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ దేశ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ వర్గాలకు దోచి పెడుతున్న బిజెపి ప్రభుత్వం చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో ఐదు లక్షల మంది ప్రజలతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు జిల్లా నుండి వేలాది మంది తరలి రావాలని పిలుపునిచ్చారు.




జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో సిపిఐ అనేక త్యాగాలు చేసిందని, ఎంతోమంది అమరవీరులను అందించిన చరిత్ర సిపిఐదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. దున్నే వాడికి భూమి దక్కాలని, భూమిలేని నిరుపేదలకు భూమి పంచాలని పోరాడి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిందని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటాన్ని చేపట్టి వేలాది గ్రామాలను విముక్తి చేసిన ఘన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. దేశంలో వామపక్ష పార్టీల ఐక్యతా పోరాటాలను ఉధృతం చేస్తూ, లౌకిక ప్రజాస్వామిక శక్తుల్ని ఏకం చేస్తూ ప్రజాస్వామ్య పోరాటాలను నిర్వహించడం జరుగుతున్నదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదలకు అనేక హామీలు ఇచ్చిందని వాటిని వెంటనే నెరవేర్చాలని, భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న ఎర్ర చెరువులో గుడిసెలు వేసుకున్న పేదలకు నాలుగు సంవత్సరాలు అయిన ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని, వెంటనే ప్రభుత్వం గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శిలు గురుజపెల్లి సుధాకర్‌రెడ్డి, ఫైండ్ల శాంతికుమార్, పట్టణ కార్యదర్శి సతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా సమితి సభ్యులు క్యాథరాజు సతీష్, మాతంగి రామ్ చందర్, కొరిమి సుగుణ, నూకల చంద్రమౌళి, జి.శ్రీనివాస్, తాళ్ల పోశం, నేరెళ్ల జోసెఫ్, శ్రీకాంత్, గోలి లావణ్య యాకూబ్ పాషా, సుమారు 1000మంది పాల్గొన్నారు.

## 10,000 పరుగులు

(మొదటి పేజీ తరువాయి)

అవతరించిందామె. మంధాన కంటే ముందు మిథాలీ రాజ్ ఈ క్లబ్‌లో చేరింది. ప్రస్తుతం ఈ మాజీ కెప్టెన్ 10,868 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. న్యూజిలాండ్ సీనియర్ ప్లేయర్ సుజీ బేట్స్(10,652 పరుగులు) రెండో స్థానంలో, ఇంగ్లండ్ క్రికెటర్ చార్లొట్టే ఎడ్వర్డ్స్ (10,273 పరుగులు) మూడో స్థానంలో ఉన్నారు. 9,301 రన్స్‌తో స్టేఫానీ ట్టేఫానీ (వెస్టిండీస్) ఐదో ప్లేస్‌లో నిలిచింది. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మేగ్ లానింగ్ 8,352 పరుగులతో ఆరో స్థానంలో ఉంది.

## ఉద్యమకారులకు 250 గజాల స్థలమివ్వాలి



ప్రజాపక్షం / ఖైరతాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ప్లాట్, నెలకు రూ.25వేల గౌరవ వేతనం చెల్లించాలని పలువురు వక్తలు కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల జెఏసి (టియుజెఎసి) చైర్మన్ బోగే పద్మ అధ్యక్షతన ఉద్యమ కళాకారుల ధూం ధాం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ సీనియర్ ఉద్యకారులు చెరుకు సధాకర్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ప్రొ. భాగయ్య, ప్రొ. కూరపాటి వెంకటనారాయణ, గద్దర్ ఫౌండేషన్ చైర్మన్ సూర్యం గద్దర్ హాజరై, మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులందరికీ ఉద్యోగం లేదా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. బోగే పద్మ మాట్లాడుతూ తక్షణమే తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. గుండుమల్ల శ్రీను, కోతి మాధవి, ఏలూరి బాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో తెలంగాణ ఉద్యమకాలరు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్, తెలంగాణ జర్నలిస్టు ఫ్రంట్ మోహన బైరాగి, తెలంగాణ ఉద్యమకారుల వేదిక అధ్యక్షులు బత్తుల సోమయ్య, గోధుమల కుమారస్వామి, వందలాది మంది ఉద్యమకారులు, కళాకారులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com